# రాజసింహ

రూపనగరం రాజస్థాన్‌లోని పర్వత ప్రదేశంలో ఒక చిన్న రాజ్యం. దానికి రాజు విక్రమసింహుడు. చిన్న రాజ్యానికి పెద్దపేరు గల రాజుండటం చూసి ఎవరూ ఆశ్చర్యపడ నవసరంలేదు. రాజు పేరొక్కటి తప్పితే-రాజ్యం చిన్నది, రాజధానీనగరం చిన్నది, రాజప్రాసాదం చిన్నది.

విక్రమసింహుడి అంతఃపురంలోని ఒక చిన్నమందిరంలో అయిదారుగురు సుందరవదనులు చేరి ఒక వృద్ధురాలిని ఆటలు పట్టించి ఎకసక్కె లాడుతున్నారు. పాపం, ఆ వృద్ధస్త్రీ చిత్రపటా లమ్ముకొని జీవించే ముస్లింమతస్థురాలు. ఆమె అంతఃపురానికి చాలా చిత్రపటాలు తెచ్చింది. ఆమె చుట్టూ చేరిన యువతుల్లో ఒకతె, దంతనిర్మితమైన ఫలకంమీద చిత్రించబడిన ఒక పటాన్ని వృద్ధురాలికి చూపుతూ "ఇది ఎవ్వరి చిత్రపటం?" అని అడిగింది.

"అమ్మా, అది షాజహాన్ పాదుషావారిది," అన్నది వృద్ధురాలు.

"ఇది షాజహాన్ పాదుషాదా? నేను నమ్మను. ఈ గడ్డం చూస్తే, బారెడు పొడుగున, మా తాతగారి గడ్డంలా వున్నది", అన్న దా సుందరి

"మీ తాతగారి పేరు తెస్తా వెందుకే? ఆ గడ్డం నీ మగనిది. అందులో ఒకరోజు తేలు చిక్కుకుపోతే, చీపురుకట్టతో కొట్టి చంపానని నువ్వేగదా నాకు చెప్పింది," అన్న దొక యువతి.

ఆ ఛలోక్తికి అందరూ విరగబడి నవ్వసాగారు. అంతలో దాపుల ఏదో చప్పుడై అందరూ అటుకేసి తలలు తిప్పి చూశారు. వృద్ధురాలుకూడా అటుకేసి చూసి నిశ్చేష్టితురా లైంది. చంద్రకాంతశిలానిర్మితమైన సుందరశిల్పా న్నేదో చూస్తున్నా నన్న భ్రమతో ఆమె తబ్బిబ్బయిపోయింది. అంతలో ఆ సుందరశిల్పం పెదాలమీద చిరునవ్వు కదుల్లాడింది. వృద్ధురాలు తనచుట్టూ చేరిన యువతులకేసి ఆశ్చర్యంగా చూసింది. వా రందరూ ఒక్కసారిగా ఫక్కుమని నవ్వారు. వృద్ధురాలు కూచున్న చోటునుంచి లేచి, ఆ ప్రతిమాసుందరికి సాష్టాంగప్రణామం చేసింది. ప్రతిమ కదిలి ముందుకు వచ్చి, వృద్ధురాలితో, "నీ దగ్గిర వున్న చిత్రపటాలన్నీ

---

బంకించంద్ర చట్టోపాధ్యాయ

చూపించు." అని అడిగింది ఆ అపురూపసుందరి రూపనగర ప్రభువైన విక్రమ సింహుడి కుమార్తె, చంచల

వృద్ధురాలు తనవద్ద వున్న ఒక్కొక్క చిత్రపటాన్నే చంచలకుమారికి చూపించ సాగింది అక్బరు, జహంగీరు, షాజహాను——యిలా అన్నీ ముసల్మాను చక్రవర్తుల పటాలనే తనముందు పెట్టేసరికి చంచలకుమారి కొంచెం విసువుగా "నీ దగ్గర హిందూరాజుల చిత్రపటా లేమీ లేవా ?" అని ప్రశ్నించింది

ఆ ప్రశ్న వింటూనే వృద్ధురాలు తత్తరపడుతూ పెట్టెలోనుంచి మరికొన్ని పటాలు తీసి "చూడండమ్మా, ఈయన మానసింహుడు, వీరబలుడు, జయసింహుడు—" అంటూ చెప్పేంతలో, చంచలకుమారి కసురుతున్నట్టు "యీ పటాలు నేను కొనను వీరు హిందువులు కారు ముస్లిం ప్రభువులకు బానిసలు" అన్నది

రాజకుమారి అలా అనేసరికి వృద్ధురాలు కొంచెం భయపడి "అమ్మా నన్ను క్షమించండి నేను చిత్రపటా లమ్ముకొని బతికేదాన్ని నాకు ఎవ రెవరికి బానిసలో తెలియదు ఇదిగో ఈ పెట్టెలో వున్న పటా లన్నీ మీ ముందు పెడతాను కావలసిన వేవో తీసుకోండి" అంటూ, పెట్టెలో వున్న చిత్రపటా లన్నిటినీ ఎత్తి బయట పెట్టింది కాని అలా పెట్టేటప్పుడు ఒక పటాన్నిమాత్రం తీసుకొని చాటుగా దాచింది అది గమనించిన చంచలకుమారి 'అవ్వా ఆ పటం ఎందుకు దాచ ప్రయత్ని స్తున్నావ్ ? ఆ చిత్రపటం ఎవ్వరిది ?' అని అడిగింది

"అమ్మా నా అపరాధం మన్నించండి ఆ పటం చూపించమని నన్ను బలవంత పరచకండి ' అన్నది వృద్ధురాలు వణికిపోతూ

'నీ కొచ్చిన భయం ఏమీలేదు ఆ చిత్రపటం ఎవరిదో చూడనియ్' అన్నది చంచలకుమారి

'అమ్మా ఆ చిత్రపటం మీ వంశానికి శత్రువైనవానిది అన్నది వృద్ధురాలు

"ఎవ రా శత్రువు ?"

'రాణా రాజసింహుడు '

వృద్ధురాలి జవాబు వింటూనే చంచలకుమారి చిరునవ్వు నవ్వుతూ అవ్వా, స్త్రీజాతికి పురుషు లెవరూ శత్రువులు కారు ఆ చిత్రపటం కొంటాను, నా కిచ్చెయ్యి." అంటూ చేయి చావింది వృద్ధురాలు రాజసింహుడి చిత్రపటాన్ని ఆమె కందించింది

చంచలకుమారి రాజసింహుడి చిత్రపటాన్ని చూసి పులకితురాలైంది ఆమె ముఖం వికసించటం చూసిన చెలికత్తెలు ఆమె చుట్టూ చేరి "రాకుమారీ, మమ్మల్ని కూడా ఆ నవమన్మథు డెవరో ఒకసారి చూడనీ", అని అడిగారు



చంచలకుమారి చిత్రపటాన్ని వాళ్ల కిస్తూ, "నా అభ్యంతర మేముంది? చూడండి," అన్నది.

చిత్రపటంలోని రాజసింహుడు యౌవ్వను డేం కాదు. కాని, అతని రూపురేఖలు అందర్నీ ఆకర్షించినై. చెలికత్తెలు అతడి అందచందాలను ప్రశంసించసాగారు. అది గమనించిన వృద్ధురాలు ఆ పటానికి పెద్దవెల అడగాలని నిశ్చయించుకుని, చంచలకుమారితో, "రాకురాణీ ! తమకు వీరపురుషుల చిత్రపటాలు కావలసివుంటే, నాదగ్గిర యింకా కొన్ని వున్నవి", అంటూ కిందపడివున్న పటాల అడుగునుంచి, ఒకదాన్ని తీసి రాకుమారి చేతి కిచ్చింది.

చంచలకుమారి ఆ చిత్రపటంకేసి ఓ క్షణకాలం చూసి, "ఈ పటం ఎవరిది ?" అని అడిగింది.

"ఔరంగజేబు చక్రవర్తిది", అన్నది వృద్ధురాలు.

"అలాగా. అయితే, యిదీ తీసుకుంటాను," అన్నది చంచలకుమారి. తరవాత ఆమెచెలికత్తె నొకదాన్ని పిలిచి వృద్ధురాలికి తాము తీసుకున్న చిత్రపటాలకు డబ్బు తెచ్చి యివ్వమన్నది. ఆ చెలికత్తె అటు పోగానే, తక్కినవారితో, "మీ రంతా ఇటు రండి. చిన్న వినోదం నడుపుదాం", అన్నది.

"రాకుమారీ, ఏమి టా వినోదం?" అన్న దొక చెలికత్తె.

"ఈ ఔరంగజేబు చిత్రపటాన్ని నేలమీద పెడతాను. మీలో ప్రతిఒక్కరూ వచ్చి ఎడమకాలితో పటాన్ని ఒక్క తన్ను తన్ని పోవాలి. ఎవరి కాలితాపుకు అతడిముక్కు బద్దలవుతుందో చూదాం", అన్నది చంచలకుమారి.

చంచల యిలా అనగానే ఆమె సఖుల ముఖాలు వివర్ణమయినై. వారిలో ఒకతె, "రాకుమారీ! మీ రిలాంటి మాట లనగూడదు. గోడలకు చెవు లుంటై. ఈ మాటలు ఆనోటా ఆనోటాపడి ఢిల్లీనగరం చేరితే, మన రూపనగర్ దుర్గంలో ఒక్కరాయి కూడా యథాస్థానంలో నిలవదు," అన్నది.

చంచలకుమారి తనచెలికత్తెల ముఖాలకేసి ఒకసారి పరీక్షగా చూసింది. వారిలో ఎవరూ అలాంటి సాహసానికి ముందుకొచ్చేలా కనిపించలేదు. అప్పుడు తానే, నేలపై పడివున్న ఔరంగజేబు చిత్రపటంకేసి కదిలేంతలో, నిర్మల అనే ఆమె ముఖ్యసఖి, ఆమెను సమీపించి వేళ్లతో పెదాలు మూస్తూ, "ఇక ఏనాడూ ఇలాటి మాట లన" కంది.

చంచలకుమారి చిరునవ్వు నవ్వి తలాడిస్తూ, చిత్రపటాన్ని సమీపించి, ఎడమ కాలు దానిపైన పెట్టి గట్టిగా తొక్కింది. పటం చిటపటమంటూ పగిలి ముక్కలు ముక్కలై పోయింది. అందరూ భయవిహ్వాలు లై పోయారు.

చంచలకుమారి ఏమీ తొణకకుండా, "చిన్నపిల్లలు బొమ్మలపెళ్ళిళ్లు చేసి కోరికలు తీర్చుకున్నట్టే, నేను యీ ఔరంగజేబుపాదుషా చిత్రపటాన్ని తొక్కి ముక్కముక్కలు చేసి నాకోర్కె తీర్చుకున్నాను. కాని, సఖీ నిర్మలా! నే నెప్పటికైనా నిజంగానే, ఆ ఔరంగజేబు ముఖంపై......" మాట పూర్తికాకముందే నిర్మల, రాజకుమారి నోరు నొక్కింది. కాని, ఆమె అనదలిచినమాట ఏమిటో అందరికీ అర్థమైపోయింది. వృద్ధురాలు భయంతో వణికిపోతున్నది. అంతలో డబ్బుకోసం వెళ్ళిన చెలికత్తె, డబ్బు తెచ్చి ఆమె చేతి కిచ్చింది. ఆ డబ్బు అందుకుంటూనే వృద్ధురాలు చిత్రపటాలపెట్టె ఎత్తుకుని, మందిరంలోనుంచి బయటికి వెళ్ళిపోయింది.

నిర్మల, వృద్ధురాలు భవనప్రాంగణద్వారం దాటేసమయానికి వెనకనుంచి పరిగెత్తుకుంటూవచ్చి, ఆమెచేతిలో ఒక మొహరీ పెడుతూ, "ఓ అవ్వా! నీవు



యిక్కడ విన్నమాట లెవరితోనూ చెప్పకు. మా రాజకుమారి యింకా చిన్నపిల్ల. ఆమె తెలిసీతెలియక అనే మాటల కేమీ విలువలేదు." అన్నది.

వృద్ధురాలు నిర్మల యిచ్చిన మొహరీని కళ్ళ కద్దుకుని. "అమ్మా! ఠాకురాణి అన్నమాటలు ఎవరితోనైనా అనదగినవా? ఆమాత్రం నాకు తెలియదా!" అన్నది.

నిర్మల తిరిగి వచ్చేసరికి చంచలకుమారి ఒంటరిగా గదిలో కూచునివున్నది. ఆమె ముందు చాలా చిత్రపటాలు గుట్టగా పెట్టి వున్నవి. ఆమె ఒకపటాన్ని శ్రద్ధగా పరిశీలిస్తున్నదల్లా, నిర్మల రావటం చూస్తూనే దాన్ని గుట్టలో కలిపివేసింది.

"నువ్వు అంత ప్రేమగా చూస్తున్న చిత్రపట మెవ్వరిదో నాకు తెలుసు చంచలా," అంటూ నిర్మల రాజకుమారిభుజం గిల్లింది.

చంచల కోపం వచ్చినదానిలా ముఖంపెట్టి, "నువ్వు నామీద ఏదో నిందారోపణ చేయచూస్తున్నావ్. సరేగాని, యిక్కడవున్న చిత్రపటాల్లోనివారిలో ఎవరిని నువ్వు పెళ్ళాడ దలిచావ్?" అని ప్రశ్నించింది.

"నేను పెళ్ళాడదలచినతని చిత్రపటాన్ని నువ్వు కాలితో తొక్కి పగల కొట్టేశావ్," అన్నది నిర్మల.

"ఔరంగజేబునా నువ్వు పెళ్ళాడదలచింది?"

"అవును. ఏం, ఆశ్చర్యంగా వుందా?"

"ఆ దుర్మార్గుణ్ణి........."

చంచలకు నిజంగానే కోపం వచ్చిందని గ్రహించిన నిర్మల, "అంత కోప మెందుకు సఖీ? నిజంగా ఔరంగజేబు నా చేతుల్లో పడితే, అతడు హిందువు డవుతాడు," అన్నది.

"నువ్వో మూర్ఖురాలివి," అన్నది చంచల కటువుగా.

"అంతే, నేను మూర్ఖురాలినే. నువ్వు తిప్పితిప్పి చూస్తున్న చిత్రపట మెవరిదో తెలియనంత మూర్ఖురాలిని మాత్రం కాదు," అన్నది నిర్మల.

"నువ్వు నిష్కారణంగా నామీద దోషారోపణ చేస్తున్నావు," అన్నది చంచల

"ఇంతలో దోషారోపణ ఏమీలేదు. నువ్వు పద్ధెనిమిదేళ్ళు నిండిన కన్నెపడుచువు రూపనగర మహారాజుగారి ఏకైక సంతానానివి. నువ్వు అంతగా ముచ్చటపడు తున్న అతడి చిత్రపటం యీ దొంతరలో నుంచి తీయమంటావా?" అంటూ నిర్మల చిత్రపటాల దొంతరలో వెతికి ఒక పటాన్ని బయటికి తీసి, "నువ్వు ప్రేమించింది యీ ముసలిరాజునే గదా?" అన్నది.

"ఛీ, యీయన ముసలిరాజా? నీ కేమైనా కళ్ళు పోయినయ్యా!" అన్నది చంచలకుమారి కోపంగా.

"ఈ చిత్రపటంలో మహారాజా రాజసింహుని వయసు నీకు తెలియకపోవచ్చు కాని, ఆయనకు వివాహయోగ్యమైన వయసుగల యిద్దరు కొడుకు లున్నారని నీవు వినలేదా?" అని ప్రశ్నించింది నిర్మల.

చంచలకుమారి తల వంచుకుని చిన్నగొంతుతో, "వీరపురుషుల విషయంలో వయో రూపాలను గురించి ఎవరు లెక్కిస్తారు? గిరిసుత ఎవరిని వివాహమాడింది? భస్మచర్మాంబరధారినే గదా? లోపాముద్ర, సుకన్యల మాటేమిటి?" అన్నది.

నిర్మల ఏదో అనబోయి అంతలోనే సర్దుకున్నది. ఆమెకు, రాజసింహుడితో చంచలకుమారి వివాహం సాధ్యపడేది కాదన్న గట్టినమ్మకం వున్నది.

## 2

రూపనగర రాజప్రాసాదంలో చిత్రపటా లమ్మిన వృద్ధురాలు తన స్వస్థానమైన ఆగ్రాపట్టణానికి తిరిగి వచ్చింది. ఆమెకు చంచలకుమారి చేసిన పని ఎవరితోనైనా చెప్పితే కాని మనసు కుదుటపడేటట్టు లేదు. కాని, ఆ రహస్యం ఎవ్వరికీ చెప్పనని ప్రమాణంచేసి లంచంగా ఒక మొహరీ పుచ్చుకునివున్నది. ఇప్పు డేమి చేయటం?

వృద్ధురాలు యిలాంటి సంకటస్థితిలో వుండగా, ఢిల్లీలో చిత్రపటాల వ్యాపారం చేసే ఆమె కుమారుడు ఖిజర్ షేక్ ఆగ్రా వచ్చాడు. అతడికి మృష్టాన్న భోజనం పెట్టి, వృద్ధురాలు, "బేటా! ఢిల్లీలో నీ వ్యాపారం ఎలా సాగుతున్నది? నేను

విన్ననే రూపనగరం నుంచి తిరిగి వచ్చాను. అయ్యో ఆ నగరం... ఆ రాజకుమార్తె..." అంటూ మాటలు తడబడగా మౌనం వహించింది.

తనతల్లి ఏదో ముఖ్యవిషయం చెప్పేందుకు ప్రయత్నించి, ఏ కారణంవల్లనో సంశయించి వూరుకున్నదని గ్రహించిన ఖిజర్ షేక్, "అమ్మా! ఏమి టక్కడి విశేషాలు?" అని ప్రశ్నించాడు.

"విశేషాల కేమి నాయనా, ఎన్నయినా వున్నవి. కాని, ఎవరితోనూ చెప్పనని ఒక మొహరీకూడా లంచం పుచ్చుకున్నాను. అయినా, ఆ రాజకుమారికి అంత పొగరా? చక్రవర్తి ఔరంగజేబునే..." అంటూ కుమారుడి ముఖంలోకి భీతిగా చూసి, "మన కెందుకొచ్చిన గొడవలే. ఆ పొగరుబోతు పిల్ల తన నేరాని కేదో ఒక నాడు శిక్ష అనుభవిస్తుంది," అని వూరుకున్నది.

ఖిజర్ షేక్ ఎగిరి గంతేసి నిలబడ్డాడు. అతనికి తనతల్లి రూపనగరం నుంచి ఏదో గొప్ప రహస్యం తెలుసుకు వచ్చిందన్న గట్టి నమ్మకం కలిగింది. అటువంటి రహస్యవార్తను ఢిల్లీకోటలో చాలా వెలయిచ్చి కొంటారు.

"అమ్మా, ఎందుకంత కంగారుపడిపోతావు? కొడుకుతో చెప్పగూడనంత పెద్దరహస్యం ఏ తల్లికైనా వుంటుందా? రూపనగర రాజకుమార్తె అతిలోక సౌందర్యవతి అని విన్నాను. ఆమె ఏంచేసింది? చక్రవర్తిని తిట్టిందా?" అని అడిగాడు ఖిజర్ షేక్.

"బేటా. వట్టి నోటిమాటలైతే మునిగిపోయిం దేమిటి? అంతకంటె పెద్ద ఘోరమే చేసింది. చక్రవర్తి ఔరంగజేబు చిత్రపటాన్ని కాలితో తన్ని..." అంటూ వృద్ధురాలు పెద్ద శోకం పెడుతూ, "నేను నమ్మకద్రోహం చేశాను. మొహరీ పుచ్చుకుని ఒట్టు పెట్టుకుని కూడా, రాజకుమార్తె పాదుషాకు చేసిన అవమానం యితర్లకు చెప్పేశాను. నాకు నరకం తప్పదు," అన్నది.

ఖిజర్ షేక్ తల్లి భుజం పట్టుకుని వూరుకోమని సముదాయిస్తూ, "ఇందులో నువ్వు చేసిన నమ్మకద్రోహం ఏమీ లేదు. నాతో ఒక్కడితోనే గదా ఆ సంగతి చెప్పింది? కన్నకొడుకు యితర్లతో సమానమా? ఏడవకు, ఊరుకో," అన్నాడు.

"ఈ రహస్యం ను వ్వెవరితోనూ అనవు గదా? తన చిత్రపటానికి జరిగిన అవమానం సంగతి చక్రవర్తికి తెలిస్తే, ఆయన, పాపం ఆ రాజకుమారికి ఎన్నికష్టాలైనా కలిగించవచ్చు. ఆవిడ యింకా ఇరవై ఏళ్ళయినా నిండని పసిది. ఎంత అందమైన పిల్లనుకున్నావ్! అన్ని అలంకారాలతో ఎవడో గొప్ప శిల్పి చెక్కిన పాలరాతి విగ్రహంలా వుంటుంది," అన్నది వృద్ధురాలు.

"ఎవ రెలా వుంటే మనకేంలే అమ్మా! చక్రవర్తి చిత్రపటాన్ని కాలితో తొక్కి ముక్కముక్కలు చేసిం దన్నమాట! ఎంత అపరాధం!" అన్నాడు ఖిజర్ షేక్.

. "కాలంటే కాలా, ఎడమకాలితో అనుకో. పేరుకు తగ్గ పిల్ల...చంచలకుమారి. రూపనగర రాజుకు, ఆమెతప్ప మరి సంతు లేదట," అన్నది వృద్ధురాలు.


ఖిజర్ తల్లితో ఆ విషయం గురించి ఆగ్రాలో వున్నంతవరకూ మరి ప్రస్తావించలేదు. మర్నాడు ఢిల్లీకి వెళుతూనే, యీ రహస్యాన్ని కోటలో చెప్పించి ఎంత డబ్బు గుంజటమా అని ఆలోచించాడు. ఖిజర్ షేక్‌కు ఢిల్లీనగరంలో చిత్రపటా లమ్మే అంగడి ఒకటున్నది. ఆ అంగడికి వెనకభాగంలోనే అతడి కాపురం కూడా. అతడి బీబీపేరు ఫాతిమా. ఖిజర్ ఆమెకు తన తల్లిద్వారా విన్నవిషయం గురించి చెప్పి, "నువ్వు వెంటనే దరియాబీబీ దగ్గిరకు వెళ్ళి, ఆ రూపనగర రాజకుమార్తె చక్రవర్తి ఔరంగజేబు చిత్రపటానికి చేసిన అవమానం గురించి చెప్పిరా. ఆ తరవాత ఆవిడే అన్నిసంగతులూ ఆలోచించుకుంటుంది. ఏమైనా కోటలో యీసారి ఆవిడకు పెద్ద బహుమానమే రావచ్చు. అందులో మన వంతేదో మనకు తప్పక యిస్తుంది," అన్నాడు.

ఫాతిమా ఎక్కడలేని సంతోషంతో దరియాబీబీ యింటికి వెళ్ళింది. వాళ్ళిల్లు ఖిజర్ షేక్ అంగడి నానుకొనే వున్నది. దరియాబీబీ అసలు పేరు దరీర్ ఉన్నీసా. కాని అందరూ ఆమెను దరియాబీబీ అనే పిలుస్తారు. ఆమెకు తలిదండ్రులు లేరు, ఒక్క అక్కగారుమాత్రం వున్నది. దరియాబీబీ గొప్ప సౌందర్యవంతురాలు.

దరియాబీబీ అక్క మంచిమంచి అత్తర్లూ, సుర్మాలూ చేయటంలో చాలా నేర్పరి. దరియా వాటిని ధనవంతుల యిళ్ళకు తీసుకుపోయి అమ్ముకుని వస్తుంది. పాదుషావారి అంతఃపురానికి పురుషులమాట అటుంచి, యితరత్రా స్త్రీలు కూడా వెళ్లేందుకు అవకాశంలేదు. కాని దరియామాత్రం నిరాటంకంగా అక్కడకు వెళ్ళగలదు. ఆమెవద్ద ఔరంగజేబు జ్యేష్ఠపుత్రిక అయిన జేబున్నీసా యిచ్చిన ఫర్మానా వున్నది.

ఫాతిమా, దరియాబీబీతో ఖిజర్ చెప్పిన సంగతంతా చెప్పి, "దరియా, నువ్వు యిప్పుడే కోటలోని రంగమహాలుకు వెళ్ళి, యీ రహస్య వృత్తాంతం చెప్పి డబ్బు తీసుకురా. అందులో మా భాగంమాట మరిచేవు," అన్నది.

"ముందు బహుమానం రానియ్యి, తరవాత ఆలోచిద్దాం. ఇంతకూ ఆ రంగమహాలుకు పోవటం ఎలాగబ్బా?" అన్నది దరియా.



"నాదగ్గిర నీ కపటనాటకం చెల్లుబడి కాదు దరియా! నీదగ్గర వున్న ఫర్మానా సంగతి నాకు తెలియదనుకున్నావా?" అన్నది ఫాతిమా.

దరియాబీబీ ముసిముసినవ్వులు నవ్వుతూ పెట్టెలోనుంచి ఫర్మానా తీసుకొని దుస్తుల్లో దాచి, కొన్ని సుర్మాడబ్బాలూ, కొన్ని అత్తరు సీసాలూ తీసుకొని ఇంటి నుంచి బయలుదేరింది.

కోటకు పోయేదారిలో వున్న చాందినీచౌక్ ప్రాంతమంతా మహా కోలాహలంగా వున్నది. నవాబు సైన్యంలోని రాజపుత్ర, మొగల్ యోధులు అశ్వముల నధిరోహించి అక్కడ విలాసంగా తిరుగుతున్నారు. స్త్రీ పురుష నర్తకులు సారంగవాయిద్యాలతో పాడుతూ ఆడుతున్నారు. ఒక ప్రక్క జ్యోతిష్కులు కంబళులు పరచి వాటిమీద తాటియాకు గ్రంథములు పెట్టుకుని మూల్యం చెల్లించగలవారికి భవిష్యత్ కాల వృత్తాంతాలు చెబుతున్నారు. మొగలాయీల పరిపాలనలో జ్యోతిశ్శాస్త్రానికి గొప్ప గణన వుండేది. నవాబుల దగ్గరనుంచి సామాన్య పౌరులవరకూ — అందరూ జ్యోతిషం తెలుసుకోకుండా ఏ ముఖ్యకార్యంలోనూ ప్రవేశించేవారుకాదు. ఔరంగజేబు కడగొట్టు కొడుకైన అక్బరు అనేవాడు తండ్రిమీద ఎదురు తిరిగి, ఆ సమయంలో పాదుషా దగ్గిరకన్న తనదగ్గిర ఎక్కువ సైన్యం వున్నా, జ్యోతిషంలోని నమ్మకంతో అతడిమీద దాడి చేయక తాత్సారం చేసి, ఔరంగజేబు హఠాత్తుగా చేసిన దాడితో చిత్తుగా ఓడిపోయాడు.

దరియాబీబీకి చాందినీచౌక్ దగ్గరకు రాగానే జ్యోతిషం చెప్పించుకోవాలన్న బుద్ధి పుట్టింది. ఆమెకు మార్గంప్రక్కనే చిత్రాసనం వేసుకుని, తురాయి పెట్టిన పెద్ద తలగుడ్డ చుట్టుకునివున్న ఒకజ్యోతిష్కుడు కనిపించాడు. అతని చుట్టూ కొందరు

పురుషులు, మేలిముసుగులు వేసుకున్న కొందరు స్త్రీలూ నిలబడివున్నారు. దరియా బీబీ తన మేలిముసుగు సవరించుకొని ఆ గుంపుదగ్గరకు పోయి నిలబడింది. అంతలో ఒక మేలుజాతి గుర్రా న్నెక్కిన నవయవ్వను డొకడు అటుగా వచ్చాడు. అతడి దుస్తులతీరు చూస్తే మొగలాయీవంశస్థుడిలా కనిపించుతున్నాడు. మిలమిల మెరిసే అతడి శరీరకాంతీ, ముక్కూ మొగాల తీరూ చూసి, మేలిముసుగులు ధరించిన కొందరుయువతులు వాటిని కొంచెంగా పక్కకు తొలగించి అతడికేసి చూడసాగారు.

దరియాబీబీ ఆ యువకుణ్ణి చూస్తూనే నిస్సంకోచంగా అతణ్ణి సమీపించి గుర్రం కళ్ళెం పట్టుకున్నది. యువకుడు కొంచెంగా తత్తరపోయి, "ఎవరు నువ్వు" అని కటువుగా ప్రశ్నించాడు.

"అయ్యో దేవుడా, గుర్తించలేదా నన్ను?" అన్నది దరియా మేలిముసుగు కాస్త తొలిగించి, అతడికేసి తలఎత్తిచూస్తూ.

"దరియాబీబీయా ! ఇక్కడి కెందుకొచ్చావ్?" అన్నాడు యువకుడు.

"ఏం, రాకూడదా?" అన్నది దరియా.

"రాకూడదనేందుకు నీమీద నా కేం అధికార మున్నది? సరే, కోప్పడకు. నీ కేం కావాలి?" అని అడిగాడా యువకుడు.

"నీ ధనం నా కవసరంలేదు.—అది నాకు నిషిద్ధం. అంటదగినదికూడా కాదు. సుర్మాలూ, అత్తర్లూ అమ్ముకుని నాపొట్ట నేను పోసుకుంటాను," అన్నది దరియా.

"అదంతా నీ యిష్టం. యింతకూ గుర్రం కళ్ళెం పట్టుకుని న న్నెందు కిక్కడ ఆపావ్?" అన్నాడు యువకుడు విసుగ్గా.

ముబారక్ గుర్రం దిగుతూనే "ఏమిటో చెప్పు?" అని ప్రశ్నించాడు.

దరియాబీబీ జ్యోతిష్కుడి చుట్టూ చేరిన గుంపును చూపిస్తూ, "యిక్కడి కొక కొత్త జ్యోతిష్కుడు వచ్చిరూచున్నాడు. చాలా గొప్పవాడని చెవుతున్నారు. నీ చేయి అతడి కోసారి చూపించు," అన్నది.

"నా జాతకం ఎలా వున్నదో తెలిసినందువల్ల నీ క్కలగబోయే లాభం ఏమీలేదు. నీ జాతకం ఎలావున్నదో చూపించుకో," అన్నాడు ముబారక్.

"నా జాతకం ఎలా తగలబడితే ఏంలే! ముందు నీ జాతకం ఎలా వున్నదో చూద్దాం," అంటూ దరియా ముబారక్ చేయి పట్టుకుని, అతణ్ణి గుంపుకేసి లాక్కుపోయింది; ముబారక్‌ను చూస్తూనే గుంపులోనివారు అతడికి దారి యిచ్చారు.

జ్యోతిష్కుడు ముబారక్ చేయి పరీక్షించి, చిన్నగొంతుతో కొంతసేపు ఏదో చెప్పి, చివరకు పెద్దగా, "ఇక చెప్పేందు కేమీలేదు. త్వరలో వివహాం చేసుకోండి. మేలు కలుగుతుంది," అన్నాడు.

గుంపులో నిలబడివున్న దరియాబీబీ, "ఆయన కిదివరకే పెళ్ళయింది," అంటూ కేకపెట్టింది.

"ఆ కేక పెట్టిం దెవరు" అన్నాడు జ్యోతిష్కుడు.

"అదో పిచ్చిమనిషి! ఒక్కమాట చెప్పండి. నా కెలాంటి స్త్రీతో వివాహం అవుతుంది?" అని అడిగాడు ముబారక్.

"మీ రొక రాజపుత్రికను వివాహ మాడతారు," అన్నాడు జ్యోతిష్కుడు.

"అందువల్ల నాకు మే లవుతుందా?" అని ప్రశ్నించాడు ముబారక్.

"తప్పక; మీ ఉద్యోగం, హోదా పెరుగుతుంది."

"చావుకూడా దగ్గిర పడుతుంది," అన్నది దరియాబీబీ.

"ఆ కేక పెట్టిందెవరు?" అన్నాడు జ్యోతిష్కుడు.

"అదో పిచ్చిమనిషి!" అంటూ ముబారక్ విసుక్కున్నాడు.

"పిచ్చిదే కాక, మానవాతీతమైన వ్యక్తిత్వంలాగాకూడా కన్పిస్తున్నది. ఇక చూసి చెప్పేందుకు మీ హస్తంలో ఏమీలేదు," అన్నాడు జ్యోతిష్కుడు.

ముబారక్ జ్యోతిష్కుడికి కొంత డబ్బిచ్చి, గుంపులోనుంచి బయటపడి దరియా బీబీ కోసం వెతికాడు. ఆమె కనిపించలేదు. అప్పు డతను దిగులు గుండెతో గుర్రా న్నెక్కి కోటకేసి బయలుదేరాడు.

౩

మొగలు పాదుషా అయిన ఔరంగజేబుకు ముగ్గురు కుమార్తెలు. వారిలో కడ గొట్టువా రిద్దరూ వివాహాలు చేసుకొన్నారు. కాని అందరికన్న పెద్దదయిన జేబున్నిసా అవివాహితురాలు. ఆమె పాదుషావారి అంతఃపురానికి — దానినే రంగమహల్ అంటారు — అధికారిణి. ఆమెకింద అనేకమంది ప్రతీహారిణులు, కొజ్జాలు, దాసీలు, కావలివారు, వంటవాళ్ళు వుండేవారు. అంతఃపుర స్త్రీజన రక్షణకు తార్తార యువతులు నియమింపబడెడివారు. ఇంతమంది బలగానికి అధికారిణి అయిన జేబున్నీసా పదవితో సమానమైనది. తన మేనత్త లయిన రోష నారా, జహనారాలవలనే, జేబున్నీసా కూడా ఇంద్రియసుఖాల్లో మునిగితేలుతూ వుండేది. ఆమె అనుమతితో రంగమహలుకు రెండు తరగతుల వ్యక్తులు వచ్చి పోతూండేవారు. వారిలో ఒక తరగతివారు ఆమె ప్రియులు: రెండవ తరగతివారు సామ్రాజ్య పరిస్థితులను గురించి రహస్య సమాచారం అందించే వేగులవాళ్ళు.

దరియాబీబీ ఆరోజున రూపనగర వృత్తాంతం గురించి జేబున్నిసాతో చెప్పేం దుకు రంగమహలు ద్వారాన్ని సమీపించేసరికి, లోపలినుంచి ముబారక్ గొంతు

ఆమెకు వినిపించింది. ముబారక్, జేబున్నీసా ప్రియు డని ఎరిగివున్న దరియాబీబీ ద్వారంపక్కనే నిలబడిపోయింది.

జేబున్నీసా తన కేళీగృహంలో రత్నఖచితమైన దంతపుశయ్యపై దిండ్లు నాను కుని కూర్చుని ద్రాక్షరసం సేవిస్తున్నది. ముబారక్ శయ్యపక్కనే వున్న ఒక ఆసనంమీద కూచుని ఆమె ముఖంలోకి దీనంగా చూస్తున్నాడు.

జేబున్నీసా తను తాగుతున్న పానపాత్రను ముబారక్‌కు యిస్తూ, "ఏ పిలుపూ లేకపోయినా వచ్చేవారే నిజమైన ప్రియులు," అన్నది.

ఆ మాటలకు ముబారక్ గతుకుమని "పిలుపకుండా వచ్చినందుకు మన్నించాలి. నేను ఒక యాచనకోసం వచ్చాను," అన్నాడు.

''ఓ నా పంచప్రాణమా ! ఏమిటి నీ కోరిక ?'' అన్నది జేబున్నీసా.

"నా కోరిక మరేంలేదు. శాస్త్ర సమ్మతంగా, ధర్మయుక్తంగా నేను నీకు పంచ ప్రాణాన్ని కావా లనుకుంటున్నాను," అన్నాడు ముబారక్.

జేబున్నీసా ఆ మాటలకు పకపక నవ్వుతూ, ''పాదుషా కుమార్తె లెక్కడైనా పెళ్ళిళ్ళు చేసుకుంటారా ?" అన్నది.

"నీ యిద్దరు చెల్లెళ్ళ మా టేమిటి ? వాళ్ళు చక్కగా వివాహాలు చేసుకున్నారు గదా," అన్నాడు ముబారక్.

''వాళ్ళు రాణు లయేందుకు వివాహాలు చేసుకున్నారు. పాదుషా పుత్రికలు రాజ వంశీయుల్ని తప్ప మరెవర్నీ వివాహమాడరు. సార్వభౌముడి పుత్రిక రెండువందల రూపాయల జీతంమాత్రం తెచ్చుకునే మన్సబుదారును ఎలా వివాహమాడుతుంది ?'' అన్నది జేబున్నీసా.

''నేను రాజవంశీయుణ్ని కాకపోవచ్చు. కొలువులో చాలా తక్కువ పదవిలో వున్నవాణ్ణే కావచ్చు. కాని, నీ వీ రాజ్యాని కంతకూ అధికారిణివి, పాదుషా నీ వేమి కోరినా కాదనడు,'' అన్నాడు ముబారక్.

"ఇలాంటి అనుచితమైన కార్యానికి అనుమ తివ్వమని పాదుషాను నే నెలా కోర గలను ?'' అన్నది జేబున్నీసా కటువుగా.

"ఇది అనుచితకార్యమా ?''

"అవును, అనుచితం కాక మరేమిటి ?''

''వివాహ ప్రసక్తే లేకుండా మనం యింతకాలంగా చేస్తున్నపని ఉచితమైందా ? అది చాలా పాపకార్యంగా నేను భావిస్తున్నాను," అన్నాడు ముబారక్ తలవంచు కుని దీనంగా.



అంత పాపకార్యం అనుకుంటే యీ నాటినుంచీ యిటుకేసి రాకు అన్నది జేబున్నీసా

'అది సాధ్యమైతే అలాగే చేసివుండేవాణ్ణి నేను నీ అందానికి దాసుణ్ణి అన్నాడు ముబారిక్

'దాసుడివైతే నే చెప్పినట్టు చెయ్యి సరా ? అన్నది జేబున్నీసా

ముబారక్ నిలువెల్లా కంపించిపోయాడు తను అనుకున్నదానికి పూర్తి వ్యతిరేకమైన జవాబు రావటంతో అతడికి మతిపోయినంత పనైంది ఇప్పుడు జేబున్నీసాను ప్రసన్నురాలిని చేసుకోవటం ఎలానా అన్న ఆలోచనతో పాటు కొంతసేపు మౌనంగా వూరుకుని తరవాత తల ఎత్తి దీనంగా ఆమె ముఖంలోకి చూస్తూ "ఈ దాసుడి తప్పు మన్నించకోర్తాను నన్ను దురాశా పిశాచం ఆవహించటం వల్ల అలా మాట్లాడాను నీ దయాలేశం నాపై ప్రసరిస్తున్నంతకాలం యీ ప్రపంచంలో నేను మరేమీ కాంక్షించను ' అన్నాడు

జేబున్నీసా తృప్తిగా ఒక నవ్వు నవ్వి పాత్రలో మరికొంత మద్యం పోసి అతడి కిచ్చి దా న్నతడు తాగగానే మధురోక్తులాడుతూ గదినుంచి బయటికి పంపివేశింది

ముబారక్ ద్వారం దాటి కొంచెం దూరం వెళ్ళగానే వెనకనుంచి దరియాబీబీ అతడి చేయి పట్టుకున్నది ముబారక్ ఉలిక్కిపడి ఆమెకేసి చూసి 'దరియా యిక్కడి కెందు కొచ్చావ్ ?' అని ప్రశ్నించాడు

నేను వేగుదాన్ని. షహజాది జేబున్నీసాకు వార్త లమ్మేందుకు వచ్చాను." అన్నది దరియా.

ముబారక్ గడగడ వణికిపోతూ, "ఏమిటా వార్త ?'' అని అడిగాడు.

"నీవు బజారులో జ్యోతిష్కుడికి చేయి చూపించటం, అతడు నీకు రాజపుత్రితో. వివాహం అవుతుందని చెప్పటం."

"దరియా ! నేను నీకు చేసిన ద్రోహం ఏమిటి ? నామీద యిలాంటి నేరాలు పాదుషాపుత్రికతో ఎందుకు చెప్పబోతున్నావ్ ?" అని అడిగాడు ముబారక్ దీనంగా.

''నీవు పాపాత్ముడివి కనక," అన్నది దరియా.

''నేను పాపాత్మ్ముణ్ణి కాను. మనం ఇక్కడ నిలబడి మాట్లాడుకోవడం మంచిది కాదు. ఈసారి కలుసుకున్నప్పుడు దాచకుండా అన్ని సంగతులూ నీకు చెపుతాను," అంటూ ముబారక్ వెనుదిరిగి, జేబున్నీసా దగ్గరకు పోయి, "క్షమించు, మళ్ళీ అవసరం కలిగి వచ్చాను. ఇంతకుముందు నే నన్నమాటల్లో తప్పేమైనా వుంటే క్షమించకోర్తాను. దరియాబీబీ ద్వారందగ్గిర నిలబడివున్నది. దాని కప్పుడప్పుడు బుద్ధి చలించి వెర్రెత్తుతూంటుంది. ఆ పిచ్చిది నామీద ఏవైనా నేరారోపణలు చేస్తే, నా నుంచి సంజాయిషీ తీసుకోకుండా, ముందుగానే ఆగ్రహించవద్దని ప్రార్థిస్తున్నాను," అన్నాడు.

ముబారక్ గదినుంచి బయటికి రాగానే, దరియాబీబీ గదిలో ప్రవేశించి జేబున్నీసాకు వంగి సలాం చేసింది. జేబున్నీసా చిరునవ్వు నవ్వుతూ, "ఏం దరియా ! విశేషా లేమిటి ?" అంటూ ఒక దంతపు బల్లమీద వున్న పూలతో చేసిన కుక్కనొకదానిని చేతిలోకి తీసుకుని, అటూఇటూ తిప్పిచూసి, ''దరియా ! ఇది ఎలా వున్నది ?" అని అడిగింది.

"అచ్చు మన్సబుదారు ముబారక్‌సాహెబ్‌వారిలా వున్నది," అన్నది దరియా.

''తీసుకుంటావా, యిస్తాను ?" అన్నది జేబున్నీసా.

''తమ సెల వేమిటో తెలియటంలేదు. దేన్ని తీసుకోమంటారు? ఈ శునకాన్నా? లేక మనిషినా ?'' అన్నది దరియా.

జేబున్నీసా ఒక్కసారిగా కోపంతో బొమలు ముడిచి అంతలోనే శాంతిస్తూ, "నీ యిష్టం ఏదైతే అదీ !" అన్నది.

దరియా, జేబున్నీసాకు సలాం చేసి, ''అలా అయితే శునకాన్ని హజరత్‌బేగం సాహెబావారే ఉంచుకోండి. నేను మనిషినే తీసుకుంటాను,'' అన్నది.

"ఇప్పుడు నా దగ్గర వున్నదీ కుక్కేగదా! దీన్నే తీసుకో," అంటూ జేబున్నీసా పూలకుక్కను దరియా కేసి విసిరికొట్టింది.

దరియాబీబీ దాన్ని తీసుకొని దుస్తుల్లో దాచుకుంటూ, "బేగంవారి అనుగ్రహం వల్ల నాకు కుక్కా, మనిషీకూడా లభించారు," అన్నది.

"మనిషికూడానా ?" అని ప్రశ్నించింది జేబున్నీసా ఆశ్చర్యంగా.

"అవును, మనిషికూడా. అతడు నన్ను పెళ్లాడినవాడేగదా !" అన్నది దరియా.

జేబున్నీసా ఆ మాటలు వింటూనే కళ్ళెర్రచేసి, అందుబాటులో వున్న ఒక పూల చెండును దరియాకేసి విసిరికొటుతూ, "ఛీ ఛీ, యీ అబద్ధాలు నాదగ్గర చెప్పకు. ఇక్కణ్ణుంచి తక్షణం ఇంటికి పో," అన్నది.

దరియా చేతులు జోడించి, "మా యిద్దరికీ వివాహం చేయించిన ఖాజీ మొదలైనవాళ్ళు యింకా బతికేవున్నారు. వారిని పిలిపించి నిజానిజాలు తెలుసుకోవచ్చు," అన్నది.

జేబున్నీసా బొమలు ముడిచి, "నా ఆజ్ఞ అయిందంటే క్షణంలో వారందరూ కొరత వేయబడతారు, తెలుసా ?" అన్నది.

దరియాబీబీ గడగడ వణికిపోతూ, "బేగమ్‌సాహెబా, యీ దాసురాలి తప్పులు క్షమించాలి. నేను వచ్చిన పని మరిచిపోయి, యిక్కడ అనవసర ప్రసంగం చేశాను. నేను తమకు సమాచారం విక్రయించేందుకు వచ్చాను," అన్నది.

"ఏమిటా సమాచారం ?" అన్నది జేబున్నీసా.

"నేను విక్రయించదలచినవి ఒకటికాదు, రెండు సమాచారాలు. అందులో ఒకటి, ముబారక్‌సాహెబ్‌కు సంబధించింది. కాని, యింతకుముందు తమరు చూపిన ఆగ్రహంతో ఆవిషయం బయట పెట్టటానికి భయంగా వున్నది." అన్నది దరియా.

"భయంలేదు, అదేమిటో ముందు చెప్పు."

"ముబారక్‌సాహెబా, యింతకు ముందే, చౌరస్తాలో ఒకగొప్ప జోతిష్యుడికి తన చేయి చూపించి అదృష్టఫలం చెప్పించుకున్నాడు."

"జ్యోతిష్కుడేం చెప్పాడు ?" అని అడిగింది జేబున్నీసా కుతూహలంగా.

"షహజాదీని వివాహం ఆడితే గొప్ప అదృష్టం పట్టుతుందని చెప్పాడు."

"ఇదంతా అబద్ధం, మన్సబుదార్ ముబారక్ జ్యోతిష్కుడి దగ్గిరి కెప్పుడు పోయాడు ?" అన్నది జేబున్నీసా కోపంగా.

"ఇక్కడి కొచ్చేదానికి ముందు."

"ఇక్కడి కొచ్చేదానికి ముందా? ఇక్కడికి ముబారక్ వచ్చాడా?" అంటూ జేబున్నీసా గుడ్లురిమింది.

దరియాబీబీ జవాబు చెప్పే ధైర్యం లేక నీళ్ళు నమలసాగింది. ముబారక్‌రావ్ దరియాకు తెలుసునని గ్రహించిన జేబున్నీసా, యిక ఆమెను బెదరించి లాభం లేదని గ్రహించి, "అత డొచ్చిన సంగతి నీ కెవరు చెప్పారు?" అని ప్రశ్నించింది.

"నే నిక్కడికి వస్తూ వాకిలిదగ్గిర చూశాను," అన్నది దరియా.

"ఇలాంటి అబద్ధాలు పలికేవారికి శిరచ్ఛేదమే శిక్ష."

"ఇలాంటిమాటలు బేగమ్‌సాహెబావారిదగ్గిర తప్ప మరెక్కడా నే ననను," అన్నది దరియాబీబీ బాగా వంగి సలాము చేస్తూ.

"సరే, అందుకు భిన్నంగా జరిగిందో నీ నాలుక కోయిస్తాను. ఆ రెండో సమాచార మేమిటి?" అన్నది జేబున్నీసా.

దరియాబీబీ బతుకుజీవుడా అనుకుని, చంచలకుమారి ఔరంగజేబు చిత్రపటాన్ని తన్ని ముక్కలు చేసిన సమాచార మంతా జేబున్నీసాకు చెప్పింది. అంతా శ్రద్ధగా విన్న జేబున్నీసా మందహాసం చేస్తూ, "ఇది మంచి సమాచారం. నీకు తగిన విధంగా బహుమానం యిస్తాను," అని చెప్పి, రంగమహలు కోశాధ్యక్షుడికి ఒక చీటీ రాసి, దానిని దరియాబీబీకి యిస్తూ, "ఈ చీటీ చూపి నీ బహుమానం పట్టుకుపో," అన్నది. దరియాబీబీ సలాం చేసి వెళ్ళిపోయింది.

## 4

ఢిల్లీ పాదుషా అయిన ఔరంగజేబు అంతఃపురంలో స్త్రీజనానికి లెక్కలేదు. వారిలో కొద్దిమంది నాలడు ముసల్మానుశాస్త్రప్రకారం వివాహం ఆడాడు. తక్కిన వారిలో చాలామంది నెలవారీ జీతాలు తీసుకునే విలాసవతులు.

మొగలు పాదుషాలు తమ పట్టపుదేవులుగా రాజపుత్ర కన్యలను వివాహమాడే సాంప్రదాయం మొట్టమొదటగా అక్బరు ఆచరణలో పెట్టాడు. ఔరంగజేబుకూడా ఒక రాజపుత్ర కన్యను ప్రథమంగా వివాహమాడి ఆమెను పట్టపుదేవిని చేశాడు. కాని, కొంతకాలం గడచిన తరవాత అతడు ఉదయపురిబేగము అని పిలవబడే ఒకామెను పట్టపుదేవిని చేసుకున్నాడు. ఈమె రాజపుత్రకన్య కాదు; ఒక క్రైస్తవ యువతి. ఈమెకూ ఉదయపురానికీ ఎలాంటి సంబంధమూ లేదు. ఈమె జన్మస్థానం నేటి రష్యాదేశ భూభాగంగా వున్న జార్జియా ప్రాంతం. ఈమెను ఒక బానిస వర్తకుడు ఔరంగజేబు అన్న అయిన దారాకు అమ్మాడు. దారా ఆమె సౌందర్యానికి

ముగ్ధుడై, ఆమెను తన ప్రధానభార్యగా చేసుకున్నాడు తరవాత సింహాసనంకోసం ఔరంగజేబుకూ అతడికీ జరిగిన యుద్ధంలో ఔరంగజేబు అతణ్ణి ఓడించి, ఖైదీగా పట్టుకుని క్రూరమైన హింసకు గురిచేసి చంపి అతడిభార్య అయిన ఉదయపురిని తాను వివాహం ఆడాడు దీనితో అలలు పట్టమహిషి అయిన యోధపురిబేగము అంతఃపురంలో తన ప్రాధాన్యతను కోల్పోయింది పేరుకు యోధపురిబేగము పట్టమహిషి కాని, ఔరంగజేబు ప్రేమాభిమానాలను చూరగొన్న ఉదయపురి అంతఃపురంలో అన్ని అధికారాలూ చెలాయించేది ఔరంగజేబు ఆమెమాటకు ఎదురాడేవాడు కాదు జేబున్నీసాకూడా ఉదయపురిబేగమంటే భయపడేది

జేబున్నీసా రూపనగర రాజపుత్రిక చంచలకుమారిని గురించి దరియాబీబీ ద్వారా విన్న సమాచారం ఉదయపురిబేగంతో ముందుగా చెప్పి ఆమెద్వారా ఔరంగజేబును ప్రతీకారానికి పురికొల్పాలని నిశ్చయించుకున్నది ఆరాత్రి ఆమె ఉదయపురి శయనాగారానికి వెళ్ళేసరికి, ఉదయపురిబేగం బాగా మద్యపానం చేసి హుక్కా పీల్చుతూ హంసతూలికాతల్పంమీద అరమోడ్పు కన్నులతో పడుకుని వున్నది

జేబున్నీసా గదిలోకి వెళ్ళి ఉదయపురికి సలాం చేసి "అమ్మా ! మీకిప్పుడు తీరుబాటుగా వున్నదా ? ఒక ముఖ్యవిషయం చెప్పటానికి వచ్చాను " అన్నది

ఉదయపురి ఎంతో ప్రయత్నంమీద కళ్ళు తెరిచి జేబున్నిసాకేసి గుచ్చిచూస్తూ, "ఇంత అర్ధరాత్రివేళ చెప్పవలసినంత ముఖ్యవార్త ఏమిటి ? మారాటీ కొండఎలుక- ఆ శివాజీ చచ్చాడా ఏం ? అన్నది

జేబున్నీసా చిరునవ్వు నవ్వుతూ 'అమ్మా ! అంతకన్నకూడా మంచివార్త తెచ్చాను " అంటూ, చంచలకుమారి పాదుషా చిత్ర టానికి చేసిన అవమానం సంగతీ తన సొంతకల్పనలు కొన్ని చేర్చి ఉదయపురికి చెప్పి "అమ్మా ! ఆ కన్య చాలా అందచందాలు కలదని తెలియవచ్చింది ఆమె మీకు ఊడిగత్తెగా వుంటూ, తాంబూలం మడిచి యివ్వటం చూడాలని వున్నది అన్నది

"అలాగా! దానికేం? ఆ చంచలను నా ఊడిగత్తెగానే చేసుకుంటాను," అంటూ ఉదయపురి ఒక దీర్ఘం తీసి పక్కనున్న మద్యపానపాత్రలోనుంచి కొంత మద్యం సేవించి, తిరిగి హుక్కా చేపట్టింది జేబున్నీసా ఆమెకు మరోసారు సలాం చేసి గదినుంచి బయిటికి పోయింది

ఆ రాత్రి మూడవజాములో ఔరంగజేబు ఉదయపురిబేగం వుండే గదికి వచ్చాడు ఆమె అతడికి రూపనగరి రాజపుత్రిక చంచకుమారి చేసిన అవమానంసంగతి చెప్పి, ఆ రాజపుత్రికను తెచ్చి నాకు దాసీగా నియమించండి, అని కోరింది

తన చిత్రపటానికి జరిగిన అవమానంసంగతి విని క్రోధోద్రేకమైన ఔరంగజేబు ఉదయపురిబేగంకు అలాగే ఆమెను పట్టితెచ్చి, దాసీగా చేస్తానని మాట యిచ్చాడు

తెల్లవారుతూనే ఔరంగజేబు, రూపనగర రాజుకు ఒక ఆజ్ఞాపత్రం పంపాడు అందులో యిలావుంది ఢిల్లీచక్రవర్తి అయిన ఔరంగజేబు రూపనగర రాజకుమారి చంచల రూపలావణ్యముల సంగతి విని తన్మయులై ఆమెను వివాహమాడగోరు తున్నారు. ఈ సమయంలో రూపనగర రాజుయొక్క మంచిస్వభావం సంగతీ రాజభక్తి విషయం గుర్తుచేసుకుని చాలా సంతుష్టు లయ్యారు రూపనగర రాజాధీశుడి ప్రభుభక్తికి మెచ్చి ఆయనకు బహుమానాలు పంపుతున్నారు తన కుమార్తెను ఢిల్లీకి పంపుటకు తగిన ఏర్పాట్లు చేసుకుని ఆయన సిద్ధంగా వుండటం అవసరం కొద్దిరోజుల్లోనే చక్రవర్తిసైన్యం రూపనగరుకు వచ్చి రాజకుమారిని ఢిల్లీకి భద్రంగా తీసుకుపోగలదు

ఈ సమాచారం రూపనగరులో తెలియగానే పట్టణంలో పెద్దఎత్తున ఆనందోత్సాహాలు ప్రారంభమయినై. దానికి కారణం ఆరోజుల్లో రాజపుత్రరాజులు తమ ఆడపిల్లలను మొగలు పాదుషాలకు కన్యాదానం చేయటం గొప్ప గౌరవంగా అదృష్టంగా భావించేవారు యోధపురము, అంబరు లాంటి పెద్దపెద్ద రాజ్యాలను పాలించే రాజపుత్రరాజులే, మొగలులకు తమ ఇంటి ఆడబడుచులను భార్యలుగా సమర్పించి తాము ధన్యుల మైనట్టుగా భావించారు అలాంటి స్థితిలో అతి చిన్న రాజ్యమైన రూపనగరానికి ప్రభువైన రాజపుత్రుడికి అంత గొప్ప అదృష్టం పట్టటం ప్రజలందరినీ ఆనందంలో ముంచెత్తింది రాజూ, రాణీ దేవాలయాల కన్నింటికీ పూజాద్రవ్యాలు పంపారు ఢిల్లీపాదుషా తన కల్లుడు కాబోతున్నా డన్న సంతోషంలో రాజు, తన రాజ్యంలోనూ, చుట్టుప్రక్కలా వున్న చిన్నచిన్న జాగీరులను, సామంత రాజ్యాలనూ ఆక్రమించుకోవాలని పథకం వేయసాగాడు

పాదుషా అంతఃపురంలోనివా రందరికీ ఔరంగజేబు రూపనగరరాజుకు పంపిన ఆజ్ఞాపత్రం సంగతి తెలిసింది ఈ వార్త విని యోధపురిబేగమ్ చాలా విచారించింది ఆమె ముసల్మానును వివాహమాడి, అతడి అంతఃపురంలో మహారాజ్ఞిగా చెలామణీ అవుతున్నా—తన హిందూ ధర్మాన్ని ఏనాడూ మరవలేదు ఆమె దాసీ లందరూ హిందూస్త్రీలే తాను నివసిస్తున్న మందిరంలోని ఒక భాగంలో ఆమె లక్ష్మీనారాయణ విగ్రహాలను ప్రతిష్ఠించి, రోజూ పూజలు చేస్తూండేది

మరుసటిరోజు రాత్రి ఔరంగజేబు, యోధపురిబేగం మందిరానికి వచ్చాడు యోధపురి అతడికి ఎంతో వినయంగా నమస్కరించి, "మహాప్రభూః మీ ఆజ్ఞ



అయితేచాలు. మర్నాటికల్లా యీ దేశంలో గొప్పగొప్ప రాజ్యాధిపతులే రాజ్యభ్రష్టులవుతున్నారు మీ శక్తి అంత తిరుగులేనిది ఆ మహాశక్తిని ఒక అబలమీద ప్రయోగిస్తున్నారు. కారణ మేమిటో తెలియటంలేదు." అన్నది

ఔరంగజేబు ఆ మాటలు విని చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు జవాబుకోసం మరొకసారి ఆ ప్రసక్తి తెచ్చే సాహసం యోధపురికి లేకపోయింది ఆమె ఆ రాత్రి బాగా ఆలోచించి ఒక గట్టినిశ్చయానికి వచ్చింది

యోధపురిబేగం దగ్గిరవున్న హిందూ పరిచారికలలో దేవి అనే ఒకపరిచారిక వున్నది ఆవిడ యోధపురి వెంట అనుంగు దాసీగా ఢిల్లీకి వచ్చింది కాని. ఆవిడకు అంతఃపురంలోని హిందూమత విరుద్ధ వాతావరణంలో బతకటం చాలా బాధగా పరిణమించింది ఆ కారణంగా దేవి తనకు స్వదేశానికి తిరిగి వెళ్ళేందుకు అనుజ్ఞ యివ్వవలసిందిగా యజమానురాలిని చాలాసార్లు కోరింది కాని ఆవిడ చాలా నమ్మకస్థురాలైన పరిచారికగా భావించిన యోధపురి, దేవికి అలాంటి అనుజ్ఞ ఇవ్వలేదు ఇప్పుడు యోధపురిబేగంకు తన నిర్ణయాన్ని అమలు జరిపేందుకు దేవిని ఉపయోగించుకోవచ్చునన్న ఆలోచన కలిగింది

యోధపురి, దేవిని పిలిచి ఆవిడతో రహస్యంగా "నీవు చాలాకాలంగా నీజన్మభూమికి వెళ్లా లనుకుంటున్నావుగదా? సరే, అందుకిప్పుడు నీకు అనుమతి యిస్తాను నిన్ను మరి అక్కణ్ణుంచి ఢిల్లీకి పిలిపించను పోతే, నువ్వు నా కొక ముఖ్య కార్యంలో సహాయ పడాలి నీకు అందుకు అవసరం అయిన ధనమే కాకుండా, వేరే బహుమతికూడా ఇస్తాను నే చెప్పినపని చేయగలవా?" అని అడిగింది

"రాణీగారి ఆజ్ఞ అయితే, నేనెంతటి సాహసకార్యమైనా చేయటానికి సిద్ధమే." అన్నది దేవి.

"అయితే, నీవు వెంటనే బయలుదేరి రూపనగరానికి వెళ్ళాలి. ఆ రాజు కూతురు చంచలకుమారిని గురించిన సమాచారం విన్నావుగదా? నీవు ఆమెదగ్గరకు పోవాలి: నేను జాబులాంటి దేదీ రాసి యిచ్చేందుకు వీలుకాదు నా హస్తముద్రగల మొహరు ఆమెకు ఆనవాలుగా చూపి, నా మాటలుగా ఆమెతో యిలా చెప్పు. నీవు ఉత్తమ క్షత్రియ కన్యవు. అలాంటి నీవు ముసల్మానును ఎలా వివాహమాడగలవు? నేను అలాంటి వివాహం చేసుకుని సుఖపడుతున్న దేమీలేదు నేను ప్రతిక్షణం మరణం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాను పాదుషా చిత్రపటానికి నీవు చేసిన అత్యాచారం ఆయనకు తెలిసి, అందుకు ప్రతిక్రియగా నిన్ను ఉదయపురి బేగంకు తమలపాకులు మడిచియిచ్చే పరిచారికగా చేయటానికి ఆయన యీ మోసం నీమీద ప్రయోగిస్తున్నాడు. విషం తాగైనా మరణించటం మేలు ఒక క్షత్రియకాంత మహమ్మదీయుని చెట్టపట్టి జీవించటంకన్న నీచాతి నీచమైన కార్యం యీ లోకంలో మరొకటి లేదు హిందూమతద్వేషి అయిన ఢిల్లీపాదుషా తనసింహాసనాన్ని మరెంతో కాలం నిలుపుకోలేడు దక్షిణదేశంలో మహారాష్ట్ర వీరులు విజృంభించి మొగలాయీ సైన్యాలను నాశనం చేస్తున్నారు జిజియాపన్ను లాంటి అవమానాలను సహించలేక కొందరు రాజపుత్రులుకూడా అతడమీద కత్తికట్టారు ఉదయపురిరాణా రాజసింహుడు మహావీరపురుషుడు తార్తారులలోగాని, మొగలులలోగాని అంతటి వీరుడు మరొకడు లేడు రాజపుత్రులకు నాయకత్వం వహించి అతడూ, మహారాష్ట్రుల నందరినీ ఐక్యపరచి శివాజీ—తప్పక యీ ఢిల్లీసింహాసనాన్ని కూలదోస్తారు."

"అమ్మా! ఢిల్లీ సింహాసనం కూలిపోవాలని కోరకండి అది మీ బిడ్డలకోసం కలకాలం నిలిచివుండాలని దేవుణ్ణి ప్రార్థించండి." అన్నది దేవి

దేవి మాటలకు యోధపురిబేగం అయిష్టంగా తలాడించి, "ఈ ఢిల్లీ సింహాసనం నా బిడ్డలకు దక్కుతుందన్న ఆశ నాకులేదు ఆ రాకాసి జేబున్నీసా, ఢాకినీలాంటి ఉదయపురీ బతికివుండగా అది సాధ్యంకాదు సరే, ఆ సంగతు లిప్పు డెందుకు? చంచలకుమారితో నే నామెను రాజసింహుడి శరణు వేడమన్నా నని చెప్పు. అంతే కాక, ఆమె రాజసింహుడి ప్రాణేశ్వరి కావలెనని నే నాశీర్వదించినట్టుకూడా తెలియ పరచు చంచలకుమారి రాజసింహుడి రాణీ అయిననాడు, ఈ ఉదయపురిబేగమ్ ఆమెకు తమలపాకులమడత లందించే దాసి అవుతుంది." అన్న దను.



"అమ్మా ! అంతా తమరు చెప్పినట్టే జరిగితే ఎంతబావుండును," అన్నది దేవి
ఆ తరవాత జోధపురిబేగమ్ తన హస్తముద్రికనూ, కొంత ధనాన్నీ యిచ్చి దేవిని రూపనగరానికి ప్రయాణమైపోవలసిందిగా చెప్పి, అంతఃపురాన్నుంచి ఆమెను బయటికి పంపివేసింది

## 5

జేబున్నీసా తన విలాసమందిరంలో నవరత్న ఖచితమైన హంసతూలికా తల్పంమీద పట్టుదిండ్లు కానుకుని పడుకుని, తంబాకు దట్టించిన హుక్కా పీల్చుతున్నది. ముబారక్ కింద రత్నకంబళంమీద చేతులు జోడించుకుని కూర్చుని వున్నాడు అతడు జేబున్నీసాకేసి చూసేందుకు బెదరిపోతున్నాడు. కొంతసేపు హుక్కా పీల్చుతూ ఆ మైకంలో ఏవేవో కలలు కంటున్న జేబున్నీసా హఠాత్తుగా తల తిప్పి ముబారక్‌కేసి చూస్తూ, "ముబారక్ ! నిజం చెప్తావా?" అని ప్రశ్నించింది.

"తమతో అబద్ధాలాడగలనా." అన్నాడు ముబారక్ దీనంగా
"నీవు దరియాబీబీని వివాహ మాడావా ?"
"వివాహమాడినమాట నిజం. కాని, అది ఎనాడో మా దేశంలో వుండగా జరిగిపోయింది."

ఆ సంగతి నా దగ్గిర దాచి, నన్నుకూడా వివాహమాడాలని ప్రయత్నిస్తున్నావన్న మాట నా మీద నీ కెంత ప్రేమ : " అన్నది జేబున్నీసా కటువుగా.

"నేను చాలాకాలం క్రిందటే దరియాకు విడాకు లిచ్చాను," అన్నాడు ముబారక్

"విడాకు లెందు కిచ్చావ్?"

"పిచ్చిది గనుక, ఆ సంగతి మీరూ గ్రహించే వుంటారు"

"ఆవిడ పిచ్చిదో మంచిదో పరీక్షించవలసిన అవసరం నాకు కలగలేదు"

"ఈసారి వచ్చినప్పుడు కొంచెం పరీక్షగా చూడండి. నా మాటల్లోని నిజం మీకే తెలిసిపోతుంది"

"సరే, అలాగే చేస్తాను నాకు కొంచెం సుర్మా కావాలి రేపామె నొకసారి నా దగ్గిరకు పంపు"

"నేను రేపు తెల్లవారుతూనే దూరప్రాంతాలకు ప్రయాణమై పోవలసిన అవసరం కలిగింది"

"దూరప్రాంతాలకు ప్రయాణమా!" అంటూ జేబున్నీసా తల్పంమీద లేచి కూచున్నది

"ఆసంగతి యింతవరకూ నాతో మాటమాత్రంగానైనా అనలేదేం?"

"ఆసంగతి చెప్పుదామనే అనుకున్నాను రాజస్థాన్‌లో రూపనగర మనే చిన్నరాజ్య మున్నది అక్కడి రావుసాహెబ్‌వారి పుత్రిక చంచలకుమారిని పాదుషా వివాహ మాడబోతున్నారు ఆ కన్యను యిక్కడికి తీసుకువచ్చేందుకు పాదుషా కొద్దిసైన్యాన్ని పంపుతున్నారు. నేను దానివెంట పోవలసి వున్నది." అన్నాడు ముబారక్.

"ఆ చంచలకుమారినిగురించి నేను చెప్పవలసిన విషయం కొంత వున్నది: అది అట్లా వుంచి, ముందు నా ప్రశ్న కొకదానికి నీనుంచి జవాబు కావాలి. నీవు జ్యోతిష్కుడికి చేయి చూపించవలసిన అవసరం ఏం కలిగింది?"

"ఆయన గొప్ప జ్యోతిష్కుడని అందరూ చెప్పకుంటున్నారు. కానీ, నన్నితని దగ్గిరకు వెళ్ళమని ప్రోత్సాహించి బలవంత పరచినది — దరియాబీబీయే!" అన్నాడు ముబారక్ భయపడుచూ.

జేబున్నీసా కోపంగా ముబారక్ ముఖంలోకి పరీక్షగా కొంచెం సేపు చూసి, "జ్యోతిష్కుడు ఏమని చెప్పాడు?" అని ప్రశ్నించింది

"అతడు చెప్పినదంతా తమతో లోగడే మనవిచేసుకున్నాను."

"షాహజాదిని వివాహమాడితే ధనం, అధికారంకూడా లభ్యం కాగలవని జ్యోతిష్కుడు నీతో చెప్పలేదా? ఆ మాట నా దగ్గిర ఎందుకు దాచావు?" అన్నది జేబున్నీసా కళ్ళనిప్పులు రాల్చుతూ

'ఆ జ్యోతిష్కుడు హిందువు హిందువులు షహజాది అనరు; రాజకుమారిని వివాహమాడమని మాత్రం అతడు చెప్పాడు.''

''షహజాది అంటే రాజకుమారియేగదా ?''

ముబారక్ ఆ మాటలతో కళ్ళనీళ్ళపర్యంత మయాడు. జేబున్నీసా తర్కించమ తిక్కృతితో, తన మాటలకు లేని అర్థాలు తీసి, తన కేదో ప్రమాదం కలిగించ నున్నదని అతడు భావించాడు.

ముబారక్ నేత్రాలు అశ్రుపూరితా లవటం చూడగానే జేబున్నీసా హృదయం కొంచెం కరిగింది ఆమెకు ఎందరో ప్రియు లున్నా, ముబారక్ మీద ఆమెకు ప్రత్యేక మైన ప్రేమా, జాలీ వున్నది. ఆకారణంగా జేబున్నీసా కొంచెం స్థిమిత పడిన దానిలా తల్పం మీద దిండ్ల కానుకుని ఒరిగి పడుకుని, "ముబారక్ ! జరిగిందేదో జరిగిపోయింది· యిద్దరం మరిచిపోవాం. నా మీద కోపం వుంచుకోకు. నీవు నిజంగా నా ప్రాణప్రియుడవు. ఇటు తల్పంమీదికి గా. ఒంటికి చందనం రాస్తాను." అంటూ అతణ్ణి పక్కన కూర్చోబెట్టుకుని, ''ఆ రూపనగర రాజపుత్రి చంచల కుమారి విషయంలో నీవు అప్రమత్తుడివిగా వుండాలి. ఆ కన్య తండ్రి ఆమెను ఢిల్లీకి పంపేందుకు ఏ కారణంవల్లనైనా అంగీకరించకపోతే, నీవు బలప్రయోగం ద్వారానైనా ఆమెను యిక్కడికి తీసుకురావాలి.'' అన్నది.

"బలప్రయోగానికి పాదుషా అంగీకరించరని నే ననుకుంటున్నాను. ఆయన అలాంటి ఆజ్ఞ నా కివ్వలేదు. రూపనగరానికి పోయి, ఆ రాజకుమారిని సగౌరవంగా ఢిల్లీకి తీసుకురమ్మన్నదే వారి ఆజ్ఞ" అన్నాడు ముబారక్.

''ఒకవేళ ఆ రాజు, కుమార్తెను పంపడానికి నిరాకరిస్తేనే, నీవు దండోపాయం అవలంబించవలసి వుంటుంది చెప్పిన కార్యం నెరవేర్చకుండా పాదుషా సైన్యం ఢిల్లీకి తిరిగి రాకూడదు అలాంటిది మనకు తలవంపుల కారణం కాగలదు. ఇంకొకటి. పాదుషా ఆజ్ఞ ఎలాంటిదో, నా ఆజ్ఞా అలాంటిదే." అన్నది జేబున్నీసా.

"ఆ కన్యను తెచ్చితీరాలనే పట్టుదల మీ కెందుకు ?" అన్నాడు ముబారక్.

"అందు కొక కారణం వున్నది. ఇది మనలోమాట. ఉదయపురిబేగమ్ తాను త్రిలోకసుందరినని విర్రవీగుతున్నది చంచలకుమారి అపురూప సౌందర్యవతి అని విన్నాను. ఆమె తప్పక పాదుషా ప్రేమాదరాలను చూరగొని, ఉదయపురి కున్న గర్వం అణచగలదు ఆమె ఢిల్లీపాదుషా భార్య కావటానికి సహాయపడినదానిని నేనుగనక, నా సలహాలను తప్పక పాటించితీరుతుంది. పాదుషా ఆమె చేతి

కీలుబొమ్మ అవుతాడు. ఆమె నా చేతి పెంపుడు పావురం అవుతుంది.'' అన్నది జేబున్నీసా.

"ఒకవేళ ఆ చంచలకుమారి, ఉదయపురిబేగంకన్న అందమైంది కాకపోతే?" అని ప్రశ్నించాడు ముబారక్

"నువ్వు ఉదయపురిని చూడలేదుకదా? ఇటు నావెంట రా. తలుపు సందులోంచి ఆమెను చూదువుగాని...ఓహో, ఆవిణ్ణి చూడటానికి భయపడుతున్నావా? సరే. నేనామె చిత్తరువును చూపెడతాను నేననుకున్నట్లు చంచల ఆమెకన్న సౌందర్యవతి కాకపోతే......" జేబున్నీసా ఆగి ఏమో ఆలోచించసాగింది.

"సౌందర్యవతి కాకపోతే..."

"...నీవే ఆవిడను వివాహమాడు. పాదుషా అంగీకరించేటట్టు నేను చేస్తాను." అన్నది జేబున్నీసా ధీమాగా.

"మీ దయకూ, అనుగ్రహానికి కృతజ్ఞుణ్ణి. కాని, పాదుషావారు వివాహమాడ దలచిన కన్యను నే నెలా చూడగలను?" అన్నాడు ముబారక్.

"అందు కేదో ఒక ఉపాయం ఆలోచించు."

"ఆసంగతి పాదుషాకు తెలిస్తే, నా గతేమవుతుంది?"

"అలాంటి ప్రమాదం ఏమీ రాకుండా నే చూడగలను, ముబారక్! భయపడకు." అంటూ జేబున్నీసా కిలకిల నవ్వింది.

"ఈ దీనుడిపైన మీ అనుగ్రహం వుంటే, నాకెలాంటి భయమూ లేదు." అన్నాడు ముబారక్.

"నీవు నా ప్రాణప్రియుడ వని ముందే చెప్పానుగదా?"

"ఆమాట మీ హృదయంనుంచి వెలువడిందేనా? నిజమైన ప్రేమ, విశ్వాసాలతో మీ రన్నదేనా?" అని అడిగాడు ముబారక్ ఆశగా .

"ప్రేమా...విశ్వాసం—యివన్నీ అల్పుల కుండే లక్షణాలు. అవి నిరాశా దుఃఖాలకు కారణా లవుతవి. ఈ జేబున్నీసా అలాంటి దుఃఖాల కతీతంగా బతకదలిచింది."

జేబున్నీసా మాటల్లోని గూఢార్థ మేమిటో తెలియక ముబారక్ కొంతసేపు తికమకపడి, తరువాత ఆమెదగ్గర సెలవు తీసుకుని గదినించి బయటికి వెళ్ళిపోయాడు.

# 6

చంచలకుమారి అంతఃపురంలోని తన గదిలో ఒంటరిగా కూర్చొని. చిత్రపటా న్నొకదాన్ని పరిశీలనగా చూస్తూవుండగా, ఆమె సఖియైన నిర్మల మెల్ల మెల్లగా వెనుకనుంచి వచ్చి. ఆమె పక్కనే కూర్చున్నది నిర్మల రావటంచూస్తూనే చంచల చిత్రపటాన్ని తల్పంమీద బోర్లాపెట్టింది. నిర్మలకు ఆ చిత్రపట మెవ్వరిదో అన్న అనుమానం కలగలేదు. ఆ పటంలోని వీరపురుషు డామెకు తెలుసు

"రాకుమారీ ! ఈ అపాయం గడవటం ఎలా?" అన్నది నిర్మల.

"ఈ అపాయంనుంచి తప్పుకునే మార్గం ఏదీ వున్నట్టు తోచటం లేదు. అయినా, నేను ఢిల్లీకి పోయి ముసల్మానుల ఇంట దాసీగా మాత్రం బతకను." అన్నది చంచల.

"నీ మనసు నాకు తెలుసు, సఖీ ! కాని, ఢిల్లీకి వెళ్ళకుండా నీ వెలా వుండ గలవు ? సాక్షాత్తూ ఢిల్లీ సార్వభౌముడైన ఆలంఘీరుపాదుషా ఆజ్ఞను మన ప్రభువు తిరస్కరించలేదు గదా ? రాజస్థానములోని గొప్పగొప్ప రాజులైన యోధపురము, అంబరు ప్రభువులే ఢిల్లీ పాదుషాకు తమ కన్యల నిచ్చి పాణిగ్రహణం చేశారు అలాంటప్పుడు మన మెంత ? ఒక రకంగా నువ్వు అదృష్టవంతురాలివి. మహా రాజ్ఞివి కావటం నీ కిష్టంలేదా ?" అని అడిగింది నిర్మల

నిర్మల అలా అనగానే చంచల, "ఛీ, నువ్వవతలకుపో." అని కసురుకున్నది.

నిర్మల తలవంచుకుని కాసేపు ఆలోచిస్తూ కూచుని తరవాత, "సఖీ, నా మీద కోపం తెచ్చుకోకు, నే చెప్పేది శాంతంగా విను ఢిల్లీ పాదుషా ఆజ్ఞను ధిక్కరిస్తే నీ తండ్రిగా రెంత సంకటంలో పడతారో నీ వూహించలేవా ?" అన్నది.

"అదంతా నాకు తెలుసు ఢిల్లీ పాదుషా, ఈ రూపనగరకోటను క్షణాలమీద నేలమట్టం చేయగలడనీ, నా తండ్రి ప్రాణానికూడా హాని కలిగించగల డనీ, నే నెరుగుదును. అందుకే నేను పాదుషా సైన్యం యిక్కడికి రాగానే, వారివెంట ఢిల్లీకి ప్రయాణ మవుతాను." అన్నది చంచల.

"అలా చేయమని బ్రతిమాలేందుకే నే నిక్కడకు వచ్చాను." అన్నది నిర్మల తృప్తిగా.

చంచలకుమారి, తన చెలికత్తెకేసి కోపంగా చూస్తూ, నేను ఢిల్లీ కోటలో సుఖంగా కాలం గడపాలని భావిస్తున్నట్టు, నీవు అపోహ పడుతున్నావు." అన్నది. నిర్మల నిర్ఘాంతపోయింది. చంచల తన వేలివుంగరాన్ని నిర్మలకు చూపుతూ, "ఢిల్లీకి వెళ్లే మార్గంలో నేను విషపానం చేసి మరణిస్తాను, తెలిసిందా?" అన్నది

"మరణంకన్న మరో మార్గాంతరం లేదా?" అన్నది నిర్మల

"అంతకన్నా నా కేదారీ కనిపించటంలేదు నాకోసం ఢిల్లీపాదుషాతో వైరం పెట్టుకోగలిగిన వీరు దెవడున్నాడు? రాజస్థాన్‌లోని రాజపుత్రప్రభువు లందరూ మొగలయీలకు సామంతులై పోయారు రాణా సంగ్రామసింహుడు లేడుకదా? రాణా ప్రతాపసింహుడు ఎక్కడున్నాడో నీవు చెప్పగలవా?" అని అడిగింది చంచల

"వా రింకెక్కడ వున్నారు' ఇప్పుడు రాజస్థాన్‌లో ఆ మహావీరులకు సాటివచ్చే వ్యక్తి ఒక్కగా నొక్క రాజసింహుడే కాని, ఆయన నీకొరకు ఔరంగజేబుతో విరోధం తెచ్చుకుంటాడని నే ననుకోను. పైగా, నీవు మార్వారు వంశస్థురాలవు." అన్నది నిర్మల

"ఇక్కడ వంశాల ప్రసక్తి ఏమీలేదు. శరణాగతులను ఏ రాజపుత్రుడు రక్షించేందుకు జంకుతాడు? రాజసింహుడు, ప్రతాపసింహుడి వంశానికి మణిలాంటివాడు నే నాయన శరణు కోరదలుచుకున్నాను నన్నాయన కాపాడలేడా?" అంటూ చంచల, తల్పంమీద వున్న పటాన్ని చేతికి తీసుకొని, రాజసింహుడి రూపచిత్రంకేసి తన్మయత్వంతో చూడసాగింది

నిర్మల, రాజకుమారి ముఖభంగిమలను కొంచెంసేపు పరీక్షగా చూసి, "సఖీ! ను వ్వన్నట్టు ఆరాజసింహుడి శరణే కోరుతావనుకో. కాని, అతడికి నువ్వు చేయగల ప్రత్యుపకార మేమిటి? అతడికి నీ వే మీయగలవు?" అని అడిగింది

"సఖీ! అతడికి నే నివ్వగలిగిన దేమున్నది? నే నబలను," అన్నది చంచల

"నీ వున్నావుగదా?" అంటూ నిర్మల కొంటెగా నవ్వింది


"ఛీ, అవతలకు పో!" అంటూ చంచల చిరుకోపం నటించింది.

"నాకు తెలుసు, యివన్నీ రాచకన్నెల దాగుడుమూత మర్యాదలు. నీవు రుక్మిణివి ఎందుకు కాకూడదు? అప్పు డతడు యదుకిశోరుడై త ప్ప క నిన్ను ఉద్ధరిస్తాడు "

అమాటలు వింటూనే చంచలకుమారి సిగ్గుతో తల వంచుకున్నది నిర్మల ఆమెకేసి కొంచెం జరిగి, భుజం నొక్కుతూ, "అంత సిగ్గుపడిపోతే, కార్యసాఫల్యం ఎలా అవుతుంది?" అన్నది.

"నా కీజన్మలో అతణ్ణి పొందే అదృష్టం కలుగుతుందంటావా? నాకై నేనే వెళ్లి అతడికి, నా హృదయభావం చెప్పుకోవటం ఎలా?"

"రుక్మిణీదేవికూడా నీలాంటిచిక్కే వచ్చింది. రాజసింహమహారాజువద్దకు ఎవరి నైనా దూతగా పంపితే?"



చంచలకుమారి ఉలిక్కిపడి, నిర్మల మొహంలోకి ప్రేమగా చూస్తూ, "నిర్మలా! ఎంత మంచి ఆలోచన చెప్పావు. నీ విప్పుడే వెళ్ళి మా గురువుగారిని తీసుకురా. ఆయనను యిక్కడికి తీసుకువచ్చేముందే, సర్వం తెలియపరచు. నాయంతట నేనే చెప్పేందుకు సంకోచంగా వున్నది." అన్నది.

నిర్మల లేచి వెళ్ళేంతలో, ఇద్దరు, ముగ్గురు చెలికత్తెలక్కడికి వచ్చి, "రాకుమారీ! ఎవరో ఒక అమ్మి ముత్యాలహారాలు అమ్మేందుకు వచ్చింది." అని చెప్పారు.

"ఇది ముత్యాలు చూసి కొనేందుకు సమయంకాదు; ఆమెను వెళ్ళమని చెప్పండి." అన్నది చంచలకుమారి.

"ఆమనిషి మామాటలు వినేలాలేదు; రానివ్వండి, చూసి ముత్యాలు బావోలేదని చెప్పి పంపెయ్యవచ్చు." అన్నదొక చెలికత్తె. చంచల అంగీకారసూచకంగా తలవూపింది.

ముత్యము లమ్మే మనిషి చంచలదగ్గరకు వచ్చి, బుట్టలోనుంచి కొన్ని మైనపు ముత్యాలను తీసి రాకుమారికి చూపింది. వాటిని చూసి చంచల విసుక్కుంటూ, "ఈ సీమ ముత్యాలు చూపేందుకా, యింతతొందరపెట్టావు?" అన్నది.

ముత్యాల బేరగత్తె, చంచలతో మెల్లగా, అమ్మా! కోప్పడకండి. ఈ ముత్యాలకేంగాని, చాలాముఖ్యమైన వస్తువొకటి తమకు చూపించాలి. తమరు ఒంటరిగా వుంటే, ఆవస్తువు చూపించగలను," అన్నది.

"అలా అయితే, నేనూ, నా ముఖ్యసఖి నిర్మలా మాత్రమే వుంటాం. ఆ దేమిటో చూపించు," అంటూ చంచల, తన యితర చెలులను అక్కణ్ణించి వెళ్ళిపొమ్మ

న్నది. అప్పుడు ముత్యా లమ్మవచ్చిన స్త్రీ, తన దుస్తుల్లోనుంచి యోధపురిబేగమ్ హస్తముద్రను బయటికి తీసి, చంచలకుమారికి చూపింది. చంచల ఆ ముద్రికను చూస్తూనే నిర్ఘాంతపోయి, "ఇది నీ కెక్కడ దొరికింది?" అని ప్రశ్నించింది.

"అమ్మా! నాపేరు దేవి నేను యోధపురిబేగమ్‌సాహెబావారి దాసిని. ఆమె స్వయంగా యీ హస్తముద్రికను నా కిచ్చి, తమకు గుర్తుగా చూపించవలసిందిగా చెప్పి, తన మాటలుగా మీతో యిలా చెప్పమన్నది." అంటూ దేవి, యోధపురి చెప్పమన్నదంతా చంచలకుమారికి చెప్పింది. చంచలా, నిర్మలలు ఆమాటలు విని చాలా సంతోషించారు. వారికి ఎక్కడలేని ఆత్మవిశ్వాసంకూడా కలిగింది. చంచల, దేవికి చాలా బహుమతు లిచ్చి పంపివేసింది దేవి వెళ్ళేటప్పుడు యోధపురిబేగమ్ హస్తముద్రను చంచలదగ్గిరే వదిలిపోయింది.

"నిర్మలా! ఆ దేవి ఎంతోదూరం వెళ్ళివుండదు. పిలుచుకురా. ఈ హస్తముద్రికను యిక్కడే మరిచిపోయి వెళ్ళింది," అన్నది చంచల.

"సఖీ! ఆ దేవి కావాలనే ఆముద్రికను యిక్కడ విడిచివెళ్ళింది."

"ఎందుకు? దీన్ని నే నేం చేసుకోను!" అన్నది చంచల.

"ఉంచుదాం. ఏదో ఒకనాడు దాన్ని తిరిగి యోధపురిబేగంకు పంపవచ్చు." అన్నది నిర్మల సాలోచనంగా.

"యోధపురిబేగం పంపిన సందేశం నా కెంతో ధైర్యం కలిగిస్తున్నది. నే ననుకున్నట్టే ఆమెకూడా నన్ను రాజసింహుడి శరణు వేడమని సలహా యిచ్చింది. ఇంతకూ కార్యసాఫల్యం ఎలా వుండబోతుందో మనం ఊహించలేం," అన్నది చంచల నిస్పృహగా.

## 7

గురువు అనంతమిశ్రుడు రూపనగర రాజకుటుంబానికి పౌరోహితుడు ఆయన గొప్ప పండితుడు, మహామహోపాధ్యాయ బిరుదు పొందినవాడు. చంచలకుమారిని తన కుమార్తెలా ప్రేమించేవాడు. ఆయనంటే, రాజుకేకాక, రాజ్యంలోని ప్రజలకు కూడా గొప్ప భక్తి ప్రపత్తు లుండేవి.

నిర్మల ఆ పండితుడి ఇంటికి వెళ్ళి చంచలకుమారి అతడి దర్శనంకోసం ఎదురు చూస్తూన్నదని చెప్పి, అతడు బయలుదేరగానే, దారిలో రాకుమారి నెదుర్కొన్న సమస్య వివరించి, ఆయన ఉదయపురానికి వెళ్ళి రాణా రాజసింహునితో మాట్లాడి రావాలని చెప్పింది.

అనంతమిశ్రుడు నిర్మల చెప్పేదంతా శ్రద్ధగా వింటూ చంచల వున్నచోటుకు వచ్చాడు. గురువును చూస్తూనే చంచల లేచి నమస్కరించింది. అనంతమిశ్రుం డామెను దీవించి నవ్వుతూ, "ఇదంతా రుక్మిణీకల్యాణంలా కనిపిస్తున్నది ఈ ముసలిబ్రాహ్మణ్ణి ద్వారకానగరానికి పంపుతున్నారా, తల్లీ? సరే, దారిబత్తెముకు ఏమైనా యిస్తే యిప్పుడే బయలుదేరి వెళతాను." అన్నాడు.

చంచలకుమారి సరిగపూలతో అందంగా వున్న ఒక సంచీ తీసుకుని, దాన్ని రత్నకంబళంమీద బోర్లాతిప్పి దులిపింది. మొహరీలు ఒకగుట్టగా పడినై. అనంత మిశ్రుడు ఆ గుట్టనుంచి ఐదు మొహరీలను ఏరి తీసుకుని, "ఉదయపురిమార్గంలో అన్నం మాని, యీ మొహరీలు తిని నన్ను బతకమన్నావా?" అంటూ నవ్వి, "తల్లీ, నీ వొకపని చెయ్యగలవా? ఆ రాణారాజసింహుడికి ఒకలేఖ రాసి యివ్వ గలవా?" అని అడిగాడు.

చంచలకుమారి కాసే పాలోచించి, "గురుదేవా! నేను బాలికను, పైపెచ్చు అంతఃపురకాంతను. ఆయనకు పూర్తిగా అపరిచితురాలను, అటువంటి నేను లేఖ రాయటం ఎలా? కాని, మీరు ఎటువంటిలేఖా తీసుకుపోకుండా ఆయనదగ్గరకు వెళ్ళి నోటిమాటలుగా చెపితే; ఒకవేళ రాణా మీ మాటలు నమ్మకపోవచ్చు: తప్పని సరి గనుక నేను లేఖ రాసియిస్తాను." అన్నది.

"నువ్వే రాయగలవా: లేక నన్ను ఎలా రాయవలసిందీ చెప్పమంటావా?" అన్నాడు మిశ్రుడు.

చంచలకుమారి జవాబు చెప్పబోయేంతలో నిర్మల అడ్డువచ్చి, "ఇలాంటి విష యాల్లో పండితులు అమాయకులు. వారి సలహాలు కన్యలు పాటించవలసినవికావు. ఆ లేఖేదో మే మిద్దరం ఆలోచించి తయారుచేస్తాం." అన్నది.

"అలా అయితే మీరే రాయండి నే నటు వెళ్ళి ప్రభువువారి దర్శనం చేసుకొని యిప్పుడే తిరిగి వస్తాను," అంటూ అనంతమిశ్రుడు సరాసరి విక్రమసింహుడి వద్దకు పోయి, "మహారాజా! నేను కొద్దిరోజులపాటు దేశసంచారము చేయ బోతున్నాను. ఆ ప్రయాణంలో ఉదయపురానికూడా పోవలసివున్నది. రాణా రాజసింహుడికి మీనుంచి పరిచయలేఖ ఒకటి కావాలి," అని చెప్పాడు. విక్రమ సింహుడు ఎలాంటి ప్రశ్నలూ అడగకుండా లేఖ రాసియిచ్చాడు.

అనంతమిశ్రుడు కొద్దిసేపటి తరువాత చంచలకుమారి వున్న అంతఃపురానికి తిరిగివచ్చాడు. అత డొచ్చేసరికి చంచల, నిర్మల లిద్దరూ ఆలోచించి ఒక లేఖ రాసి వుంచారు. చంచల ఆలేఖను గురువుకు యిచ్చి, పెట్టెలోనుంచి ఒక ముత్యాల

హారాన్ని తీసి, "గురుదేవా! తమరు మహారాజా రాజసింహునకు నా లేఖతో పాటు, ఈ హారాన్నికూడా నా కానుకగా యివ్వకోరుతాను. రాజపుత్రకులాలంకారుడైన ఆ రాజసింహుడు, రాజకన్య పంపిన కానుకను తిరస్కరించడని నా నమ్మకం." అన్నది.

అనంతమిశ్రుడు లేఖనూ, ముత్యాలహారాన్నీ తీసుకుని, చంచలను దీవించి అంతఃపురాన్నుంచి బయటికి నడిచాడు.

* * * *

అనంతమిశ్రుడు ఇంటికి పోయి ప్రయాణానికి కావలసిన వస్తువులు...ఛత్రము, చేతికర్ర, చందనపుచెక్క, రాగిపాత్ర తీసుకొని, నీరుకావిధోవతులు ధరించే సమయానికి, అతడి భార్య ప్రయాణానికి అడ్డుచెప్పింది. ఈ వయసులో దేశసంచారమేమిటన్నది ఆమె అభ్యంతరం. అనంతమిశ్రుడు ఆమెతో వారం రోజుల్లోపలే ఇంటికి తిరిగివస్తానని చెప్పి, "పిచ్చిదానా! నే నూరికే ఉబుసుపోక కూళ్ళవెంట తిరగబోతున్నా ననుకోకు. ఉదయపురం వెళ్ళి రాజా రాజసింహుణ్ణి కలుసుకోబోతున్నాను. ఆయనవల్ల మనకు గొప్ప ధనలాభం కలగవచ్చు," అన్నాడు.

ధనం అన్నమాట వింటూనే పండితుడి భార్య ప్రసన్నురాలై, భర్తకు ప్రయాణంలో అవసరం అయే వస్తుసామగ్రి నంతా త్వరత్వరగా సమకూర్చిపెట్టింది. మిశ్రుడు తనతోపాటు ఒక నౌకరునుమాత్రం తీసుకుని ఉదయపురి మార్గాన ప్రయాణ మయ్యాడు. మార్గమంతా రాతిమయం. కొండలూ, గుట్టలూ, ఎగుడు దిగుడు ప్రదేశాలూ తప్ప, ఎక్కడా సమతల మున్నదే లేదు. మిశ్రుడు యీ విధమైన మార్గంలో రెండురాత్రులు ప్రయాణం చేసి, మూడవనాటి రాత్రి ఒకకొండకోనలోవి దేవాలయా న్నొకదాన్ని చేరి, భోజనం వండుకుని మంటపంమీద విశ్రమించాడు. కొద్ది పొద్దుపోయిన తరవాత అక్కడికి నలుగురు వర్తకులు వచ్చి, వంట చేసుకుని భుజించి మంటపంలో మరొకచోట పడుకున్నారు.

తెల్లవారింది. ఆ నలుగురు వర్తకులూ బయలుదేరుతూ, అనంతమిశ్రుణ్ణి "మీ ప్రయాణం ఎక్కడికి?" అని ప్రశ్నించారు.

"ఉదయపురానికి," అని జవా బిచ్చాడు మిశ్రపండితుడు.

"ఉదయపురానికా ? బావుంది. మేమూ ఆ నగరానికే పోతున్నాము," అన్నారు వర్తకులు.

అనంతమిశ్రుడు తోడు దొరికిందిగదా అని సంతోషించి, వారితో కలిసి ప్రయాణమవుతూ, "ఉదయపురం యింకా ఎంతదూర మున్నది?" అని అడిగాడు.



"సమీపానికి వచ్చాం. ఈ సాయంత్రానికి నగరం చేరగలం," అన్నారు వర్తకులు.

ఆ తరువాత అందరూ కలిసి ప్రయాణ మయ్యారు. దారిలో ఆ కబురూ యీ కబురూ చెప్పుకుంటూ, మిట్టమధ్యాహ్నంవేళకు వారంతా ఒక పర్వతపార్శ్వాన్ని చేరారు. ఎట్టఎదుట ఒక కొండలోయ కనిపిస్తున్నది. లోయలో ఒక నది ఉరవళ్లూ పరవళ్లూ తొక్కుతూ ప్రవహిస్తున్నది. నది నానుకొనివున్న కొండప్రదేశ మంతా కీకారణ్యంగా వున్నది. ఉదయపురానికి వెళ్ళే కాలిబాట నదిని అనుకునే వున్నది.

ఆ కాలిబాట వెంట కొంతదూరం నడిచిన తరువాత వర్తకుల్లో ఒకడు అనంత మిశ్రుణ్ణి సమీపించి. "అయ్యా. యీ ప్రదేశం ఎంత భయంకరమైనదో గమనించారు గదా? ఇక్కడి అరణ్యంలో దొంగలభయం జాస్తి. మీరు చూడబోతే వృద్ధులు. మీ దగ్గర విలువైన వస్తువు లేమైనా వుంటే, యిటివ్వండి. ఈ అరణ్యం దాటగానే వాటిని తిరిగి మీపరం చెయ్యగలను," అన్నాడు.

అనంతమిశ్రుడు. ఆ వర్తకుడికేసి భయంగా చూసి, తన దగ్గిర వున్న ముత్యాల హారాన్ని అతనికి ఇవ్వటమా, మానటమా అని ఓ క్షణకాలం ఆలోచించి చివరకు యివ్వకుండావుండటమే వుత్తమ మని నిర్ణయించుకుని, "అయ్యా, నేను యాచకవృత్తి చేసుకు బతికే బ్రాహ్మణుణ్ణి, నా దగ్గిర విలువైన వస్తువు లేమీలేవు," అన్నాడు.

మిశ్ర పండితుడి తటపటాయింపు చూసిన వర్తకుడు ఒక్క ఎగురున అతడి మెడ పట్టుకుని, "అబద్ధాలమారి బాపడా! మమ్మల్నే మోసం చేద్దా మనుకున్నావా?

మేం అమాయక వర్తకుల మనుకున్నావేమో, జాగ్రత్త! మేం యీ ప్రాంతాల పేరుమోసిన బందిపోట్లం." అంటూ అతణ్ణి కిందపడవేసి, నడుముకు బిగించి కట్టుకున్న సంచీనికూడ లాగాడు.

ఆ సంచీలో దొంగకు ముత్యాలహారం నాలుగు మొహరీలూ, రెండు కాయితపు మడతలూ కనిపించినై. అంతలో వర్తకవేషధారు లైన మిగతా ముగ్గురు బందిపోట్లూకూడా అక్కడికి వచ్చారు. మిశ్రుణ్ణి క్రిందపడవేసిన దొంగ వాళ్ళకు ముత్యాలహారాన్ని చూపుతూ. "చూశారా. యీ దాపడు మన కళ్ళల్లోనే కారం చల్లదలిచాడు. ఇతణ్ణి ప్రాణాలతో వదలగూడదు." అంటూ గొంతు పట్టుకోబోయాడు.

దొంగల్లో ఒకడు అతణ్ణి చేతులు పట్టుకుని యివతలకు లాగుతూ, "మన క్కావలసిన ధనం దొరికింది. యింకా బ్రహ్మహత్యాపాతకం ఎందు కట్టుకోవటం? అతణ్ణి వదిలెయ్యి." అన్నాడు.

"ఊరికే వదిలివేయటం ప్రమాదం. నగరానికి దగ్గిర. మనం మన రహస్యస్థానం చేరేలోపలే రాజభటుల్ని యిక్కడికి తీసుకురాగలడు. చండశాసను డైన రాణారాజాసింహుని రాజ్యంలో మనబోటివాళ్ళకు క్షణం ఓ గండంగా వున్నది." అన్నాడు మొదటిదొంగ.

"ఆ కనబడే చెటుబోదెకు కట్టివేసి మనదారిన మనం పోదాం. ఆయుష్షు వుందో, యీ ముసలిబ్రాహ్మణ్ణి యిటు వచ్చేవా రెవరైనా చూసి రక్షిస్తారు. లేకపోతే, ఆకటి కలమటించి ప్రాణాలు వదులుతాడు." అన్నా డొకదొంగ.

ఆ వెంటనే దొంగలు నలుగురూ మిశ్రపండితుణ్ణి అతని వస్త్రాలతోనే ఒకచెట్టుకు విరిచికట్టి అరణ్యంలోకి వెళ్ళిపోయారు.

బందిపోటుదొంగలు అనంతమిశ్రుణ్ణి చెటుకు కట్టివేయటం, తరవాత నదీతీరాన్నుంచి అరణ్యంలోకి ప్రవేశించటం—అంతా కొంచెం దూరంలో వున్న కొండశిఖరంమీదినుంచి ఒక గుర్రపురౌతు చూస్తూనేవున్నాడు. దొంగలు యిది గమనించలేదు. వాళ్ళు ఎక్కువ శ్రమలేకుండానే నాలుగు మొహరీలు, ముత్యాలహారం సంపాయించిన ఉత్సాహంలో, అరణ్యంలో కొంతదూరం నడిచి ఒక కొండగుహలోకి వెళ్ళారు. ఆ గుహలో ఆహారపదార్థాలూ, కుండల్లో నీరూ, పరుపులూ, నాలుగైదు మంచాలూ వున్నవి. దొంగలు గుహలోకి వెళ్ళి కుండల్లో వున్న మంచినీరు తాగి తీరిగ్గా ప్రసంగించుకోసాగారు.

దొంగల్లో ఒకడు దొంగిలించిన వస్తువులను చాపమీద పెట్టి, మరొకడితో, "మాణిక్యలాల్! వంట అయేలోపల మనం యీ వస్తువుల్ని పంచుకుందామా?"

అన్నాడు మాణిక్యలా అని పిలవబడిన దొంగ తల వూపుతూ, "సరే, కానివ్వండి. ఆలశ్య మెందుకు ?" అన్నాడు.

ముందు దొంగలు దొరికిన నాలుగు మొహరీలనూ తలాఒకటీ తీసుకున్నారు. తరవాత ముత్యాలహారం సంగతి వచ్చింది. దాన్ని అమ్మి తేతప్ప పంచుకునే అవకాశంలేదని వాళ్లు నిర్ణయించుకున్నారు. పోతే మడిచివున్న రెండు కాయితాల ప్రసక్తి వచ్చింది. ఆ దొంగల్లో మాణిక్యలా లొకడే చదువనేర్చినవాడు. అతడు ఆ కాయితపు మడతలు విప్పి సాంతం చదివి మహానందంతో. "మనం గొప్ప అదృష్టవంతులం; వీటిద్వారా కావాలనుకుంటే. ఏనాడైనా రాణా రాజసింహుడి కొలువులో మంచి ఉద్యోగాలు సంపాయించుకోవచ్చు," అన్నాడు.

ఆ మాటలు వింటూనే మిగతా ముగ్గురు బండిపోటూ, ఎగిరిగంతేసి. ఆ కాయితాల్లో ఏమి రాసివున్నదో చెప్పమన్నారు. మాణిక్యలాలు వాటికి ఆ వుత్తరాల్లో వున్న విషయం చెప్పి. "మనం యింకో పనికూడా చెయ్యవచ్చు. ఈ వుత్తరాలు అవశ్య మార్గంలో దొరికిన వని చెప్పి, రాణానుంచి మంచి బహుమానం పొందవచ్చు." అన్నాడు.

మాణిక్యలాలు అలా అనగానే. దొంగల్లో కొంచెం వయసు మీరినవాడు పెద్దగా గొంతెత్తి. 'మీరు మీ యిష్టం వచ్చినట్టు చేయటానికి నే నొప్పను. ఇక్కడ నాయకు డనేవాణ్ణి నే నొకణ్ణున్నానన్న సంగతే మీరు మరిచిపోతున్నట్టున్నది. ఆ వుత్తరాలు యిటివ్వండి. వాటిని ఢిల్లీపాదుషాకు యిస్తే. మనకు మంచి బహుమానమేకాక, ఆయన దర్బారులో గొప్ప వుద్యోగంకూడా అవుతుంది. రూపనగర రాజకుమారిని ఢిల్లీపాదుషా ఔరంగజేబు..........."

దొంగలనాయకుడు మాట పూర్తి చేయకుండానే. అతడి తల, వెనకనుంచి బలంగా విసిరిన కత్తిదెబ్బకు కంఠనుంచి వేరై కింద పడిపోయింది. అది చూస్తూనే మిగతా ముగ్గురుదొంగలూ ఓ తృటికాలం నిశ్చేష్టులై తెప్పరిల్లేటంతలో, వాళ్ళ నాయకుడి తల నరికిన రాజపుత్రయోధుడు ముందుకొక దూకుదూకి, నేలమీదినుంచి లేవబోతున్న ఒక దొంగ తలమీద గుప్పెటతో బలంగా పొడిచాడు. ఆ దెబ్బకు దొంగ కుప్పలా కూలిపోయాడు ఇంతలో మరొకదొంగ అతడిమీదికి ఒక బండ రాయిని గురిచేసి విసిరేంతలో, యోధుడు తన ఎడమచేతిలో వున్న పిస్తోలును అతడి గుండెలకు బారుచేసి పేల్చాడు దొంగ ఒక్క చావుకేక పెట్టి వెనక్కు విరుచుకు పడిపోయాడు.

మాణిక్యలాల్ యీ అదనులో గుహనుంచి బయటికి దూకి పారిపోసాగాడు రాజపుత్రయోధుడు చప్పున వెనుదిరిగి అతడి వెంటబడ్డాడు. మాణిక్యలాలు అరణ్యంలో కొంతదూరం పరిగెత్తి, ఒకచెట్టు కానించివున్న ఈటెను చేతికి తీసుకుని, అన్నిటికీ తెగించినవాడిలా రాజపుత్రయోధుడికి ఎదురుతిరిగి నిలబడి "అయ్యా. మీరు ముందుకు ఒక్కఅడుగుకూడా వేయకండి. అలా చేశారో ఈటెతో పొడవగలను. మీ రెవరో నాకు తెలుసు!" అన్నాడు.

ఆ మాటలకు రాజపుత్రయోధుడు నవ్వి, "నువ్వు ఈటెను విసిరినా, నేను దానిని నా ఎడమచేత్తో ఆపగలను. ఇదుగో, కాచుకో," అంటూ పిస్తోలును మాణిక్యలాలు కేసి విసిరాడు. ఆ పిస్తోలు మాణిక్యలాలు చేతికి బలంగా తగిలేసరికి ఈటె అతడి చేతినుంచి జారి కిందపడిపోయింది. అదే సమయంలో రాజపుత్రయోధుడు వేగంగా అతణ్ణి సమీపించి ఎడమచేత్తో జుట్టు పట్టుకుని, కుడిచేయి పైకెత్తి కత్తితో అతడి తల తెగనరకబోయాడు.

మాణిక్యలాలు గద్గదస్వరంతో, "మహారాజాధిరాజా! నాకు ప్రాణదానం చేయండి. ఈ శరణాగతుణ్ణి చంపకండి," అని వేడుకున్నాడు.

రాజపుత్రయోధుడు కత్తి దించుతూ, "నువు బందిపోటువుగదా? చావంటే యింత భీతిల్లుతున్నావేం?" అని ప్రశ్నించాడు.

"మహారాజా! నేను కేవలం మరణించటాని కొక్కదానికే జంకటంలేదు. నా కొక ఏడుసంవత్సరాల వయసుగల ఆడపిల్ల వున్నది. దానికి తల్లిలేదు. దాని ఆలనా పాలనా చూసేందుకు నేను తప్ప మరెవ్వరూలేరు. నేను మరణిస్తే అది దిక్కులేని పక్షి అవుతుంది. మీరు చంపదలిస్తే నన్ను చంపండి. కాని, ముందుగా నా బిడ్డనుకూడా తప్పక కత్తి కెర చేయగల నని వాగ్దానం చేయండి," అన్నాడు.

రాజపుత్రయోధుడు జవా బేమీ యివ్వకుండా మాణిక్యలాలును నఖశిఖపర్యంతం పరీక్షగా చూడసాగాడు. మాణిక్యలాలు అతడి పాదాలు తాకి, "మహారాజా! తమ పాదాలు ముట్టి ప్రమాణం చేస్తున్నాను. ఇప్పుడు నన్ను క్షమించారంటే, ఈ క్షణం నుంచి నేను చోరవృత్తి మాని, తమ పాదసేవ చేస్తూ విశ్వాసపాత్రుడుగా మెలగ గలను," అన్నాడు.

"నే నెవరో నీ వెరుగుదువా?" అని రాజపుత్రయోధుడు ప్రశ్నించాడు.

"మహారాజా రాజసింహాని ఎరుగనివా రెవరుంటారు!" అన్నాడు మాణిక్యలాలు.

రాజసింహుడు చిరునవ్వు నవ్వి, "సరే, నీకు ప్రాణదానం చేస్తున్నాను. కాని, గుహలో మీరు మాట్లాడుకున్నదాన్నిబట్టి, మీరు దొంగిలించినది ఒక బ్రాహ్మణుడి



సొత్తని అర్థమవుతున్నది. ఆ కారణంవల్ల నిన్నేదో విధంగా శిక్షించకపోతే, నేను రాజధర్మం తప్పినవాడి నవుతాను." అన్నాడు

మాణిక్యలాలు వినయంగా తల వంచి, "మహారాజా! నేను యీ చోరవృత్తిలో చేరి ఎంతోకాలం కాలేదు. నాకు చాలా స్వల్పమైన శిక్ష విధించి కాపాడండి." అంటూ మొలలో వున్న చురకత్తిని తీసుకుని, చేతివేళ్ళను కోసుకునేందుకు ప్రయత్నించి, అవి వెంటనే తెగకపోయేసరికి, వేళ్ళను ఒక రాతిమీద ఆనించి, చురకత్తిని వాటిమీద పెట్టి, ఒక బండరాయితో దానిమీద బలంగా కొట్టి, వేళ్ళను తెగనరుక్కున్నాడు.

రాజసింహుడు యిదంతా చూస్తూనేవున్నాడు. అతడికి మాణిక్యలాలు కనబరిచిన నిబ్బరానికీ, మనోబలానికీ, బాధాసహిష్ణుతకూ ఎంతో ఆశ్చర్యం కలిగింది.

"సరే, ఈ శిక్ష చాలు. నీ పేరేమిటి?" అన్నాడు రాజసింహుడు.

"ఈ నీచుడు రాజపుత్ర వంశానికి కళంకుడు. పేరు, మాణిక్యలాల్ సింహుడు." అన్నాడు మాణిక్యలాలు.

"మాణిక్యలాల్! నీ తప్పులన్నీ క్షమించాను. నిన్ను, నా అశ్వసమూహంపై అధికారిగా నియమిస్తున్నాను. నీ బిడ్డతో వెంటనే ఉదయపురం వెళ్ళు. అక్కడ నీకు ఇల్లూ, అవసరమైన ధనం సమకూరుతుంది." అన్నాడు రాజసింహుడు.

మాణిక్యలాలు, రాజసింహుడికి నమస్కరించి, గుహలోకి వెళ్ళి, అనంతమిశ్రుడి నుంచి దొంగిలించిన మొహరీలను, ముత్యాలహారాన్ని, పుత్తరాలను తెచ్చి రాజసింహుడి కిచ్చాడు. రాజసింహుడికి ఆ క్షణంలోనే తాను కొండపైనుంచి దొంగలు బంధిస్తూవుండగా చూసిన అనంతమిశ్రుడు జ్ఞాపకంవచ్చాడు. ఆ వెంటనే

అతడు గుర్రాన్ని అధిరోహించి మిత్రుడు చెట్టుకు కట్టివేయబడిన ప్రదేశానికి బయలుదేరాడు.

## 8

దొంగలచేత చెట్టుకు కట్టివేయబడిన అనంతమిత్రుడు, వాళ్లు అరణ్యంలోకి పోగానే. కట్లు విప్పుకునే ప్రయత్నం ప్రారంభించాడు ఆ సమయంలో అతడికి ఎక్కడలేని విచారం కలిగింది. తను వెంట తెచ్చుకున్న ధనం పోయింది. రాజ కుమారి చంచల ఇచ్చిన పుత్తరం, రాజు యిచ్చిన వుత్తరం—అన్నీ పోయాయి. తను రూపనగరుకు తిరిగివెళ్ళి చంచలకు ఏమి చెప్పటం? అసలు తను ప్రాణాలతో యిక్కడనుంచి బయట పడగలడా?

పండితు డీవిధంగా ఆలోచిస్తూ, చేతులకూ, కాళ్ళకూ కట్టబడిన తన వాస్త్రాన్ని వూడదీసుకునే ప్రయత్నంలో వుండగా, కొండమీద కొందరు మనుష్యులు కనిపించారు. వీరూ దొంగలై వుంటారా? అని మిత్రుడు అటు చూసేంతలో, వాళ్లల్లో ఒకడు అతడికేసి వేలు చూపుతూ, వెంట నున్నవారికి ఏమో చెప్పాడు. అది చూస్తూనే, మిత్రుడికి పై ప్రాణాలు పైనే పోయినంతపని జరిగింది. వీ రెవరో కొత్తదొంగలు. తనిప్పుడు నిర్ధనుడుగనక, వీళ్లు తప్పక తన ప్రాణాలను హరిస్తా రని అతడు భయపడ్డాడు. ఆ ప్రాణభయంతో అతడి కెక్కడలేని శక్తి కలిగింది. అతడు పళ్ళు బిగబట్టి, గట్టిగా ఊపిరి పీల్చి నాలుగైదుసార్లు బలంగా గుంజేసరికి అతడిచేతులను బంధించివున్న వస్త్రం చిరిగిపోయింది. అతడిచేతులు బంధ విముక్తాలయినై.

అనంతమిత్రుడు బ్రతుకుజీవుడా అనుకుని, నారాయణస్మరణ చేస్తూ, కాలికట్లు విప్పుకునేంతలో, కొండమీద వున్న మనుష్యుల్లో కొందరు, "పారిపోనీయకండి, పట్టుకోండి!" అంటూ కిందికి పరిగెత్తిరాసాగారు. మిత్రుడు వాళ్ళను చూస్తూనే, వెనకాముందులు ఆలోచించకుండా కాలిసత్తువకొద్దీ వచ్చిన దారివెంట పరిగెత్తాడు. అతణ్ణి పట్టుకోవచ్చిన మనుషులు అయిదారు నిమిషాల తరవాత ఆ చెట్టు దగ్గరకు చేరారుకాని, వాళ్ళకు, పండితు డెటు పారిపోయినదీ తెలియరాలేదు

అనంతమిత్రుడు దొంగ లని భ్రమపడిన మనుష్యులు దొంగలుకారు; రాజా రాజసింహుని సైనికులు. ఆనాటి ఉదయం రాజసింహుడు నూరుమంది అశ్వికులను వెంటబెట్టుకుని, వేటకై అరణ్యానికి వచ్చాడు. వేట అనంతరం అతడు తన గుర్రంమీద ముందుగా వస్తూ, అనంతమిత్రుణ్ణి దొంగలు బంధించటం చూశాడు. ఆ తరువాత అతడు దొంగలలో ముగ్గురిని వధించటం జరిగింది. ఈ సంగతు లేవీ

రాజసింహుని అనుచరులకు తెలియవు. వారు తమ ప్రభువును వెతుక్కుంటూవచ్చి, అనంతమిశ్రుడు ఆ ప్రాంతపువాడులా కనిపించకపోవటంతో, అతణ్ణి పట్టుకుని ప్రశ్నించేందుకు పట్టుకోచూశారు. కాని, అనంతమిశ్రుడు వారికి దొరకలేదు.

రాజసింహుండి సైనికులు చెట్టుదగ్గరకు వచ్చి, అక్కడ పడివున్న వస్త్రాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. అంతలో రాజసింహుడు అక్కడకు వచ్చి, "ఇక్కడ ఒక వృద్ధబ్రాహ్మణుడు దొంగలచేత చెట్టుకు కట్టివేయబడటం నేను చూశాను. అత దేమయ్యాడు?" అని సైనికులనడిగాడు. సైనికులు జరిగిన సంగతి చెప్పారు.

రాజసింహుడు ఆ ప్రదేశానికి వచ్చే దారిలో చంచలకుమారి రాసిన లేఖ చదివాడు. ఆలేఖలో అతణ్ణి ముఖ్యంగా ఆకర్షించిన వాక్యాలు యివి... ఏ వీరుడు నన్ను మొగలాయీ హంతకులబారి పడకుండ రక్షించగలడో, అతడు రాజపుత్ర వంశస్థుడైవుండి, నన్ను శాస్త్రవిధిగా వివాహ మాడినయడల, అతడికి దాసినై వుండగలనని ప్రతిజ్ఞ చేయుచున్నాను. ... ఒకవేళ నేను ఢిల్లీకే పోవలసిన దురవస్థ కలిగితే, మార్గమధ్యంలో విషపానం చేసి ప్రాణాలు విడిచేందుకు నిర్ణయించుకున్నాను. మహారాణా సంగ్రామ, ప్రతాపసింహుల వంశస్థులైన మీరు, ఢిల్లీతురకల బల గర్వాలు చూచి, భయపడగలరని నేను భావించటంలేదు.........

రాజసింహుడు ముందు కర్తవ్యాన్నిగురించి యోచిస్తున్నంతలో, ఆ ప్రదేశానికి తక్కిన అశ్వికులుకూడా వచ్చారు వారిలో రాజసింహుని యిద్దరు కుమారులే కాక, జ్ఞాతులు, మంత్రులుకూడా వున్నారు. రాజసింహుడు వారిని ప్రక్కకు పిలిచి, ఏమేమో మాట్లాడి, మిగిలిన అశ్వసైనికులకేసి తిరిగి, "మన కీనాడు ఉదయపురం పోయి విశ్రాంతి తీసుకొనే అదృష్టంలేదు. వెనుదిరిగి వచ్చినమార్గాన్నే పోవలసిన అవసరం కలిగింది. ఒక ముఖ్యమైన పోరు తటస్థపడవచ్చు. రణరంగంలో ఉరికే ఉత్సాహం వున్నవాళ్ళుమాత్రమే నావెంట రాకోరుతాను. ఇష్టంలేనివాళ్ళు స్వేచ్ఛగా ఉదయపురానికి పోవచ్చు." అన్నాడు.

రాజసింహు డిలా అనగానే సైనికు లందరూ, జై జననీ; మహారాణాకు జై! అని కేకలుపెట్టారు. రాజసింహుడు తన అశ్వాన్ని అదలించి రూపనగరంకేసి బయలుదేరాడు. "హర హర మహదేవ్!" అంటూ అశ్వసైనికు లందరూ అతడి వెనుకగా తమ గుర్రాలను పరిగెత్తించారు.

## 9

చంచలకుమారి యిచ్చినలేఖ తీసుకొని అనంతమిశ్రుడు ఉదయపురికి బయలు దేరిన మరునాటి ఉదయానికి ఢిల్లీపాదుషా పంపిన రెండువేలమంది అశ్వికులు

రూపనగరం చేరారు. వారు చంచలకుమారిని ఢిల్లీ తీసుకుపోయేందుగ్గాను వచ్చినట్టు నగరంలో అందరికీ తెలిసిపోయింది. చంచలకుమారీ, ఆమె ప్రియసఖి నిర్మలా పొందిన విచారం అంతా యింతాకాదు. తమ గురువుచేత రాజసింహుడికి పంపిన సందేశం ఆయనకు అందేలోపలే, మొగలులు తనను నగరంనుంచి తీసుకుపోతారని చంచలకుమారి భయపడింది.

"ఇప్పు డేమిటి కర్తవ్యం సఖీ?" అని అడిగింది నిర్మల.

"కర్తవ్యం ఏముందీ? ఢిల్లీకి వెళ్ళేమార్గంలో విషపానం చేసి ప్రాణత్యాగం చేయటం తప్ప, నా కిం కేకర్తవ్యమూ లేదు," అన్నది చంచల.

"ఒక్కవారంరోజులు యీ మొగలుల్ని యిక్కడ వుంచగలిగితే, మనకు రాజసింహుడినుంచి తప్పక సహాయం లభిస్తుంది." అన్నది నిర్మల.

"నా ప్రార్థన నాయన ఆలకిస్తాడని నీకు గట్టిగా నమ్మకిం వున్నదా? అయితే, ఒక పని చేస్తాను." అంటూ చంచల తన తండ్రిదగ్గరకు పోయి, ఆయన పాదాలు తాకి నమస్కరించి, "నేను ఒకసారి ఢిల్లీపాదుషా అంతఃపురం ప్రవేశించినతరువాత మరి యీజన్మలో యిక్కడికి తిరిగిరావటం జరుగదు. మీరు ఏదోవిధంగా మొగలుసేనానితో చెప్పి, నన్ను పంపేందుకు వారంరోజులు వ్యవధి సంపాయించండి. ఈ వారంరోజులూ నా బాల్యసఖులతో కలసి కాలక్షేపం చేస్తాను. ఆఖరిసారిగా మీ సన్నిధిలో ఆనందంగా యీకొద్దికాలం గడుపుతాను," అని చెప్పింది.

కుమార్తెమాటలు వినగానే విక్రమసింహుడు కన్నీళ్లు పెట్టుకుని, "అమ్మా! నాకూ నిన్నా ఢిల్లీకి పంపడం విచారకరంగానే వుంది. పాదుషా ఆజ్ఞ. మొగలాయీ సేనా నాయకుణ్ణి ఒకవారం ఆగవలసిందిగా కోరుతాను. అత డేమంటాడో!" అని కూతురుతో చెప్పి, మొగలుసేనాని అయిన సైద్‌హసనల్లీ దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు.

సైద్‌హసనల్లీ పెద్దచిక్కులో పడిపోయాడు. పాదుషా అతణ్ణి యిన్ని రోజుల్లో ఢిల్లీకి తిరిగిరావలసిందని ఆజ్ఞాపించినమాట నిజమే! అయినా, వారంరోజులు యిక్కడ జాగుచేయటం బాగుంటుందా? అట్లని కాబోయే బేగం కోర్కెను తిరస్కరించటం ముందుముందు తనకు ప్రమాదకరం కావచ్చు.

హసనల్లీ యీ విధంగా ఆలోచించి మధ్యేమార్గంగా, అయిదు రోజులు తను రూపనగరంలో ఉండగల నని విక్రమసింహుడికి చెప్పాడు. ఈ సమాచారం చంచలకు కొంత ఊరట కలిగించింది. ఈ గడువులో తన గురువు తప్పక తిరిగిరాగల డనీ, లేక నిర్మల వూహిస్తున్నట్టు రాజసింహుడే ససైన్యంగా నగరానికి వచ్చే అవకాశంకూడా వుండవచ్చనీ ఆమె ఆశపడింది.

నగరంలో మొగలు సైనికులకు దివ్యంగా కాలక్షేపం జరిగిపోతున్నది. వాళ్ళ గుడారాల్లో విందులూ, వినోదాలు, నాట్య సంగీత కచ్చేరీలూ ఎడతెగకుండా జరిగిపోతున్నవి. నర్తకులలో మెహరజాన్ అనేపేరుగల ఒకనర్తకి సైద్‌హసనల్లీని ఆకర్షించింది. అతడు ఢిల్లీలోకూడా అంతసుందరినిగాని, అంత గొప్ప నాట్యశాస్త్ర ప్రవీణురాలినిగాని చూడలేదు.

ఒకనాటిరాత్రి హసనల్లీ ఆమె యింటికి స్వయంగా వెళ్ళి, ఆమె నాట్యానికి సమ్మోహితుడై, బహుమానంగా చాలాధనం యివ్వబోయాడు. కాని, ఆ నర్తకి అతడి ధనాన్ని నిరాకరించి, "నాకు ధనం అవసరంలేదు. నా దొక కోర్కె వున్నది. అది తీర్చండి చాలు." అన్నది.

"ఏమిటా కోర్కె?" అని అడిగాడు హసనల్లీ.

"నన్ను మీ అశ్వసైనికుల్లో చేర్చుకోండి"

సైదల్లీకి కలిగిన ఆశ్చర్యం అంతాయింతా కాదు. అతడు ఆ నర్తకిని నఖశిఖపర్యంతం పరీక్షగా చూసి, "ఇది చాలా వింతకోర్కె! స్త్రీ అశ్వసైనికురాలెలా కాగలుగుతుంది? నా సైనికుల మధ్య నీ వెలా మసులుకోగలవు?" అన్నాడు.

నేను పురుషవేషం ధరిస్తాను. అశ్వానికీ, కత్తి యితర ఆయుధాలకూ అయ్యే ఖర్చు నేనే భరిస్తాను. నా కోర్కె నెరవేర్చండి." అన్నది నర్తకి ప్రాధేయపడుతూ.

హసనల్లీ ఆమెకోర్కెను నిరాకరించటం సాధ్యంకాలేదు. అతడు అయిష్టంగానే అయినా అంగీకారసూచకంగా తల వూపి, అక్కడినుంచి లేచి వెళ్ళిపోయాడు. నర్తకి కళ్ళు మెరిసినై. ఆమె పెదవులమీద చిరునవ్వు తాండవించింది. ఆ నర్తకి మరెవరోకాదు, మెహరజాన్ అని పేరు మార్చుకున్న దరియాబీబీ.

* * * * * * * *

దరియాబీబీ పురుషవేషం ధరించి మొగలు గుర్రపురౌతు అయినరోజునే, రాజసింహుడిచే క్షమించబడిన బందిపోటుదొంగ మాణిక్యాలాలు రూపనగరం చేరాడు. అతడు ముందుగా తన గ్రామం వెళ్ళి తన కుమార్తెను పెంచవలసిందిగా ఒకబంధువు వాలికి ఒప్పచెప్పి, రూపనగరంకేసి బయలుదేరాడు. అరణ్యంలో అతడికి రాజసింహుడి గుర్రపుడెక్కలు పోయిన మార్గం గుర్తించటం ఏమంత కష్టంకాలేదు. చంచలకుమారి లేఖ చదివిన రాజసింహుడు, ఆమెను మొగలుల బారినుంచి కాపాడేందుకు రూపనగరం వెళ్ళాడని అతడు నిశ్చయించుకున్నాడు.

రూపనగరం చేరిన మాణిక్యలాలుకు గొప్ప ఆశాభంగం కలిగింది. రాజపుత్ర అశ్వికులక్కడ లేరుగాని, మొగలాయీ అశ్వికులు మాత్రం వందల సంఖ్యలో నగరవీధులలో తిరుగుతున్నారు. అతను ఎక్కడ విచారించినా రాజసింహుడిని గురించిన సమాచారం తెలియరాలేదు. బాగా ఆలోచించినమీదట మాణిక్యలాలుకు ఒక ఊహకలిగింది. యుద్ధతంత్రజ్ఞుడైన రాజసింహుడు, చంచలకుమారికోసం ఢిల్లీకి పోయే మార్గంలో మాటు వేసివుంటాడని అతడు నిశ్చయించుకున్నాడు. ఆ వెంటనే అతడు నగరంలో కాలం వ్యర్థపుచ్చక ఢిల్లీకి వేళ్లే మార్గంవెంట బయలుదేరాడు.

మార్గం కొంతదూరం సమతలంగా వుంది. ఆ తరవాత రాళ్ళగుట్టలతో మెట్టలతో ఎగుడుదిగుడుగా తయారైంది. మరికొంతదూరం పోయేసరికి ఎదురుగా రెండు కొండలు కనిపించినై. ఆ కొండల మధ్య ఒక ఇరుకుదారి వున్నది. ఆ కొండల్లో ఎడమవైపుది నిటనిలువుగా వుండి ఆశ్వికసైన్యం ఎక్కేందుకేమాత్రం అనుకూలంగా లేదు. కుడివైపు కొండ కొంత చిన్నదే కాక నిట్టనిలువుగా లేకపోవటంతో, కొంత శ్రమపడితే గుర్రపుదళం ఎక్కటానికి అనువుగా వున్నది.

'ఇదీ రాణా రాజసింహుడి ఎత్తుగడ!' అనుకున్నాడు మాణిక్యలాలు. చంచలకుమారిని తీసుకుపోయేందుకు వచ్చిన మొగలాయీ గుర్రపుదళం యీ యిరుకు మార్గంలో ప్రవేశించగానే, హఠాత్తుగా వారిపైనబడి, వాళ్ళను సర్వనాశనం చేయటము రాజసింహుడి పథకం అయివుంటుంది. కాని, మాణిక్యలాలుకు ఆ కొండమీద ఎక్కడా మనుషుల జాడగాని, గుర్రాల జాడగాని కనిపించలేదు. అయినా, అతడు నిరాశ పడక కుడివైపు కొండ కొంతదూరం ఎక్కి, తనను మొగలాయీ పక్షీయుడని ఎవరైనా అనుమానించి చంపకుండా వుండేందుకుగాను, "మహారాణా రాజసింహుడికీ జై!" అంటూ ముందుకు నడవసాగాడు.

మాణిక్యలాలు ఆ విధంగా జేజేలు కొడుతూ కొంతదూరం వెళ్ళేసరికి మెరుపులా ఒక బండరాయిచాటునుంచి నలుగురు యోధులు పైకి లేచి, కత్తులు దూసి, మాణిక్యలాలును చంపేందుకు ముందు కురికారు. కాని, అంతలోనే వెనకనుంచి, "అతణ్ణి చంపకండి, మనవాడే!" అన్న హెచ్చరిక వినిపించింది. మాణిక్యలాలు ఆ గొంతు గుర్తించాడు, అది రాజసింహుడిది!

మాణిక్యలాలు గండం తప్పిం దనుకుంటూ నాలుగైదడుగులు ముందుకు నడిచేసరికి, ఒక ఎత్తయిన రాతి చాటునుంచి రాజసింహుడు ముందుకు వచ్చాడు. మాణిక్యలాలు అతడికి ప్రణామం చేసి నిలబడ్డాడు.



"నీ వికక్కడి కెందుకు వచ్చావ్, మాణిక్యలాల్?" అని అడిగాడు రాజసింహుడు

"ప్రభు వెక్కడ వుంటే భృత్యుడుకూడా అక్కడే వుండాలి నేను రూపనగరం నుంచే వస్తున్నాను అక్కడ రెండువేల మొగలాయీ అశ్వికులు దండువిడిసి వున్నారు. తమ వెంటవున్న సేన చాలా స్వల్పమని నేనూహించాను నాకు మీరు ప్రాణదానం చేశారు అవసరమైతే మీకొరకు నేను ప్రాణత్యాగం చేయదలిచాను." అన్నాడు మాణిక్యలాలు

"నీవంటివా డొకడు వుంటే బావుండునని నే నింతకుముందే ఆలోచిస్తున్నాను నే నొకపని చెపుతాను, చేయగలవా?" అన్నాడు రాజసింహుడు

"ఎంత కఠినకార్యమైనా సరే చెప్పండి - చేయగలను"

"ఇక్కడ మన బలం నూరుగురు అశ్వికులుమాత్రమే మొగలాయిబలం రెండువేలు. వాళ్ళతో మనం ముఖాముఖి యుద్ధం చేసి గెలవటం సాధ్యంకాదు అంతేకాక. ముందుగా రాజకుమారిని కదనభూమినుంచి తప్పించి. ఆ తరవాత మొగలులతో మనం పోరాడవలసివుంటుంది ఆపని నువ్వు చేయాలి." అన్నాడు రాజసింహుడు

"ఆకార్యం సాధించేమార్గ మేదో తమరు చెప్పండి." అన్నాడు మాణిక్యలాలు

"నువ్వు వెంటనే రూపనగరానికి తిరిగిపో రేపు ఉదయమే మొగలులు రాజకుమారిని ఢిల్లీకి తీసుకుపోబోతున్నారు నువ్వు మొగలుసైనికుడివేషంలో ఆమె పల్లకివెంట వుండు. నేను చెప్పినట్టు చేయాలి" అని. రాజసింహుడు రహస్యంగా మాణిక్యలాలుకు కర్తవ్య మేమిటో తెలిపాడు

"ప్రభూ, మీ ఆజ్ఞ శిరసావహిస్తాను ఇప్పుడే రూపనగరానికి బయల్దేరి వెళ్ళుతాను. నా కొక అశ్వాన్ని యిప్పించండి." అన్నాడు మాణిక్యలాలు.

"మేము నూరుమందిమి నూరు గుర్రాలు మాత్రమే వున్నవి. ఇతర ఆశ్వికులను తమ గుర్రాల నివ్వమని ఆజ్ఞాపించలేను. కావాలంటే, నా అశ్వాన్ని తీసుకో," అన్నాడు రాజసింహుడు

మాణిక్యలాలు, రాజసింహుడికి ప్రణామం చేస్తూ, "ప్రభూ, మీ అశ్వాన్ని తాకేందుకూడా నేనర్హుణ్ణికాదు. అవసరం అయిన ఆయుధాన్నిప్పించండి. చాలు" అన్నాడు.

"ఆయుధాలుకూడా ఎవరిదగ్గిరా వాళ్ళ అవసరాలకు మించిలేవు ఇదుగో, నా కత్తి ఇదే తీసుకో," అన్నాడు రాజసింహుడు

"మహారాజా! అవి నాకు వద్దు గుర్రాన్నీ, ఆయుధాలనూ, సైనికుడికి అవసరం అయిన ఉడుపులనూ — ఏవిధంగానైనా సరే సంపాయించుకునేందుకు నాకనుజ్ఞ యివ్వండి" అన్నాడు మాణిక్యలాలు.

రాజసింహుడు చిరునవ్వు నవ్వి, "ఏం తిరిగి దొంగవు కాజూస్తున్నావా!" అని ప్రశ్నించాడు.

"ఆ పని చేయనని తమకు వాగ్దానం చేశాను కదా, ప్రభూ!" అన్నాడు మాణిక్యలాలు అమాయకంగా ముఖంపెట్టి.

"అయితే, యీ వస్తువులన్నీ ఎలా సంపాయించుకోగలవు?"

"మోసగాండ్రను మోసగించి సంపాయించుకోగలను"

"అలా అయితే ఫరవాలేదు. యుద్ధ సమయంలో అందరం దొంగలమే, మోసగాండ్రమే. ఇక్కడ మేమంతా మాటువేసివున్నది ఎందుకు? రాజకుమారిని పాదుషా సైనికులనుంచి మోసంతో దొంగిలించుకుపోయేందుకు. నువ్వుకూడా అవసరం అయిన పరికరాలన్నీ ఆవిధంగానే చేజిక్కించుకో." అన్నాడు రాజసింహుడు

మాణిక్యలాలు ఎనలేని సంతోషంతో రాజుకు వంగివంగి నమస్కారాలు చేసి వెనుదిరిగి రూపనగర మార్గం పట్టి నడిచాడు.

సూర్యాస్తమయ వేళకు మాణిక్యలాలు రూపనగరం చేరాడు నగరవీధులన్నీ వచ్చేపోయే జనంతో చాలా కోలాహలంగా వున్నవి మర్నాటి ఉదయానే చంచల కుమారి ఢిల్లీ ప్రయాణమై పోతున్నదని అందరూ చెప్పుకోసాగారు తెల్లవారే లోపుగా తను గుర్రం, ఆయుధాలూ సంపాయించుకోవాలి ఎలాంటి పన్నుగడ వేస్తే అది సాధ్యమవుతుంది? మాణిక్యలాలు యిలా ఆలోచిస్తూ రాజమార్గం వెంట

నడవసాగాడు. అతడి కొక మిఠాయి అంగడి కనిపించింది. అది చూస్తూనే అతడికి ఎక్కడలేని ఆకలిబాధ కలగటంతో, ఆతడు అంగడిలో ప్రవేశించి యింత మిఠాయి తిని, సేరు పాలు తాగి, తిరిగి వీధిలోకి వచ్చాడు. మిఠాయికొట్టు కెదురుగానే తమలపాకు లమ్మే దుకాణం ఒక టున్నది. ఆతడు ఆ దుకాణం ముందుకు వెళ్ళి నిలబడ్డాడు.

ఆ దుకాణం యజమానురాలు పట్టుబాలీసులకు ఆనుకు కూర్చొనివున్నది. ఆమె వయసు ముప్పైఏళ్ళకు మించదు. మనిషి అవయవపుష్టి గలిగి చాలా అందంగా కనిపిస్తున్నది. దుస్తులు ధరించిన తీరూ, నగలూ, పువ్వులూ అలంకరించుకున్న పద్ధతీ చూస్తే ఆమె చాలా రసికురాలిలా కనిపిస్తున్నది. ఆ సమయంలో మాణిక్యలాలు మెదడులో ఒక ఆలోచన మెరిసింది. ఆతడు దుకాణం మెట్లెక్కి, తమలపాకులూ, సుగంధ ద్రవ్యాలూ అమ్ముతున్న ఆవిడ పనిమనిషితో, తనకు తమలపాకుల పట్టీ ఒకటి తయారు చేయమన్నాడు.

పనిమనిషి తమలపాకులు తుడిచి వాటిలో సుగంధద్రవ్యాలు నింపుతున్న సమయంలో, దుకాణానికి కట్టివున్న ఫలకంమీద వున్న యజమానురాలి పేరు చదివి, "రాజామణి. పేరుకుతగ్గ రూపం," అన్నాడు మాణిక్యలాలు నవ్వుతూ. రాజామణి కూడా చిరునవ్వు నవ్వి, పట్టుదిండ్లమీద మరికాస్త ఒరిగికూర్చుంటూ, "మీ రెవరో యీ నగరానికి కొత్తవాళ్ళలా వున్నారు. నన్నెరగనివాళ్ళూ, నా పేరు తెలియనివాళ్ళూ యీ నగరంలోనే లేరు. మీరు ఫలకంమీది పేరు చదివా, నా రూపం మెచ్చుకునేది," అన్నది చిరుకోపంగా.

"నువ్వన్నట్టు నే నీ నగరానికి కొత్తవాణ్ణే. పొద్దుటినుంచీ ఒక చిన్న కార్యం సాధించేందుకు ఎవరైనా సహాయం చేస్తారేమో అని చూస్తున్నాను. ఎంత డబ్బు ఆశచూపినా, ఒక్కరూ సహాయపడేలా లేరు. ఈ నగరవాసు లంతా ఒట్టి పిరికిమందల్లా కనిపిస్తున్నారు," అన్నాడు మాణిక్యలాలు.

"ఈ రూపనగర పౌరుల్ని పిరికివెధవలకింద కట్టేసే. మీ ధైర్యం ఎలాంటిదో చూడాలనివుంది. మీ కొక్కవలసిన సహాయం ఏమిటి? చెప్పండి" అన్నది రాజామణి.

మాణిక్యలాలు, నౌకరుమనిషి కేసి సౌంజ్ఞ చేశాడు. రాజామణి అది గ్రహించి ఆ మనిషికి ఏదో పని పురమాయించి మరొకవీధికి పంపింది. మాణిక్యలాలు, రాజామణి పక్కన వెళ్ళికూర్చుని, ఆమెకు సంగతంతా చెప్పి, "ఈ పనిలో నీవు సహకరించావంటే, అయిదు మొహరీలు ఇవ్వగలను," అన్నాడు.

"డబ్బెవరికొ్కావాలి ? మీరు చెప్పేదంతా వింటూంటే చాలా తమాషాగావుంది ఇదొక వినోదం. నేను దమ్మిడీ తీసుకోను కాని, ఆ పథకం నెరవేరాలంటే, నా యిల్లు పనికిరాదు. వేరే యిల్లు తీసుకోవాలి. మనకు అన్ని విధాలా అనుకూలంగా వుండే యిల్లొకటి పక్కవీధిలో వున్నది ఆ యిల్లు మీకు చూపిస్తాను ఆ తరవాత మీ పనిమీద మీరు వెళ్ళండి." అన్నది రాజామణి ఉత్సాహంగా

మాణిక్యలాలు కలం, కాయితం తీసుకుని ఒక ఉత్తరం రాశాడు అందులో యిలా ఉన్నది

"ప్రాణప్రియా : నీవు మొగల్ ఆశ్వికులతో నగరం ప్రవేశించేటప్పుడు చూసి, నేను మోహసముద్రంలో పడిపోయాను. నీఅంత అందగాడు ప్రపంచంలో మరొకడు వుంటాడని నేను నమ్మను. నిన్ను మరొకసారి చూడకపోతే, నేను బ్రతకటం కల్ల. నామీద ప్రేమ వుంటే, యీ వుత్తరం తెచ్చిన మనిషివెంట రావలసిందిగా ప్రార్థిస్తున్నాను."

ఉత్తరం రాయటం పూర్తవగానే మాణిక్యలాలు దాన్ని నాలుగు మడతలుగా మడిచి పైన విలాసం మహమ్మద్‌ఖాన్‌సాహెబ్‌గారికి—అని రాశాడు. ఆ విలాసం చదివిన రాజామణి, ఆశ్చర్యపోతూ, "ఈయన్ను నువ్వెరుగుదువా ?" అని ప్రశ్నించింది.

"ఎరగను; అంత మొగల్‌సైన్యంలో మహమ్మద్‌ఖాన్ అనే పేరుగలవాడే వుండడా ?" అన్నాడు మాణిక్యలాలు నవ్వుతూ.

తరవాత అతడు రాజామణివెంట పక్కవీధిలోని ఇంటికి వెళ్ళి, ఆయిల్లు బాగా గుర్తుండగలందులకు పరిసరాలను పరీక్షగా చూసుకుని, మొగల్ ఆశ్వికుల శిబిరాలున్నచోటుకు వెళ్ళాడు. ఆ ప్రదేశ మంతా గానా బజానాలతో మహాజల్సాగా వున్నది మాణిక్యలాలు ఎదురైన మొగలు సైనికులను ఆపి, "మహమ్మద్‌ఖాన్ సాహెబ్ గారిని మీ రెరుగుదురా ? ఆయనగారి కొక వుత్తరం యివ్వాలి.' అని ప్రశ్నించసాగాడు.

మాణిక్యలాలు యీ విధంగా ఒక అరగంటకాలం శిబిరం అన్నిమూలలా తిరిగేసరికి, ఒకచోట అతడి ప్రశ్నకు అవు నన్నట్టు జవాబు వచ్చింది. "నాపేరు నూర్ మహమ్మద్‌ఖాన్, కొందరు నన్ను మహమ్మద్‌ఖాన్ అనే పిలుస్తారు. ఆ వుత్తరం ఏదో నా కిస్తే, చూసి నా దవునో కాదో చెపుతాను," అన్నా డొక మొగల్ సైనికుడు.



మాణిక్యలాలు పరమానందంగా వుత్తరాన్ని ఆ సైనికుడి కిచ్చాడు. సైనికుడు వుత్తరం స్వంతం చదువుకుని పొంగిపోతూ, "ఆహా, వుత్తరం నా ప్రియురాలు రాసిందే. నూర్ అని రాయమరిచింది. ఆవిణ్ణి ఇంతవరకూ ఒకేసారి కలుసుకున్నాను. ఆ ఇల్లేదో నాకు బాగా గుర్తులేదు." అన్నాడు.

"నా వెంట రండి. కొంచెం దూరం కనకా, ఆవీధి మొగదల్లో కొందరు దుష్టులు కూడా వున్నారు గనకా, తమరు సాయుధులై గుర్రంమీద రావటం మంచిది." అన్నాడు మాణిక్యలాలు.

నూర్‌మహమ్మద్ 'ఇదుగో వచ్చె' అంటూ, తన గుడారంలోకి పోయి కత్తి కటారులు తీసుకుని, గుర్రం ఎక్కి బయలుదేరాడు. కొద్దిసేపటి తరువాత మాణిక్యలాలూ, ఆ సైనికుడూ సంకేత గృహం చేరారు. మాణిక్యలాలు వారగా వేసివున్న వీధితలుపు తెరిచి, "అయ్యా. మీరు చాలా జాగ్రత్తగా మసలుకోవాలి. గుర్రాన్ని వదలండి, ఆ చెట్టుకు కట్టేస్తాను. మీ సైనిక దుస్తులూ, ఆయుధాలూ యీ తలుపు పక్కగా పెట్టండి. మీ ప్రియురాలు వెనుకగదిలో వున్నది. మీ రా కనిపించే తలుపు తెరుచుకుని లోపల ప్రవేశించవచ్చు." అన్నాడు.

నూర్‌మహమ్మద్ గుర్రాన్ని మాణిక్యలాలు కిచ్చి, ఆయుధాలను తలుపు పక్కగా లోపల పెట్టి, వెనక గదిలోకి వెళ్ళాడు. అక్కడ ఒక మంచంమీద రాజామణి అతడికి కనిపించింది. ఆమె నవ్వుతూ అతణ్ణి ఆహ్వానించి కూర్చోమని చెప్పి తమలపాకుచుట్టలు యిచ్చింది.

నూర్‌ఖాన్ ఆ తమలపాకులు నవులుతూ, పక్కనున్న హుక్కాగొట్టం తీసుకుని గట్టిగా పీల్చి పొగలు వదలసాగాడు. అంతలో వీధితలుపు నెవరో తట్టారు రాజామణి అదిరిపడుతూ మంచంమీంచి దిగి, "ఖాన్‌సాహెబ్‌గారూ, కొంప లంటుకున్నై. గంటముందు వ్యాపారంమీద పొరుగూరు ప్రయాణమైపోయిన నాభర్త ఏ కారణంవల్లనో తిరిగి వచ్చాడు. మీరు యీ మంచంకింద ఒక్కక్షణ కాలం దాక్కోండి. నేను తలుపు తెరచి సంగతేమిటో కనుక్కువస్తాను," అన్నది

"సంగతి కనుక్కునే దేమిటి? వాణ్ణి ఈకత్తితో నరికి పీడలోకి నెట్టేస్తాను." అంటూ నూర్‌ఖాన్ లేవబోయాడు రాజామణి అతడికేసి కోపంగా చూస్తూ, "మిమ్మల్ని ప్రేమించిన నేరానికి, నా కట్టుకున్న భర్తను చంపుతానంటారా? ప్రపంచంలో యింత అన్యాయం ఎక్కడైనా వున్నదా? ఇదే మీ ప్రేమా? నిజంగావే మీరు ప్రేమించినవారైతే, నేను చెప్పినట్టు చేయండి. ఈ మంచంకింద కొద్దికాలం పాటు ఒదిగి కూర్చోండి." అన్నది బతిమాలుతున్నట్టు

నూర్‌మహమ్మద్‌ఖాన్ చేసేది లేక మంచంకిందికి దూరి దాక్కున్నాడు. రాజామణి వీధితలుపు తెరచి, "మీ రిప్పుడేగదా వెళ్ళింది? అప్పుడే తిరిగివచ్చారేం?" అని పెద్దగా ప్రశ్నించింది మాణిక్యాలాలు గొంతు వికృతంగాపెట్టి ఓ క్షణకాలం ఏమో మాట్లాడి, రాజామణి గడపదాటి వీధిలోకి రాగానే తలుపు దగ్గిరకు లాగి, తాళం వేసేశాడు

నూర్‌మహమ్మద్‌ఖాన్ యీ విధంగా పాడుబడ్డ ఒకకొంపలో బందీ అయిపోయాడు మాణిక్యలాలు అతడి గుర్రాన్నీ, ఆయుధాలనూ తీసుకుని, అతడు వదిలిన సైనికదుస్తులు ధరించి మొగలాయీ సైనికశిబిరానికి వెళ్ళాడు

## 10

మర్నాటి సూర్యోదయంవేళ మొగలుసైన్యం చంచలకుమారిని తీసుకుని ఢిల్లీకి ప్రయాణమైంది చంచలను నిర్మల చక్కగా అలంకరించి, కన్నులనీరు పెట్టుకొని ఆమె నొకసారి కౌగలించుకున్నది చంచల తన సఖిని ఓదారుస్తూ, "ఈ జన్మకు మనం ఒకరినొకరు చూసుకునే ఆశలేదు నిర్మలా! ఢిల్లీమార్గంలో ఆత్మహత్య చేసుకోనున్న నన్ను యింతగా వస్త్రాభరణాలతో అలంకరించటం ఎందుకూ?" అన్నది గాద్గదికస్వరంతో

"సఖీ! నువ్వు ఉదయపురాధీశ్వరుడికి రాణి వయేందుకు వెళ్ళుతున్నావు అందుకే నిన్ను యింతగా అలంకరించాను," అన్నది నిర్మల

"అంత అదృష్టం నాకున్నదనుకోను. అంతా భగవదేచ్ఛ. పుట్టి పెరిగిన ఈ నగరాన్నీ, తల్లి దండ్రులనూ, బాల్యంనుంచీ ఆటపాటలతో నన్నెంతో సంతోష పెట్టిన నీలాంటి సఖులనూ విడిచిపోతున్నాను. ఇది నా పూర్వజన్మ పాపఫలమేమో" అన్నది చంచలకుమారి.

నిర్మల ఆమె కంటినీరు తుడుస్తూ, "సఖీ! నిరాశపడకు. ఢిల్లీ మార్గంలోకూడా నేను నీ వెంట రాగలను," అన్నది.

"అదెలా సాధ్యం?"

ఆ ప్రశ్నకు నిర్మల ప్రత్యుత్తరం యివ్వలేదు. చంచలకుమారి తల్లిదండ్రులకు నమస్కరించి, వారి ఆశీస్సులు పొంది, తన బాల్యస్నేహితురాండ్ర కందరకూ వీడ్కోలు చెప్పి పల్లకీ ఎక్కింది. మొగలు ఆశ్వికులు వెయ్యిమంది ముందూ, వెయ్యి మంది వెనకా ఆ పల్లకీతోపాటు నడిచారు. సైన్యం నగరం వదిలి క్రమంగా ఢిల్లీ మార్గంపట్టి పోసాగింది.

చంచలకుమారివెంటవున్న ఆశ్వికయోధులలో ఒకడు గొంతెత్తి యిలా పాడ సాగాడు:

సా రోమాంచతి సోత్కరోతి విలప త్యుత్కంపతే తామ్యతి
ధ్యాయ త్యుద్భ్రమతి ప్రమీలతి పత త్యుద్యాతి మూర్ఛత్యపి
ఏతావత్య తనుజ్వరే వరతను ర్జీవే న్నకిం తే రసాత్
స్వర్వైద్యప్రతిమ ప్రసీదసి యది త్యక్తో ఽథా హస్తకః

ఈపాట వింటూనే చంచలకుమారి ఉలిక్కిపడింది. ఆ పాటలోని భావం అప్పటి ఆమె మనస్థితికి తగినట్టుగా వున్నది. ఆమె చేతులు జోడించి, "హా, గోవర్ధనగిరి ధారీ! ఆర్తపరాయణుడవైన గోపాలకృష్ణమూర్తీ! ఆ ఆశ్వికయోధుడు ప్రార్థిస్తున్నట్టు, నన్నీ ఆపదనుంచి ఉద్ధరించలేవా?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. మొగలు సైనికుల్లో అనేకులు తమకు తోచిన పాటలు పాడసాగారు. అవి సాంఘిక, ఉరుదూపాటలు. చంచలకుమారి మనోగత భావాలను ప్రతిబింబిస్తూ పాడబడినపాట, మాణిక్యలాలు పాడినది. అతడు మొగలు సైనికుడి వేషంలో ఆమె పల్లకీ వెనకనే నడుస్తున్నాడు.

చంచలకుమారి నగరం వదిలిపోగానే, నిర్మల రాజసౌధం పైభాగానికి పోయి, సైన్యం నగరంపొలిమేరలు దాటేవరకూ చూసింది. ఆ తరువాత సైన్యం ఒకచిన్న కొండమలుపు తిరగటంతో ఆమెకు కనిపించకుండాపోయింది. నిర్మల ఎనలేని దుఃఖంతో కొద్దిసేపు ఏం చేసేందుకూ తోచక పిచ్చివానిలా అటూ యిటూ తిరిగి

తరవాత తన అలంకారాలన్నీ తీసి మూటగట్టుకుని, ఎవరికంటా బడకుండా రాజభవనం వదిలి, చంచలకుమారి ప్రయాణిస్తున్న మార్గాన్ననుసరించి నడవసాగింది

మాణిక్యాలాలు ఏ కొండల దగ్గరైతే రాజసింహుణ్ణి కలుసుకున్నాడో, అక్కడికి మొగలుసైన్యం చేరింది అది రెండుకొండల మధ్యగల యిరుకుదారి. మొగలు ఆశ్వికులు ఎలాంటి ప్రమాదాన్నీ శంకించుకుండా ఆమార్గం ప్రవేశించి కొంతదూరం వెళ్ళారు. హఠాత్తుగా ముందున్న ఆశ్వికులమీద ఎడమవైపుగల కొండమీదినుంచి ఒక బండరాయి దొర్లిపడింది. ఆ దెబ్బకు యిద్దరాశ్వికులు చచ్చారు, నలుగురు గాయపడ్డారు ఆశ్వికులంతా ఆగి, ఆరాయి దొర్లిన వైపుకు చూసేంతలో ఒకటి... రెండు...ఈ విధంగా, ఒకదానివెంట ఒకటిగా పెద్దపెద్దరాళ్ళు అతివేగంతో కిందికి దొర్లి వాళ్ళమీద పడసాగినై సైనికులు హాహాకారాలు చేశారు అశ్వాలు బెదిరి రౌతులను కిందపడవేసి పారిపోయేందుకు ప్రయత్నించాయి

ఈ ఆపత్సమయంలో చంచలకుమారి ఉన్న పల్లకి మోస్తున్న బోయీలు ప్రాణభయంతో ఎటు పారిపోవటమా అని దిక్కులు చూస్తున్నంతలో మాణిక్యాలాలు తన అశ్వాన్ని వారి పక్కకు నడిపి, "పల్లకి ఎదివేసి జాగ్రత్త! ఇక యీ ప్రదేశంలో నిలవటం ప్రమాదకరం. అదుగో, ఆ కనబడుతున్న పెద్ద రాతిమలుపులో మనుషులు పోదగినంత రంధ్రం వున్నది మీ రా మార్గాన పోయి, కొండ ఎక్కండి." అని హెచ్చరించాడు బోయీలు బతుకుజీవుడా అనుకుంటూ పల్లకితో అటుకేసి పరిగెత్తారు మాణిక్యలాలుకూడా వెంటనే వెళ్ళి, వాళ్ళు రంధ్రమార్గాన లోపలికి పోగానే, గుర్రం దిగి తనూ లోపల ప్రవేశించాడు. ఆ వెంటనే ఒక చాపరాయి పైనుంచి పడి, ఆ రంధ్రాన్ని మూసివేసింది

మొగలాయీ సేనా ముఖాన జరుగుతున్న గందరగోళాన్ని, సైన్యం వెనకభాగాన వున్న వాళ్ళ నాయకుడు హసన్‌ల్లీఖాన్ విన్నాడు సైన్యం ముందుకు కదలకపోగా, ముందుభాగంలో వున్నవాళ్ళు కొందరు వెనుకకు పారిపోయివచ్చే ప్రయత్నం చేస్తున్నారు హసనల్లీ గొంతెత్తి పెద్దగా ఆజ్ఞలు యిస్తూ, ముందుకు రాసాగాడు కాని, అతడి ఆజ్ఞలు వినేవారెవరూ లేరు రాజసింహుడు యిరుకు మార్గానికి ఎడమవైపునగల కొండమీద వున్నట్లు మాభై మంది రాజపుత్ర సైనికులూ, మొగలులమీద బండరాళ్ళను వర్షంలా కురిపిస్తున్నారు కాని కిందవున్న మొగలులకు మాత్రం వాళ్ళు కనిపించటం లేదు ముబారక్ ముందు నడుస్తున్న మొగలు ఆశ్వికుల వెంటనే వున్నాడు కొండమీదనుంచి పెద్ద పెద్ద గుండశిలలు పడటం ప్రారంభించగానే, అతడు తన సైనికులను హెచ్చరించి వెనుకకు నడిపించాలని చూశాడు



ఆ ప్రయత్నం విఫలమైంది చంచలకుమారి వున్న పల్లకికేసి అతడు బయలుదేరి వచ్చేసరికి, దాని బోయీలు కొండరాళ్ళలో వున్న ఒక రంధ్రంకుండా పారిపోవటం అతడికి కనిపించింది. వెంటనే ఆ రంధ్రాన్ని ఒక చాపరాయి మూయటంకూడా అతడి కళ్ళబడింది.

ఎవరో దుర్మార్గులు రాజకుమారిని అపహరించేందుకు పన్నిన పన్నాగం యిది, అని ముబారిక్ నిశ్చయించుకున్నాడు. అతడు మొగలు ఆశ్వికులకేసి తిరిగి "ఓ వీర యోధులారా వినండి! కానున్న బేగంసాహెబాను ఎవరో దొంగలు అపహరించుకుపోయారు. వాళ్ళు పోయిన మార్గానికి అడ్డుగా ఒక చాపరాయివేశారు. మీలో ఒక నూరుమంది యోధులు గుర్రాలు దిగి నావెంట రండి. ఆ దుర్మార్గుల బారినుండి బేగంసాహెబాను కాపాడుదాం" అంటూ గుర్రం దిగి, రంధ్రానికి అడ్డుగాపడిన చాపరాయి మీదికి ఎక్కి లోపలికి దుమికాడు చాలామంది మొగలు సైనికులుకూడా గుర్రాలను వదిలి అతనివెంట లోపల ప్రవేశించారు

కొండపై నున్న రాజసింహుడు యిది అంతా గమనిస్తూనే వున్నాడు. మొగలు సైనికులు కొందరు రంధ్రమార్గాన లోపలికి రాగానే, అతడు తన వెంటవున్న యాభై మంది రాజపుత్ర ఆశ్వికులతో వచ్చి వాళ్ళమీదపడ్డాడు. పోరు ఘోరంగా సాగింది రాజపుత్ర ఆశ్వికులధాటికి మొగలు కాలిబంట్లు నిలువలేక పోయారు వాళ్ళల్లో చాలామంది మరణించారు ఒక్క ఏడెనిమిదిమంది మాత్రం రాజపుత్రుల యీటెల

పోట్లనుంచి రాళ్ళచాటుకు పరిగెత్తి ప్రాణాలు రక్షించుకుంటూ వుండిపోయారు. తన సైన్యం దాదాపు సర్వనాశనం కావటంతో ముబారక్ చేసేదిలేక, వాపరాయి మీది నుంచి యిరుకు మార్గంలోకి దూకాడు రాజపుత్రులు అతణ్ణి వెన్నాడి రాలేదు.

ముబారక్ తిరిగి యిరుకు మార్గంలోకి వచ్చే సమయంలోనే, అతడికి వెనుకగా మాణిక్యలాలుకూడా అక్కడికి వచ్చి, రౌతులేని ఒకగుర్రాన్ని పట్టుకుని అధిరోహించి మొగలుసైన్యంలో కలిసిపోయాడు. అతడు పారిపోయిరావటం చూచిన మొగలు సైనికు లెవరికీ అతడు తమలో ఒకడు కాదన్న అనుమానం కలగలేదు మాణిక్య లాలు మొగలు సైన్యంలో కలిసి, అక్కడ రేగుతున్న గందరగోళం అవకాశంగా తీసుకుని, గుర్రాన్ని రూపనగరమార్గం పట్టించాడు.

ముబారక్ తన సైనిక దళాలను చేరి, యిప్పు డేమిచేయటమా అని ఆలోచించ సాగాడు. సేనానాయకుడైన హసనల్లీ యింకా సైనికదళాల వెనకభాగానే వున్నాడు. అతనికి రాజకుమారి అపహరించబడిన సంగతి తెలిసినట్టు లేదు సైనికులను ముందుకు పోవలసిందిగా ఆజ్ఞ లిస్తున్నాడు.

ముబారక్ తన దాపులనున్న కొంద రాశ్వికులతో "రాజకుమారిని దొంగలు అపహరించి. యీ చిన్నకొండపైకి తీసుకుపోయారు వా ళ్ళెక్కువమందిలేరు మీలో నాలుగైదువందలమంది అశ్వికులు కష్టపడి కొంత ఎక్కగలిగితే, మనం రాజకుమారిని రక్షించటమేకాక, దొంగ లందరినీ చుట్టుముట్టి పట్టుకోగలం. మనతో పాటు ఒకఫిరంగిని తీసుకుపోదాం. దొంగలు ఆ కనబడే రంధ్రంగుండా పారిపోకుండా, ఆ రంధ్రమార్గాన ఫిరంగి బారుచేసి వుంచుదాం," అన్నాడు

ముబారక్ యిలా అనగానే నాలుగైదు వందలమంది మొగలాయీ అశ్వికులు 'దీన్ దీన్' అంటూ కొండ ఎక్కసాగారు ఏనుగుచేత ఒక చిన్నఫిరంగిని ఎత్తించి దాన్ని రంధ్రమార్గాన వున్న వాపరాతిమీద పెట్టించి, ముబారక్‌కూడా తన సైనికులను అనుసరించాడు.

ముబారక్ అశ్వికులతో కొండశిఖరం చేరాడు దారిలో అత డ్డెవరూ ఎదిరించ లేదు అతడు కొండశిఖరంనుంచి అవతలివైపుకు చూసేసరికి, రాజపుత్రులు ఏటవాలుగా వున్న కొండనుంచి దిగిపోవడం అతడి కంటబడింది వారి కెదురుగా ఒక రంధ్రమార్గం వున్నది. రాజపుత్రులు అవతల వున్న లోయలోకి పోవటానికి అదే శరణ్యం.

సైనికవిద్యలో ఆరితేరిన ముబారక్ వెంటనే వ్యూహంవేశాడు. తన అశ్వికుల్లో కొందరిని దగ్గిరకు పిలిచి, "మీరు వెంటనే వెళ్ళి ఒకఫిరంగిని ఆ రంధ్రమార్గాన నిల

పండి. ఆ ఫిరంగేకాక, యీ దొంగలను ఎదిరించి మట్టుపెట్టేందుకు మరికొందరు సైనికులుకూడా అవసరం నేనీలోపల అడ్డదారిన పోయి, ఆ రంధ్రమార్గాన్ని కాపాడ తాను." అన్నాడు

ఆ తరవాత అంతా క్షణాలమీద జరిగిపోయింది. రాజసింహుడు తనకు రానున్న ప్రమాదాన్ని ముందుగా గుర్తించలేదు అతడు తన వెంటవున్న నలుబదియారుమంది రాజపుత్రయోధులతో రంధ్రమార్గాన్ని సమీపిస్తున్నంతలో అక్కడ ఒక ఫిరంగి బారు చేసివుండటం అతడికి కనిపించింది దాదాపు నాలుగువందలమంది అశ్వికులతో ముబారక్ దానివెనక యుద్ధసన్నద్ధుడై నిలబడివున్నాడు.

తనవెంటవున్న బలంకంటె శత్రుబలం యిరవైముప్ఫై అంతలు ఎక్కువని రాజసింహుడు గుర్తించాడు అయినా, అతడు చలించలేదు, అధైర్యపడలేదు అతడు తన సైనికులకేసి తిరిగి, "సోదరులారా! బంధుమిత్రులారా! మీ రేమీ శత్రుబలంచూసి జంకకండి రాజపుత్రు డెవ్వడూ చావుకు వెరవడు కాని చంపి చావటంలోనే మన రాజపుత్రుల గొప్పతనం ఉన్నది మరణించేముందు మనలో ప్రతిఒక్కరూ కనీసం ఇద్దరు మొగలులనైనా చంపి చావాలి ఇక మనకు గుర్రాలతో పనిలేదు అందరూ దిగండి నావెంట కత్తులుదూసి రండి ఆ మొగలాయీ ఫిరంగి మీద పడి శత్రువులను నరికి, సాధ్యమైతే రంధ్రమార్గంగుండా లోయలోకి పోదాం." అన్నాడు

రాజసింహు డిలా అనగానే రాజపుత్ర అశ్వికు లందరూ తమతమ గుర్రాలమీది నుంచి దిగి కత్తులుదూసి, "మహారాణా రాజసింహునికీ జై!" అన్నారు ఆ తరవాత అందరూ మొగలుఫిరంగికేసి బయలుదేరారు అందరికన్న ముందు రాజసింహుడు నడుస్తునాడు.

ముబారక్ తనయోధులకు తన ఆజ్ఞ అయేవరకూ ఫిరంగి పేల్చవద్దని చెప్పాడు. ఆసరికి అతడికి తను ఎదుర్కొంటున్నది ఎవరో దొంగలమురాను కాదనీ, ఉదయ పురరాణా రాజసింహుడనీ తెలిసిపోయింది ఫిరంగిదెబ్బకు బాగా అందుబాటులోకి వచ్చినతరవాత రాజపుత్రులమీద కాల్పులు చేసి, వాళ్ళను సర్వనాశనం చేయాలని అతడు నిశ్చయించుకున్నాడు

"మహారాణాకు జై!" అంటూ కత్తులెత్తి వస్తున్న రాజపుత్రులు ఫిరంగివేటుకు అందుబాటులోకి రాగానే, ముబారక్ మొగలుసైనికులకు ఫిరంగి పేల్చవలసినదిగా ఆజ్ఞ యివ్వబోయాడు కాని, అంతలో అతడి నేత్రాలకు మెరుపులాంటి కాంతి ఒకటి

కనిపించింది. అదేసమయంలో రాజసింహుడుకూడా ఆశ్చర్యంతో నిర్విణ్ణుడయి పోయాడు.

రెండు శత్రుసైన్యాలకు మధ్యగా ఒకరాతిచాటున పల్లకీ దిగి చంచలకుమారి, రాజసింహుడికేసి నడిచింది ఎవ రీ త్రిలోకసుందరి? అని రాజసింహుడు ఆలోచించేంతలో ఒక సైనికుడు ఆయనతో "మహారాజా! ఈమె రూపనగర రాజకుమారి అదుగో, ఆ రాళ్ళవెనక పల్లకీ కనబడుతున్నది;" అన్నాడు

ఇంతలో చంచల రాజసింహుణ్ణి సమీపించి నమస్కరించింది రాజసింహుడామెతో- "ఇక్కడి కెందుకొచ్చావు?" అన్నాడు.

"మహారాజా, తమకు నమస్కరించి, నా గౌరవాభివందనలు తెలియపరుచుకునేందుకు వచ్చాను. రాజకన్యలో వుండవలసిన లజ్జా, సంకోచాలు నాలో లేవని తమరు ఆగ్రహించకండి తమకు ఒక ముఖ్యవిషయం మనవి చేసుకోవలసివున్నది." అన్నది చంచలకుమారి తల వంచుకుని.

"ఓ రూపనగర రాజకుమారీ! నీకోసం యింత దూరం వచ్చిన నేను, నీపై ఆగ్రహించగలనని ఎందు కనుకున్నావ్? నీవు చెప్పదలిచిన ముఖ్యవిషయ మేమో నిర్భయంగా చెప్పవచ్చు." అన్నాడు రాజసింహుడు

చంచలకుమారి చేతులు జోడించి, "మహారాజా! నేను చంచలహృదయురాలినైన బాలిక నవటంచేత, తమను యిక్కడికి రావలసిందిగా లేఖ రాశాను కాని నా నిజమైన హృదయభావం వేరు అది యిప్పటికీ తమకు తెలిసినట్టు లేదు. నేను మొగలాయీ సార్వభౌముడి వైభవ వృత్తాంతం విన్నాను. తమరు ఆజ్ఞ యిస్తే, మహదానందంగా ఢిల్లీకి పోగలను," అన్నది.

ఈ మాటలు విని రాజసింహుడు కళవళపడి, అంతలోనే, తెప్పరిల్లి, "నీవు ఢిల్లీకి పోదలిస్తే పోవచ్చు, నా అభ్యంతరం ఏమీలేదు. కాని ఆ ప్రయాణం యీ క్షణానమాత్రం జరిగేందుకు వీల్లేదు. నేను మొగలు బలాలకు భయపడి నిన్ను ఢిల్లీకి పంపానని శత్రువులు నన్ను హేళనచేసే అవకాశం వున్నది ముందు యీ యుద్ధం అటో యిటో తేలిపోవాలి," అంటూ చిరునవ్వు నవ్వుతూ రాజకుమారి ముఖంలోకి పరీక్షగా చూసి, "ఓ రాజకుమారీ! నేను నీ హృదయభావాన్ని అర్థం చేసుకోలేదని భ్రమపడకు నేను జీవించివున్నంతవరకూ నీవు ఢిల్లీకి వెళ్ళలేవు," అని తన సైనికులను, "ఇక శత్రువులకేసి నడవండి!" అని ఆజ్ఞాపించాడు.

చంచలకుమారి రాజసింహుడికేసి ప్రణయభావం వుట్టిపడేలా మందహాసం చేసి తన మనస్సులో, "వీరచూడామణీ! ఈనాటినుంచీ చంచల నీకు దాసి నీ పాదసేవ



చేస్తూ బ్రతకటం తప్ప. యీ చంచలకు జీవితంలో మరొక ఆశలేదు." అనుకుని, అంతలోనే ముఖం గంభీరంగా పెట్టి. 'మహారాజా ! ఢిల్లీసార్వభౌముడు ఏ కాంతా మణిని దేవిగా చేసుకోవాలనుకున్నాడో, ఆమెను ఢిల్లీకి పోకుండా యిక్కడ అడ్డ గలవా రెవరు ? నే నిప్పుడే మొగలుసైన్యాన్ని చేరబోతున్నాను." అంటూ మంద హాసవందనంతో ముబారక్ సైన్యంతో నిలబడివున్న ఫిరంగికేసి నడిచింది.

ముబారక్ చంచల రావటం చూస్తూనే నిలువెల్లా కంపించిపోయాడు జరీపట్టు పావడా, రత్నాభరణాలూ ధరించి త్రిలోకసుందరిలా వున్న ఆ కన్య ఢిల్లీపాదుషాకు కానున్నబేగం అని తెలియగానే ఆతడి కేమి చేసేందుకూ కాళ్ళూచేతులు ఆడలేదు చంచల సూటిగా ఫిరంగిముందుకు వెళ్ళి నిలబడి, గంభీరస్వరంతో, ''సేనానాయకు డెవ్వరు ? " అని ప్రశ్నించింది.

ముబారక్ గౌరవపూర్వకంగా తలవంచుకుని, "అమ్మా ! ఇక్కడవున్న సైనికు లందరికీ, యీ అధముడే సేనానాయకుడు." అన్నాడు

"అలాఅయితే నీతో ఒకవిషయం మాట్లాడాలి. కొంచెం యివతలికి రా మన సంభాషణ ఎవరూ వినగూడదు." అంటూ చంచల పక్కకుతిరిగి కొద్దిదూరం నడిచింది ముబారక్ ఆమెముందుకు వెళ్ళి నిలబడ్డాడు

"నేను రూపనగర రాజపుత్రికను ఢిల్లీపాదుషావారు నన్ను వివాహ మాడగోరి యీ సైన్యాన్ని పంపారు. కాని నేను మొగలాయీ చక్రవర్తిని వివాహమాడటం యిష్టంలేక, రాజసింహ మహారాజుకు నన్ను కాపాడవలసిందిగా లేఖ రాశాను. ఆయన తన రాజపుత్ర యోధులతో నా రక్షకుగాను యిక్కడికి వచ్చారు.

యుద్ధంలో నీ వాయనను జయించావు ఇక పోరు అనవసరం నేను స్వబుద్ధితో ఆలోచించే యిక్కడికి వచ్చాను నన్ను ఢిల్లీకి తీసుకుపోవచ్చు." అన్నది చంచల

"అమ్మా! తమను ఢిల్లీకి తీసుకుపోతాను కాని రాజపుత్రులు ఓటమి అంగీకరించారంటే నేను నమ్మను వారిని కాపాడేందుకు మీరు త్యాగంచేస్తున్నారు అవునా?" అని ప్రశ్నించాడు ముబారక్.

"ప్రాణాన్ని తృణప్రాయంగా భావించే రాజపుత్రజాతీయులు, ఓటమి నంగీకరిస్తారా? ఆసంగతి నాకు తెలుసు కాని నా శీఘ్రసమయంలో సంఖ్యై ఏడుగురు మాత్రమే, నీదగ్గర వేలసైన్యం వున్నది. అందువల్ల వాళ్ళప చంపవద్దని నిన్ను కోరుతున్నాను." అన్నది చంచల

"కానున్న బేగంవారి కోర్కెను నేను నిరాకరించలేను. కాని యీ రాజపుత్రులు తమను అపహరించుకుపోవటంద్వారా దొంగ లయ్యారు దొంగలను చంపకపోయినా, కనీసం పట్టి బంధించటం నా విధి." అన్నాడు ముబారక్.

"వారిని పట్టి బంధించటం నీవల్లకాదు ప్రాణాలతో ఒక్క రాజపుత్రుడుకూడా నీచేత బడడు. ఆ వ్యర్థప్రయత్నం మాను." అన్నది చంచల.

"మీ ఆజ్ఞ శిరసావహిస్తాను పదండి తమరు ఢిల్లీకి రావటం ఖాయమేగదా?" అని ప్రశ్నించాడు ముబారక్.

"ఢిల్లీవరకూ రాగలనో లేదో చెప్పలేను కాని కొంతదూరం మీతోబాటు ఢిల్లీ మార్గాన ప్రయాణిస్తాను."

రాజకుమారి జవాబు ముబారక్‌కు అనుమానం కలిగించింది అతడు తలవంచుకునే చిన్నగొంతుతో, "అమ్మా! మీ రన్నది నా కర్థంకాలేదు." అన్నాడు

"యోధులైన మీకు యుద్ధంలో చావటం చాతనైనట్టే, అబలనైన నాకుకూడా ఆకస్మికంగా ఎలా చావాలో చాతనవును,' అన్నది చంచల తన వేలివుంగిరానికేసి దృష్టి సారించి.

ముబారిక్ చంచల మనోగతభావాన్ని అర్థం చేసుకుని విచారంగా తలవూపుతూ, "అమ్మా! ఆత్మహత్య ఎందుకు? ఢిల్లీకి రావటం మీకిష్టంకాకపోతే, ఆ సార్వభౌముడు కూడా మిమ్మల్ని ఏమీచేయలేడు. అలాంటప్పుడు అధముణ్ణయిన నేనెంత? కాని, ఒకటి ఇక్కడ సేనానాయకుడుగా నాబాధ్యత నేను నెరవేర్చకతప్పదు నన్నెదిరించి నిలిచిన యీ రాజపుత్రుల్ని మన్నించిమాత్రం వదలను. యుద్ధం జరిగితీరవలసిందే" అన్నాడు.

ఆమాటలు వింటూనే చంచలకుమారిముఖం క్రోధంతో ఎర్రనైంది. ఆమె అంత దూరంలో నిలబడివున్న రాజసింహుడిదగ్గరకు చరచరా వెళ్ళి, "మహారాజా ! తమ కటిస్థలమున వేలాడుతున్న ఖడ్గాన్ని యీ దాసికి బహూకరించవలసిందిగా ప్రార్థిస్తున్నాను." అని చేయి చాచింది

రాజసింహుడు ఒక మంచి కత్తిదూసి ఆమె కిస్తూ, "నీ వీ సమయంలో భైరవీ మూర్తిని గుర్తుకు తెస్తున్నావు ?" అన్నాడు తరవాత అతడు తన అనుచరులకేసి తిరిగి, "ఇక శత్రుసంహారానికి ఉపక్రమించండి విజయమో వీరస్వర్గమో యీ రణక్షేత్రంలో యీ క్షణానే తేలిపోవాలి." అంటూ ఆజ్ఞాపించాడు

ముబారక్ కూడా తన మొగలుసైనికులకు రాజపుత్రులపై దాడి ప్రారంభించవలసిందిగా ఆజ్ఞ యిచ్చాడు "జై కాళీమాతా!" అంటూ రాజక్షత్రయోధులూ, "అల్లాహో అక్బర్ !" అంటూ మొగలాయీ సైనికులూ ముందు కురికారు కాని ఆ రెండు శత్రుపక్షాలమధ్యా చంచలకుమారి కత్తి పైకెత్తి నిశ్చలంగా నిలబడివున్నది.

"ఈ ఇరుపక్షయోధులలో ఎవరో ఒకరు యిక్కడినుంచి తిరోగమించేవరకూ నేనిక్కడేవుంటాను ముందు నా తల నరికి తరవాత మీరూమీరూ పోరు సాగించండి." అన్నది చంచల గంభీరంగా.

రాజసింహుడు బల్లెం పైకెత్తి చంచలకుమారికేసి కోపంగా చూస్తూ, "నువ్వు చేస్తున్నపని రాజపుత్రులకు కళంకం కలిగించేదిగా వున్నది. అసంఖ్యాకమైన శత్రుబలాలను చూసి బెదిరి, నేను ఒకస్త్రీని అడ్డుగా పెట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నానని లోకం భావించవచ్చు." అన్నాడు

"మహారాజా ! మీరు యుద్ధంలో మరణించదలిస్తే, నే నెలా అడ్డుకోగలను ? కాని యిక్కడ యింత భయంకరపరిస్థితికీ కారణమైన నేను, ముందు మరణించాలనిమాత్రమే కోరుకుంటున్నాను నా చావుతరవాత మీరు నిరభ్యంతరంగా మొగలాయీలతో యుద్ధం చేయవచ్చు." అన్నది చంచలకుమారి

మొగలాయీ సైనికులు తుపాకులు బారుచేసి తమ నాయకుడైన ముబారక్ ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నారు. ముబారక్ రెండడుగులు ముందుకువేసి, "మొగలాయీ సార్వభౌముడు అబలలతో యుద్ధం చేయడు ఆ కారణంగా మేము ఓటమి నంగీకరించి వెనుదిరిగి పోతున్నాం ఏదో ఒకనాడు రాజసింహునితో మరొక స్థలాన యుద్ధం చేసి, మొగలు కత్తుల పదు నెలాటిదో తెలియచెప్పగలనని మాటయిస్తున్నాను" అన్నాడు

తనను ఆ ప్రదేశంలో వదిలిపోవటంద్వారా ముబారక్ పెద్ద చిక్కులో పడనున్నాడని చంచ కుమారి గ్రహించింది. ఆమె ముబారక్‌తో, అయ్యా! నన్నిక్కడ వదిలి ఏలా పోగలవు? నన్ను తీసుకువచ్చేందుకుగదా మీ సార్వభౌముడు నిన్ను పంపింది ఆయన కేమని జవాబు చెప్పగలవు?'' అని అడిగింది.

"పాదుషాకన్న మిన్న అయినవాడొకడున్నాడు. ఆయనకు నేను జవాబు చెప్ప వలసి వుంటుంది." అంటూ ముబారక్ హృదయంమీద చేయి వేసుకున్నాడు

"ఆయన పరలోకంలో వున్నాడు నీ విప్పుడు జవాబు చెప్పుకోవలసింది ఢిల్లీ సార్వభౌముడికి" అన్నది చంచల.

ఈ ముబారకిల్లీఖాన్ యీ లోకంలో ఎవరికీ భయపడడు ఇక నా కాజ్ఞ దయ చేయించండి; వెళతాను," అంటూ ముబారక్ తన సైనికులకు వెనుదిరగవలసిందిగా ఆజ్ఞ యిచ్చాడు మొగలు సైనికులు తుపాకులు దించి వెనుదిరిగేంతలో ఒక్కసారి వేయి తుపాకులు పేల్చిన ధ్వని వినబడింది దాదాపు నూరుమంది మొగలు సైనికులు నేల కొరిగారు. తనూ తన వెంటనున్న సైనికులూ ఘోరవిపత్తులో చిక్కుకున్నామని ముబారక్ తెలుసుకున్నాడు.

## 11

మాణిక్యలాలు మొగలాయీ సైనికవేషంలో కొండకనుమనుంచి రూపనగరానికి బయలుదేరాడుగదా? అతడు రూపనగరం చేరేసరికి, నగర ఆయుధాగారం వద్ద చాలా కోలాహలంగా వున్నది రూపనగరం చాలా చిన్నరాజ్యం ఆ కారణంవల్ల ఆ రాజ్యప్రభువుకు నెలజీతాలు తీసుకుని సేవచేసే సైనికవళం ఏమీలేదు ఆయన సైనికులందరూ భూమి దున్నుకు బతికే వ్యవసాయదారులు రాజు పిలిచినప్పుడు వారంతా తమతమ వ్యవసాయ పనిముట్లు కింద పారేసి, కత్తీకరార్లూ తీసుకుని తమ తమ అశ్వాలతో రూపనగరం చేరేవారు మొగలాయీ సైనికులు చంచలకుమారి కోసం రూపనగరం వస్తున్నారని తెలియగానే, రాజు వీరికోసం కబురంపాడు. అందరూ సైనికదుస్తుల్లో నగరం చేరి, మొగల్ సైనికులు నగరంలో వున్నన్నిరోజులూ వారికి తగిన గౌరవ మర్యాదలు జరిగేలా చూశారు తరవాత చంచలకుమారితో మొగలులు వెళ్ళిపోగానే రాజు వీరి నందరినీ తిరిగి గ్రామాలు చేరమన్నాడు మాణిక్య లాలు నగరం చేరిన సమయంలో వారందరూ తమతమ ఆయుధాలను రాజుగారి ఆయుధా గారంలో ఒప్పచెప్పేందుకు అక్కడికి చేరారు రాజుకూడా అక్కడే వున్నాడు.

మాణిక్యలాలు ఆయుధాగారం దగ్గరకు వచ్చి నురుగులు కక్కుతున్న గుర్రాన్ని దిగి రాజుకు ప్రణామం చేసి, "మహారాజా! గొప్ప విపత్తు వచ్చిపడింది. కొండ



కనుమలో మొగలుసైన్యాన్ని దొంగలు అటకాయించారు రాకుమారిని అపహరించటం వారి ముఖ్యప్రయత్నంలా కనిపిస్తున్నది వాళ్ళు నాలుగైదువేల మందివరకూ వున్నారు జనాబ్ హసనల్లీ ఖాన్ బహదురువారు తమనుంచి కొంత సైనిక సహాయం తీసుకురావలసిందిగా నన్ను పంపారు" అని చెప్పాడు.

రూపనగర రాజుగ్గాని, అతడి సైనికులకుగాని ఇందులో ఏమైనా మోసం వుండవచ్చునన్న అనుమానం కలగలేదు మాణిక్యలాలు అచ్చు మొగలాయీ సైనిక వేషంలో వున్నాడు. రాజు వెంటనే తన సైనికులతో, "మీరు దాదాపు వేయిమంది వున్నారు. గుర్రాలూ, ఆయుధాలూ — అన్నీ సిద్ధంగానే వున్నవిగదా. బయలుదేరండి; నేనూ మీవెంట వస్తున్నాను," అన్నాడు.

"మహారాజా ! నా మనవి ఒకటి వినండి ఈ వేయిమంది సైనికులతో నేను ముందు బయలుదేరి వెళతాను. తమరు కొంచెం వెనగ్గా మరికొంత సైన్యాన్ని పోగు చేసుకుని బయలుదేరి రండి. దొంగలు వేల సంఖ్యలో వున్నారు అన్నిటికీ తెగించినవాళ్ళలా కనిపిస్తున్నారు," అన్నాడు మాణిక్యలాలు

రూపనగరరాజు యిందుకు సరేనని, వెయ్యిమందిసైనికులనూ మాణిక్యలాలువెంట పంపాడు. వారంతా కొండకనుమ ప్రాంతానికి బయలుదేరారు. దారిలో మాణిక్యలాలుకు ఒకచెట్టుకింద సొమ్మసిల్లి పడివున్న ఒకస్త్రీ కనిపించింది ఆమె ధరించిన దుస్తులూ, ఆకారవిశేషాలూ అతణ్ణి బాగా ఆకర్షించినై ఆ కారణంగా అతడు తన సైనికదళంనుండి వేరుపడి, చెట్టుకిందకి వెళ్ళి గుర్రం దిగి ఆ స్త్రీని, "ఓ సుందరీ ! ఏవరు నీవు ?"అని ప్రశ్నించాడు అందుకు జవాబుగా ఆమె, 'నీ వెవరి సైనికుడివి?" అని ప్రశ్నించింది.

"నేను మహారాణా రాజసింహుడి సైనికుడను "

"అలాగా ! నేను రూపనగర రాజకుమారి దాసిని. నాపేరు నిర్మల "

ఆ జవాబుకు మాణిక్యలాలు ఆశ్చర్యపోయి, "ఆ రాకుమారి ఢిల్లీ వెళుతున్నది గదా ? మరి నీ విక్కడే వున్నావేం ?" అని అడిగాడు.

"రాకుమారి నన్ను తనవెంట తీసుకుపోతానని చెప్పింది కాని ఏకారణంవల్లనో విడిచిపోయింది నేను కాలినడకను బయలుదేరాను "

"నడిచినడిచి పాపం ఆయాసంతో యిక్కడ పడిపోయావన్నమాట !"

"అవును; యిక నేను నడవలేను," అంటూ నిర్మల ఉస్సురుమన్నది.

"అంత నిరుత్సాహపడకు నడవటం ఆయాసం అయితే గుర్రం ఎక్కి బయలుదేరు," అన్నాడు మాణిక్యలాలు.

"గుర్రం ఎక్కి సవారీచేయటం నాచేతకాదే "

"ఫరవాలేదు. నా గుర్రంమీద ఎక్కించి నిన్ను జాగ్రత్తగా తీసుకుపోతాను," అన్నాడు మాణిక్యలాలు.

నిర్మల అతడిముఖంకేసి చిరుకోపంగా చూసి, "మీదారిన మీరు వెళ్ళండి. నేనీ చెట్టుకిందే పడిచస్తాను," అన్నది.

మాణిక్యలాలుకు ఆమె నక్కడ వదిలిపో బుద్ధికాలేదు. అతడి హృదయంలో నిర్మలను చూడగానే ప్రేమబీజం నాటుకుని, మొలిచి, మొక్క అయిపూరుకున్నది

"సుందరీ నీవు వివాహితవా ?" అని ప్రశ్నించాడు మాణిక్యలాలు.

"నాకింకా వివాహం కాలేదు "

"నీ కులం ?"

"నేను రాజపుత్ర కన్యను "

"నేనూ రాజపుత్రుణ్ణే. నాభార్య మరణించింది ఒక చిన్నకుమార్తెమాత్రం వున్నది నీ వా బిడ్డకు తల్లివయేందుకు అంగీకరిస్తే నాతోపాటు గుర్రంమీద ఎక్కి వచ్చేందుకు ఎలాంటి ఆక్షేపణా వుండదనుకుంటాను," అన్నాడు మాణిక్యలాలు.

నిర్మల సిగ్గూ లజ్జా ఆశ్చర్యం ప్రస్ఫుటమయ్యే ముఖంతో మాణిక్యలాలుకేసి చూసి, "నన్ను భార్యగా స్వీకరించి ఆదరించగలనని ప్రమాణం చేస్తావా ?" అని ప్రశ్నించింది

"ఎలాంటి ప్రమాణం చేయాలి ?" అన్నాడు మాణిక్యలాలు తన అదృష్టానికి ఉప్పొంగిపోతూ.

"కత్తిమీద చేతులువేసి, నన్ను వివాహమాడగలనని ప్రమాణం చెయ్యి."

మాణిక్యలాలు కత్తి పట్టుకుని. "ఈరోజు జరిగే యుద్ధంలో నేను మరణించకుండ వుంటే నిన్ను పెళ్ళి ఆడగలనని ప్రమాణంచేస్తున్నాను" అన్నాడు

నిర్మల మారుమాటాడకుండా మాణిక్యలాలు వెంట నడిచి ఆతడితోపాటు గుర్రం ఎక్కింది. మాణిక్యలాలు ముందు పోతున్న రూపనగర ఆశ్వికులను కలుసుకుని కొండకనుమ కేసి పురోగమించాడు.

రూపనగర సైనికులు వేయిమందీ కనుమప్రాంతం చేరేసరికి వారికి రాజపుత్ర లను చుట్టుముట్టివున్న మొగలాయీ సైన్యం కనిపించింది మాణిక్యలాలు నిర్మలన దూరంగా ఒక కొండసొరంగంలో వుండమనిచెప్పి, ముబారక్ సైన్యం వెనుకభాగానికి వెళ్ళి పరిస్థితి ఆకళింపు చేసుకున్నాడు రాణా రాజసింహుడు రంధ్రమార్గంనుంచి లోయలోకి ప్రవేశించకుండా ముబారక్ పెద్ద సైన్యంతో అటకాయించాడని అతడికి తెలిసిపోయింది. వెంటనే అతడు వెనుకనుంచి మొగలుసైన్యంమీద కాల్పులు చేయవలసిందిగా రూపనగర సైనికులకు ఆజ్ఞాపించాడు.

''వాళ్ళు దొంగల్లాలేరు, మొగలు సైనికుల్లా వున్నారు. వాళ్ళమీద తుపాకులు పేల్చటం ఎలా?" అన్నారు కొందరు రూపనగర సైనికులు.

"వాళ్ళు మొగలు సైనికవేషాల్లో వున్న దొంగలు! వెయ్యి తుపాకులూ ఒకే సారి గురిచూసి మరీ పేల్చండి!" అని హెచ్చరించాడు మాణిక్యలాలు వెయ్యి తుపాకులూ ఒకేసారిగా పేలినై ముబారక్ సైనికుల్లో చాలామంది నేల కొరిగారు మిగిలినవాళ్ళు భయభ్రాంతు లయ్యారు. అదేసమయంలో రాజసింహుడి సైనికులు "జై కాళీ!" అంటూ మొగలులమీద విరుచుకుపడ్డారు ముబారక్ తన సైనికులకు ధైర్యం చెప్పి రాజపుత్రులను ఎదిరించేందుకు ప్రయత్నించాడు కాని అది సాధ్యం కాలేదు. సేనాని హసనల్లీ అధ్వర్యంకింద వున్న మొగలు సైనికులపై అదే సమ యంలో ఎడమవైపు కొండమీద వున్న రాజపుత్రులు దాడిచేశారు అన్ని వైపుల నుంచీ ఒకేసారి శత్రువులు వచ్చి మీద పడటంతో మొగలు సైనికోలు గుండె బేజారై చెల్లాచెదురుగా పారిపోసాగారు ఇక లాభం లేదని ముబారక్‌కూడా కొండ దిగి ఎదురైన శత్రువులను చీల్చుకుంటూ లోయలోకి పరిగెత్తాడు

మొగలాయి సైనికులపై హఠాత్తుగా వెనుకనుంచి దాడిచేసి, వాళ్ళను చెల్లా చెదరు చేసిన దెవరో రాజసింహుడికి తెలియలేదు అతడు అత్యంతాశ్చర్యంతో చుట్టూ కలయచూస్తున్నంతలో. మాణిక్యలాలు అయనను సమీపించి నమస్కరిం చాడు.

"మాణిక్యలాల్! నీ వెక్కడినుంచి వస్తున్నావు? మొగలాయీలపై హఠాత్తుగా దాడి చేసినవా రెవరో నీవు గుర్తించావా?" అని ప్రశ్నించాడు రాజసింహుడు

"మహారాజా! ఆ పని చేసినది యీ సేవకుడే. మీరు బహు కొద్ది సైన్యంతో కొండ దిగి లోయలోకి ప్రవేశించాలని ప్రయత్నించటం, మీ మార్గాన్ని అటకాయించేందుకు ముబారక్ ఫిరంగి తీసుకుని బయలుదేరటం గమనించి, సహాయం తెచ్చేందుకు నేను రూపనగరం వెళ్ళాను:" అంటూ మాణిక్యలాలు అక్కడినుంచి సైనికుల్ని తీసుకురావటం దగ్గరనుంచి, ఆ తరవాత తా నేమి చేసినదీ రాజసింహుడికి చెప్పాడు

అంతా విని రాజసింహుడు మాణిక్యలాలును కౌగలించుకుని, "మాణిక్యలాల్ సింహా! నీ వీ కష్టసమయంలో చేసిన గొప్ప సహాయానికి ఉదయంపురం చేరగానే తగినవిధంగా నిన్ను సత్కరించగలను నీవు నిజమైన ప్రభుభక్తిపరాయణుడ వనిపించుకున్నావు." అంటూ మెచ్చుకుని, "నీకు మరొక చిన్నపని చెపుతున్నాను అవతలి కొండమీద మన యోధులు కొంద రున్నారు వాళ్ళను యిక్కడికి తీసుకువచ్చావంటే అందరం కలిసి ఉదయపురం పోవచ్చును." అన్నాడు.

"మహారాజా! తమరు రాజకుమార్తెతో వెంటనే ఉదయపురానికి బయలుదేరి వెళ్ళండి ఆ కొండమీద వున్న మన యోధులను వెంటపెట్టుకుని, మీ వెనకగా నేను రాగలను." అన్నాడు మాణిక్యలాలు.

రాజసింహుడు చంచలకుమారినీ, తనతో వున్న రాజపుత్రులనూ తీసుకుని ఉదయపురంకేసి బయలుదేరివెళ్ళాడు మాణిక్యలాలు అవతలివైపు కొండమీదికెళ్ళి అక్కడ వున్న రాజపుత్రయోధులతో, రాణా ఉదయపురానికి బయలుదేరి పోయినసంగతిచెప్పి, వాళ్ళను ఆయ న్ననుసరించి పోవలసిందిగా చెప్పాడు. వాళ్ళటు బయలుదేరగానే, తాను నిర్మల నుంచిన సారంగందగ్గరకు పోయి ఆమెను తన గుర్రంమీద ఎక్కించుకుని, ఉదయపురం శివార్లలో వున్న ఒక చిన్నగ్రామం చేరాడు.

ఆ గ్రామంలో మాణిక్యలాలుకు వేలువిడిచిన ముసలి మేనత్తగా రొకామె వున్నది. ఆమెదగ్గరే లోగడ మాణిక్యలాలు తన చిన్నకూతురును పెంపకంకోసం విడిచివచ్చాడు. ఇప్పుడు మాణిక్యలాలు ఆ అత్తగారి ఇంటికి వెళ్ళి, నిర్మలను గుర్రంమీదినుంచి దించి, "అత్తా! తొందరగా రా; నీ కోడలు తెచ్చాను." అని కేకవేశాడు.

"కూతురా? ఎప్పుడు పెళ్ళాడావు? మాటమాత్రంగానైనా నాతో చెప్పావుకాదే?" అంటూ అత్త హడావిడిగా ఇంటినుంచి బయటికి వచ్చి, నిర్మల అందచందాలు

చూస్తూనే, "ఎంత అదృష్టవంతుడివి ! ఎంతచక్కని పిల్లని ఇంటికి తెచ్చావు." అంటూ మాణిక్యలాలును మెచ్చుకున్నది

"అత్తా ! మాయిద్దరికీ యింకా అగ్నిసాక్షిగా వివాహంకాలేదు ఆ ప్రయత్నాలన్నీ నువ్వేచెయ్యాలి పురోహితుణ్ణి పిలుచుకురా ఇదుగో పెళ్ళి సంబరాలకూ వాటికీ అయే ఖర్చుగ్గాను యీడబ్బు నీదగ్గర వుంచు," అంటూ కొన్ని మొహరీలు అత్తచేతి కిచ్చాడు మాణిక్యలాలు

ఆ మర్నాడే మాణిక్యలాలుకు నిర్మలతో విధియుక్తంగా వివాహం జరిగి పోయింది ఆ తరువాత అతడు రాజసింహుడి దర్శనం చేసుకున్నాడు. రాజసింహు డతనికి తన సైన్యంలో గొప్పపదవీ, ధనం, మడిమాన్యా లిచ్చి సత్కరించాడు.

* * * *

రణరంగంనుంచి దారీ తెన్నూ చూడకుండా పారిపోతున్న ముబారక్ తన గుర్రంతోసహా ఒక పాడుబడ్డనూతిలో పడిపోయాడు ఆ నూతిని కప్పివేస్తూ చిన్న చిన్నచెట్లూ, వాటిమీద గుబురుగా అల్లుకున్న అడవిలతలూ వుండటంతో, యీ ప్రమాదం తటస్థించింది బావి పెద్దలోతులేదు అందులో నీరుకూడా లేదు కాని గుర్రం వేగంగా పరిగెత్తుతూ అందులో పడటంతో, ఆ తాకిడికి అది వెంటనే మరణిం చింది ముబారక్‌మాత్రం కొద్ది గాయాలతో ప్రాణం రక్షించుకున్నాడు; కాని అతడికి నూతినుంచి బయిటికి ఎక్కటం సాధ్యంకాలేదు అతడు తన నెవరైనా రక్షిస్తారనే ఆశతో కేకలు వేయసాగాడు.

కొద్దికాలం గడిచిన తరవాత అతడికి పైనుంచి ఎవరో పిలిచినధ్వని వినబడింది. "ఇంకా ప్రాణాలతో వున్నావా ?" అన్నదా కంఠం.

"బతికేవున్నాను. బాగా గాయపడ్డాను. దయవుంచి నన్ను పైకి లాగండి," అన్నాడు ముబారక్.

"ఇదుగో నే నొకతాటికి తాడుకట్టి నిదానంగ బావిలోకి వదులుతాను. నువ్వు దాన్ని పట్టుకుని పైకిరా," అన్నదా కంఠం.

ఈసారి ఆ కంఠస్వరం విని ముబారక్ ఆశ్చర్యపడి, "స్త్రీ కంఠస్వరంలా వున్నది ! నీ వెవరు ?" అని ప్రశ్నించాడు.

"ఈ కంఠస్వరం నీ వెన్నడూ వినలేదా ?"

"ఓహో, నువ్వా దరియా ? ఇక్కడేం చేస్తున్నావు ?"

"నిన్ను రక్షించటానికే వచ్చాను. ఇదుగో తాడు," అంటూ దరియా తాడును బావిలోకి వదిలి, రెండవకొనను సమీపంలో వున్న చెట్టుమొదలుకు కట్టింది. ముబా

రక్ తాడు ఆసరాతో నూతినుంచి పైకివచ్చి, "దరియా ? ఏమి టీ మొగలు ఆశ్విక యోధుడివేషం ?" అని ప్రశ్నించాడు.

"నేను ఢిల్లీనుంచి రూపనగరం వచ్చి, నా ఆటపాటలతో సేనాని హసనల్లీ ఖానును మెప్పించి, ఆయన అనుమతితో యీ ఉడుపులు ధరించి, ఆశ్వికయోధు ణ్ణయాను. ఇదంతా నీకోసం. అయినా యీ పేదరాలిని నువ్వెలా ప్రేమించగలవు ? ఢిల్లీ సార్వభౌముడి కుమార్తె జేబున్నీసా ప్రేమముందు నా ప్రేమ ఏపాటి ?" అన్నది దరియా.

"ఆ జేబున్నీసా నేనంటే ప్రేమించకపోగా, ఏవగింపుకూడా కనబరుస్తున్నది. నే నీ నాటినుంచీ నీవాడిని. మన దాంపత్యాన్ని అడ్డగలవా రెవరూ లేరు;" అంటూ ముబారక్ దరియాను తన బాహువుల్లో బంధించి ముద్దుపెట్టుకున్నాడు ఆ తరవాత వా ళ్ళిద్దరూ పారిపోతున్న కొందరు మొగలు ఆశ్వికులతో కలిసి ఢిల్లీ చేరారు. ముబారక్ దరియాను తన ఇంటికి తీసుకుపోయాడు.

## 12

ఉదయపురం చేరగానే రాజసింహుడు చంచలకుమారిని తన అంతఃపురంలో ప్రవేశపెట్టాడు ఆమె కోరిన విధంగా త నామెను ఢిల్లీకి పోకుండా రక్షించగలిగాడు. ఇప్పుడు కర్తవ్య మేమిటి ? తన అంతఃపురంలోనే వుంచటమా ? లేక రూపనగరానికి ఆమె తండ్రివద్దకు పంపటమా ?

రాజసింహుడు నాలుగైదు రోజులు యీ సమస్యగురించి ఆలోచించి ఎటూ తేల్చుకోలేక, చంచలకుమారి అభిప్రాయం ఏమిటో కనుక్కొనేందుకు అంతఃపురానికి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు అనంతమిశ్రుడి ద్వారా ఆమె తనకు రాసిన లేఖను వెంటతీసుకుపోయాడు.

రాజసింహుడు రాగానే చంచల ఆయన కూర్చునేందుకు ఒకపీఠం చూపించి, సిగ్గూ లజ్జా పైకొనగా తల ఒంచుకుని కొంచెం ఎడంగా నిలబడింది రాజసింహుడు ఆమె సౌందర్యం చూసి విమోహితు డయ్యాడు. కాని తన హృదయభావం బయట పడకుండా మరుగు పరుస్తూ, "రాజకుమారీ : నీవు నీ పుట్టింటికి వెళ్ళకోరుతున్నావో, లేక ఇక్కడే వుండకోరుతున్నావో తెలుసుకునేందుకు వచ్చాను. నీ అభిప్రాయం ఏమిటో తెలియపరిస్తే, దానికి అనుగుణంగా చేయగలను," అన్నాడు

రాజసింహు డిలా అనగానే చంచల నిర్విణ్ణురా లయిపోయింది. తనను తిరిగి పుట్టినింటికి పంపే ప్రసక్తి అతడు తేగలడని ఆమె వూహించలేదు. ఆకారణంగా ఏం జవాబు చెప్పాలో తెలియక ఆమె తలవంచుకుని వూరుకున్నది



రాజసింహుడు ఆమె తనకు రాసిన వుత్తరాన్ని చూపుతూ, "ఈ వుత్తరం నీవు రాసినదేగదా ?" అని ప్రశ్నించాడు

"అవును ప్రభూ !"

"ఈ వుత్తరం చివరివరకూ ఒకరు రాసినట్టుగా లేదు. ఇందులో నీవు రాసిన భాగం ఏది ?"

"మొదటిభాగం నేను రాశాను."

"అలాఅయితే చివరిభాగం మరెవరో రాశారన్నమాట !" అంటూ రాజసింహుడు ఆలోచనలో పడ్డాడు

ఉత్తరంలోని చివరిభాగం నిర్మల రాసినది. అందులోనే వివాహప్రసక్తి వున్నది. చంచల ఏమని జవాబు చెప్పాలా అని ఆలోచిస్తూన్నంతలో రాజసింహుడు, "ఆ చివరిభాగం నీ అనుమతితో రాసినదేనా ?" అని అడిగాడు.

ఈ ప్రశ్న చాలా కఠినమైనదే కాక నిర్దయాపూర్వకమైనదిగాకూడా చంచలకుమారికి తోచింది. అయినా ఆమె ఏమాత్రం కోపం కనబరచకుండా, "మహారాజా! ఉత్తమ క్షత్రియులైనవారు వివాహంకోసం కన్యాపహరణం చేయటం ఆచారంగా వున్నది. వివాహోద్దేశం లేకుండా కన్యాపహరణానికి పూనుకోవటం మహాపాపం కదా? అలాంటి పాపానికి తమ నెందుకు ఒడికట్టమంటాను," అన్నది.

"నిన్ను నే నపహరించి తేలేదు. ముసల్మానుల చేతుల్లో పడకుండా నిన్నుద్ధరించాను. ఈ పరిస్థితుల్లో నిన్ను నీ తండ్రిగారి యింటికి ఎంపటమే నాకు ధర్మంలా కనిపిస్తున్నది," అన్నాడు రాజసింహుడు

అప్పటివరకూ కన్యాసహజ మయిన సిగ్గుతో తలవంచుకునివున్న చంచల తల పైకెత్తి, రాజసింహుని ముఖంకేసి చూస్తూ, "మహారాజా! నా సతీధర్మ మేదో నాకు తెలిసినట్లే, మీ రాజధర్మ మేదో మీకు తెలిసివుండాలి. నే నేనాడో మీ పావనచరణ కమలసాన్నిధ్యంలో నా హృదయసమర్పణ చేసుకున్నాను. ఆ కారణంగా మీ ఆజ్ఞలు నాకు శిరోధార్యాలు. మీరు నన్ను రూపనగరానికి పొమ్మంటే పోగలను. కాని నా తండ్రి తిరిగి నన్ను ఢిల్లీపాదుషా దగ్గిరకు పంపగలడు" అన్నది.

"అలా జరిగేందుకు వీలులేదు. నరే యిక్కడే వుండు" అన్నాడు రాజసింహుడు

"అతిథిగా వుండమంటారా? రూపనగర రాజకుమారి దేవిగా తప్ప మరొక విధంగా యీ అంతఃపురంలో నివశించలేదు."

రాజసింహు డా మాటలకు చిరునవ్వు నవ్వుతూ. "నీవంటి సుందరీమణి ఏరాజుకు దేవి కాగలదో అతడే ధన్యుడు. కాని నీవంటి అసమాన రూప వయోవిలాసిని దేవిగా చేసుకునేందుకు సంశయిస్తున్నాను. 'ఋణకారీ పితా శత్రు ర్మాతాచ వ్యభిచారిణీ: భార్యా రూపవతీ శత్రుః పుత్ర శ్శత్రు రపండితః' అన్నారు శాస్త్రకారులు" అన్నాడు.

"మహారాజా! మన్నించండి. ఉదయపుర రాజసింహుని దేవేరు లందరూ కురూపిణు లేనా?" అన్నది చంచల వచ్చేనవ్వును ఆపుకుంటూ.

"కురూపిణులు కాకపోవచ్చు; నీయంత అందగత్తెలుమాత్రం కారు."

"మహారాజా రాజసింహులు దేన్ని గురించయినా భయపడగలరని నేనూహించ లేదు;" అన్నది చంచల.

"నీ మందహాస చంద్రికలకు దాసుడనై రాచకార్యాలు మరవగల్గ నని నాకు భయంగా వున్నది. 'వృద్ధస్య తరుణీ విషం' అన్నారు."

"మహారాజా! మీరు వృద్ధులా?"

"వృద్ధుణ్ణి కాకపోవచ్చు; యౌవ్వనుణ్ణిమాత్రం కాను."

"బలపరాక్రమాలు గల పురుషుడే రాజపుత్రకన్యకు యౌవ్వనుడు."

"యౌవ్వనులు, రూపవంతులు, బలిష్ఠులు అయిన రాజపుత్రు లనేకు లున్నారు."

"ఉండవచ్చు; నేను నా హృదయాన్ని మీకు సమర్పించాను."

చంచల యిలా అనగానే రాజసింహుడు మహానందంతో, "ఓ సుందరీమణీ! నీవే నాకు తగిన దేవివి. నీ వాపదలో చిక్కి అవసరంకొొందికే నా సహాయాన్ని అర్థించావని యింతవరకూ భావించాను. నీమాటలవల్ల నా సంశయాలన్నీ తీరిపోయినై. నీవు తప్పక నాదేవివి కాగలవు. దీనికి నీతండ్రి అంగీకరిస్తాడో లేదో తెలుసుకోవాలి.

ఆయన సమ్మతిలేకుండా నేను నిన్ను వివాహమాడటం పొసగదు. సైన్యం స్వల్పమే అయినా నీ తండ్రి విక్రమసింహుడు పదియారేనుగుల బలం కల వీరపురుషుడని విన్నాను. మొగలులతో మరొకసారి నాకు యుద్ధం తప్పదు. అప్పుడు నీతండ్రి సహాయం నా కవసరమవుతుంది. ఆయనతో శత్రుత్వం మంచిదికాదు. అందువల్ల ఆయనకు ఉత్తరం రాసి ఆయన అంగీకారంతోనే నిన్ను వివాహమాడగలను." అన్నాడు.

చంచలకుమారి అందుకు సమ్మతించింది. రాజసింహుడు ఆమెతండ్రికి గౌరవ పురస్సరంగా ఒక ఉత్తరం రాసి దూతచేత దానిని రూపనగరం పంపాడు. చంచల కూడా తన తల్లిదండ్రుల ఆశీస్సులు కోరుతూ ఒక లేఖ రాసిపంపింది.

* * * * *

రూపనగరాధీశు డైన విక్రమసింహుడివద్దనుంచి త్వరలోనే రాజసింహుడికి ప్రతివుత్తరం వచ్చింది. ఆ లేఖ చదివి రాజసింహుడు నిశ్చేష్టుడయాడు. ఆ లేఖలో యిలా వున్నది :

"రాజస్థాన్ ప్రభువులలోకెల్ల సర్వోత్కృష్టులైన మీరు నాకు తీరని కళంకం కలిగించారు. ఢిల్లీ చక్రవర్తిని వివాహమాడి రాజరాజేశ్వరి కానున్న నా కుమార్తెను అపహరించటంద్వారా మీరు నాకు శత్రువులయారు. నేనుకూడా రాజపుత్ర వంశస్థుడనే. ముసల్మానులకు కన్యాదానం చేయటం నా ఆత్మగౌరవానికీ, మతాచారానికీ విరుద్ధమైన పని అని నాకు తెలియందికాదు. కాని నే నందుకు అంగీకరించకపోతే, యీ సరికే నా రూపనగరదుర్గం నిర్ధూమధామ మయివుండేది. ఢిల్లీ పాదుషాతోయుద్ధమే తటస్థిస్తే నాకు సహాయం చేయగల రాజపుత్రు డెవరు? ఒకవేళ మీరు ఢిల్లీపాదుషాను ఎదిరించి ఓడించగల సమర్థులమని భావించేటట్టయితే, ఆ కార్యం మీరు విజయవంతంగా నెరవేర్చిననాడు, నేను కన్యాదానం చేసేవిషయం ఆలోచించగలను.

"మీరు నా కుమార్తెను అసత్యకల్పనలతో మోసగించి కపటోపాయంతో అపహరించారు. మీ రొక దూతచేత నాకు అసత్యసందేశం పంపి, నా సైనికసహాయంతోనే నా కుమార్తెను ఎత్తుకుపోయారు.

"అలాకాకపోతే మొగలులను మీరు జయించగలిగేవారా? ఇప్పుడు మొగలు పాదుషా నన్నే శత్రువుగా పరిగణిస్తాడు. నా మోసకారణంగానే నా సైన్యం యుద్ధం చేసి, నా కుమార్తెను అపహరించుకుపోయినట్టు ఆయన తప్పక భావిస్తాడు; ఆ కారణంవల్ల ఆయన మొట్టమొదట నాశనం చేయబోయేది నా రూపనగరాన్ని; ఆ తరువాత గదా ఆయన మీ మీదకు యుద్ధానికి రావటం జరుతుంది;

"ఈ అన్ని కారణాలవల్లా నా పుత్రికను మీరు వివాహ మాడవలదని చెప్తున్నాను ఒకవేళ నా అభిప్రాయానికి వ్యతిరేకంగా మీరు వివాహ మాడటమే జరిగితే 'నా పుత్రిక గొడ్రాలై భర్తను కోల్పోయి సహగమన భాగ్యంకూడా లభించకుండా పోవుగాక!' మీ రాజధానీ నగరం శునక జంబుక నివాసయోగ్యమై పోవుగాక!' అని నామనఃపూర్వకంగా శపిస్తున్నాను."

విక్రమసింహు డొకటికి రెండుసార్లు చదువుకుని చంచలకుమారికి కూడా చదివి వివిపించాడు. విక్రమసింహుడు వుత్తరం ముగించిన తరవాత దిగువగా ఒకటి రెండు పంక్తులలో, "ఎప్పటికైన మీరు నా కుమార్తెకు తగినవారని తోచినట్లయిన ఆనాడు నేనే స్వయంగా మీకు కన్యాదానము చేయగలను." అని రాశాడు. ఆ వాక్యాలు రాజసింహుడికి చాలా వూరట కలిగించినై.

"ఇప్పు డేమిటి కర్తవ్యం? మన వివాహం యిప్పటి పరిస్థితుల్లో సాధ్య మయేదికాదు;" అన్నాడు రాజసింహుడు

చంచలకుమారి కళ్ళల్లో అశ్రువులు తిరిగినై. ఆమె గద్గదస్వరంతో, "తల్లి దండ్రుల అనుమతి లేకుండా ఏ కన్య తనకు తానై వివాహ మాడగలదు." అన్నది.

"నీవు నాకు తగిన దేవివి. యుద్ధంలో మొగలులను జయించిననాడు నీ తండ్రి నాపై తప్పక ప్రసన్నుడు కాగలడు. ఆ రోజున ఆయన సమ్మతితోనే నిన్ను వివాహ మాడగలను అంతవరకూ నీవు నా అంతఃపురంలోనే వుండటం మంచిది. నీకు నా తక్కిన దేవేరుల కిచ్చినట్టే దాసదాసీజనాన్ని యిస్తాను. అందరూ నిన్ను మహారాజ్ఞి అనే పిలుస్తారు. కాని ఒక్కటి, శాస్త్రానుసారంగా నిన్ను వివాహ మాడేవరకూ నేను ప్రతిదినం నీ దర్శనానికి రాలేను" అన్నాడు రాజసింహుడు. చంచలకుమారి యీ ఏర్పాటుకు సంతోషంగా అంగీకరించింది.

చంచలకుమారి మహారాజ్ఞి అయిన సంగతి విని నిర్మల ఆమె నొకనాడు చూడ వచ్చింది ఇద్దరూ రూపనగరంలో విడిపోయిన తరవాత జరిగిన సంఘటనలు ఒకరి కొకరు తెలుపుకున్నారు. రాజసింహుడు తన సఖిని యింకా శాస్త్రవిధిగా వివాహ మాడలేదని విని నిర్మల రాజసింహునిపై చాలా కోపం వెళ్ళగక్కింది, చంచల సంగతి సందర్భాలన్నీ ఆమెకు చెప్పి, అంతఃపురంలో తన వెంట వుండేందుకు నిర్మలను ఇల్లు విడిచి రావలసిందిగా కోరింది

నిర్మల యిప్పుడు చాలా ఆస్తిపాస్తులూ, దాసదాసీజనం కల గృహిణి. భర్త రాజసింహుడి సైన్యంలో గొప్ప పదవిలో వున్నాడు. వీటన్నిటికీతోడు ఆమెకు తన భర్త మొదటి భార్య సంతానం అయిన ఒక చిన్న ఆడపిల్లను పెంచే బాధ్యత



వున్నది. ఈ అన్నికారణాలవల్లా ఆమె చంచలకుమారి కోర్కెను నిరాకరించింది. కాని చంచల ఒకటికి రెండుసార్లు బ్రతిమాలటంతో, ఆమె అంతఃపురంలో వుండేందుకు ఒప్పుకుని, భర్త అనుజ్ఞ పొంది, ఆడపిల్లను అతడి మేనత్త సంరక్షణలో వుంచి, పల్లకీ ఎక్కి రాచనగరుకు బయలుదేరింది.

రాజమార్గంలో ఒక ఇంటిముందు చాలామంది జనులు గుంపుకూడి వుండటం నిర్మల కంటబడింది. ఆమె పల్లకీ తెరలు కొంచెంగా తొలగించి, ముందూ వెనకా బల్లాలు పట్టుకుని నడుస్తున్న నౌకర్లను, "ఆ గుంపు అక్కడ ఎందుకు చేరా" రని అడిగింది.

"అమ్మా! ఆ ఇంటిలో కొత్తగా ఒక గొప్ప జ్యోతిష్కుడు వచ్చివున్నాడు." అన్నారు నౌకర్లు

నిర్మల తన పల్లకీని ఆ ఇంటికి తీసుకుపొమ్మని ఆజ్ఞాపించింది. నౌకర్లు పల్లకీని జ్యోతిష్కుడి ఇంటిముందు దింపి, బల్లాలతో జనాన్ని అటూయిటూ తొలగదోసి, నిర్మల జ్యోతిష్కుడున్న గదికి వెళ్ళేందుకు దారి చేశారు.

నిర్మల జ్యోతిష్కుడికి తన చేయి చూపింది. జ్యోతిష్కుడు చేతిని కాసేపు పరీక్షించి చూసి, "అమ్మా! మీ రడగదలచిన ప్రశ్న ఏమిటి?" అన్నాడు.

"నా కొక స్నేహితురా లున్నది."

"ఊఁ, చెప్పండి."

"ఆమె కింకా వివాహం కాలేదు."

జ్యోతిష్కుడు ఒక కాయితంమీద ఏవో గుర్తులు పెట్టుకుని, "ఊఁ చెప్పండి." అన్నాడు.

"ఆమెకు వివాహం ఎప్పు డవుతుందో తెలుసుకోవాలని వున్నది," అన్నది నిర్మల.

జ్యోతిష్కుడు కాయితంమీద ఏవేవో రాసుకుని గుణించి, తన ముందున్న తాళ పత్రాలను తిరగవేసి, పెదవి విరుస్తూ నిర్మలకేసి చూశాడు

"అయ్యో. ఆమెకు వివాహమే కాదా?" అని ప్రశ్నించింది నిర్మల ఆదుర్దాగా

"ప్రాయికంగా శాస్త్రం చెప్పే ఫల మదే." అన్నాడు జ్యోతిష్కుడు.

"ప్రాయికం అంటున్నా రెందువల్ల?"

"నీ సఖికి ఒకానొక గొప్ప సార్వభౌముడి ముఖ్యపత్ని వచ్చి సేవ చేయటం తటస్థిస్తే, అప్పు డామెకు వివాహం కాగలదు అది అసంభవంగా కనబడటంవల్ల, ఆమెకు వివాహ యోగం లేదని నేను చెప్పవలసివచ్చింది," అన్నాడు జ్యోతిష్కుడు

'అవును, అసంభవమే!" అంటూ నిర్మల జ్యోతిష్కుడికి కొంత ధనం యిచ్చి, పల్లకీ ఎక్కి రాజప్రాసాదంకేసి బయలుదేరింది.

## 13

తనకు భార్య కానున్న కన్యను మేవారులోని ఉదయపుర రాజు రాజసింహుడు అపహరించాడని తెలియగానే ఔరంగజేబుపాదుషా రౌద్రమూర్తి అయాడు. రాజ పుత్ర యోధులనుంచి ప్రాణాలతో పారిపోయివచ్చిన మొగలు దళాధిపతులలో కొందరిని ఉరి తీయించాడు. కొందరికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాడు

ప్రస్తుతః ఔరంగజేబు హిందూమతద్వేషి. ఈ దుస్సంఘటనతో అతడిలో ఆ ద్వేషం యినుమడించింది హిందువులను అవమానించేందు కాతడు లోగడ ఎప్పుడో జిజియాపన్ను విధించాడు కాని దాని వసూలు విషయంలో ఆత డంత వరకూ పట్టుదల చూపలేదు కాని యిప్పు డాతడు ఆ జిజియాపన్ను వెంటనే చెల్లించవలసిందిగా రాజస్థానంలోని రాజు లందరికీ ఆజ్ఞలు జారీచేశాడు.

జయపుర రాజైన జయసింహుడు మరణించిన తరువాత అతడికి ఔరంగజేబు ప్రోద్బలంతో విషంపెట్టిన మిత్రద్రోహి ఒకడు ఆ రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు జయసింహుడి కుమారుడు ఢిల్లీ కారాగారంలో మగ్గుతున్నాడు ఆ కారణంవల్ల జయ పురరాజ్యం జిజియాపన్ను చెల్లించింది

యోధపురరాజు యశోవంతసింహుడు చనిపోగానే అతడిరాణి రాజ్యపాలనకు వచ్చింది ఆమె యీ జిజియాపన్ను యివ్వటానికి మొదట్లో నిరాకరించింది కాని

ఔరంగజేబు యుద్ధప్రయత్నాలు చేస్తున్నసంగతి తెలియగానే. పన్నుకు బదులుగా తనరాజ్యంలో కొంతభాగం అతడికిచ్చి సంధి చేసుకున్నది.

రాజసింహుడుమాత్రం అవమానకరమైన యీ జిజియాపన్ను యివ్వటానికి నిరాకరించాడు ఉదయపురం స్వతంత్ర రాజ్యం. అది ఎవరి ఆజ్ఞలకూ తల ఒగ్గదని ఔరంగజేబుకు లేఖ వ్రాశాడు.

ఆలేఖను సమర్థుడు, ధైర్యశాలీ అయిన వ్యక్తిద్వారా ఔరంగజేబుకు పంపవలసి వున్నది ఔరంగజేబు శాంతి రాయబారానికు వచ్చిన దూతలను కూడా చంపించిన ఉదాహరణ లనేకం వున్నవి

మాణిక్యలాలు ఆ లేఖను తాను ఢిల్లీకి తీసుకుపోగల నన్నాడు రాజసింహుడు అందుకు అంగీకరించాడు తన సైనికోద్యోగియొక్క ధైర్యసాహసాలూ, బుద్ధి బలం అతనికి తెలియందికాదు

మాణిక్యలాలు ఢిల్లీపాదుషావద్దకు దూతగా వెళుతున్నవార్త అంతఃపురంలో తెలిసింది. చంచలకుమారి నిర్మలనుకూడా అతని వెంట ఢిల్లీ వెళ్ళవలసిందిగా కోరింది

"నాకు ఢిల్లీలో ఏంపని?" అంటూ ఆశ్చర్యపోయింది నిర్మల.

"ఆ మాయలమారి ఉదయపురిబేగంకు నేనిచ్చే లేఖ వొకటి అందచేసి, ఆమె నిక్కడికి తీసుకురావాలి," అన్నది చంచల.

నిర్మల పెద్దగా నవ్వుతూ, "అవును; సార్వభౌముని భార్య వచ్చి నీకు పరిచారికయై తాంబూలము మడిచి యిచ్చినప్పుడుగదా నీకు కళ్యాణప్రాప్తి కలిగేది ఆ జ్యోతిష్కుడి మాటల్లో నాకు పూర్తి విశ్వాసం వున్నది. నిజమే, లేఖ రాసియివ్వు, ఆ ఉదయపురిబేగాన్ని జుట్టు పట్టు కిక్కడి కీడ్చుకువస్తాను," అన్నది;

"అది అంత తేలికగా అయే పనికాదు. ముందు నేను ఔరంగజేబు పాదుషాకూ, మహారాణా రాజసింహునికీ యుద్ధం కల్పించాలి ఆ యుద్ధంలో తప్పక మహారాణాకే విజయం లభిస్తుందని నా నమ్మకం. అప్పుడు ఆ ఉదయపురిబేగం నిశ్చయంగా నాకు దాసియై సేవ చేస్తుంది,' అన్నది చంచల

"అదంతా సరే నేను ముందు ఆ పాదుషా రంగమహాలు ప్రవేశించటం ఎలా?" అని ప్రశ్నించింది నిర్మల

"యోధపురిబేగమువారి హస్తముద్రిక మన దగ్గిర వున్నదికదా; దాన్ని తీసుకుపో. ఆ ముద్రిక చూపితే నిన్ను నిరభ్యంతరంగా రంగమహాలు ప్రవేశించనిస్తారు ఆమెకు నా నమస్కారాలు చెప్పి, యిక్కడ జరిగిన విషయా లన్నీ వివరించి, నేను ఉదయపురిబేగంకు రాసిన లేఖ ఆమెకు చూపించు ఆ లేఖ నేదో

విపులంగా ఆమె ఉదయపూరికి చేరేలా చేయగలదు.'' అన్నది చంచలకుమారి.

నిర్మల ఢిల్లీకి పోవటానికి అంగీకరించి, చంచల యిచ్చిన లేఖ తీసుకుని తన ఇంటికి వెళ్ళింది.

నిర్మల వచ్చేసరికి మాణిక్యలాలు ఢిల్లీ ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుని సిద్ధంగా వున్నాడు. అతడు తెగిన తన చేతి ప్రక్కకు బదులుగా ఏనుగుదంతంతో ప్రేళ్ళు చేయించి, వాటికి మేకచర్మం తొడిగి, తన శరీరంరంగుతో కలిసేలా రంగు పూయించాడు

''ఇవి ఎందుకు?'' అని అడిగింది నిర్మల.

''నే వెళ్ళేది ప్రమాదకరమైన పని. నేను ఢిల్లీలో అవసరంకొందికి దొంగ వేషాలు వేయవలసిరావచ్చు. మొండిచేతివాడు ఎన్ని వేషాలు మార్చినా పట్టుబడి పోతాడు వీటి ఉపయోగం చాలా వున్నది ఇదుగో, ఈ పావురాళ్ళను చూశావా? ఇవి మనకు వార్తలు పంపడానికి పనికివచ్చే సాధనాలు.'' అంటూ అక్కడవున్న ఒక పెద్ద పెట్టెను తెరిచి, అందులోవున్న కొన్ని ప్రతిమలను నిర్మలకు చూపించి, ''ఈ ప్రతిమ లన్నిటిమీదా పావురం తల గుర్తు వుంటుంది ఢిల్లీ చేరిన తరువాత మనం ఎవరి పనుల మీద వాళ్ళం పోవలసివుంటుంది కదా? నా సమాచారం నీకు తెలియాలంటే, యీ గుర్తు లున్న బొమ్మల దుకాణానికి ఎవరినైనా పంపితే సరిపోతుంది;'' అని చెప్పాడు.

ఆ మరసటి దినమే మాణిక్యలాలు నిర్మలను వెంటబెట్టుకుని, రాజసింహుడు పాదుషాకు పంపిన కొన్ని కానుకలు తీసుకుని సపరివారంగా ఢిల్లీకి ప్రయాణమై, కొద్దిరోజుల తరువాత నగరం చేరాడు ముందుగా అతడు నగర పరిసరాల్లో ఒకశిబిరం నిర్మింపజేసి, అందులో నిర్మల నుండమనిచెప్పి, ఒక సేవకుడి ద్వారా తాను తెచ్చిన ప్రతిమలను పట్టించుకుని నగరంలోకి వెళ్ళాడు అక్కడ అతనొక దుకాణం అద్దెకు తీసుకుని అందులో ప్రతిమలను పెట్టి అమ్మేందుకో సేవకుణ్ణి నియమించాడు. తరువాత పాదుషాకు తన రాకనుగురించి వర్తమానం పంపాడు

ఔరంగజేబు అపరాహ్ణం వేళ దర్బారుకు వచ్చాడు. మాణిక్యలా లాయనకు వంగి మూడుసార్లు సలాముచేసి, రాజసింహుడు పంపిన కానుకలను అతడిముం దుంచాడు ఆ కానుకలు అంత విలువైనవి కాకపోవడంతో ఔరంగజేబు వాటికేసి సరిగా కన్నెత్తి అయినా చూడలేదు అతడిని అందులో ఆకర్షించినవి రెండు కత్తులు, ఒకటి వరలో వున్నది, రెండవది వరనుంచి దూసినది ఔరంగజేబు ఆ రెండవ



కత్తిని చేతికి తీసుకున్నాడు. ఆ సమయంలో మాణిక్యలాలతడికి రాజసింహుడు రాసిన లేఖ అందించాడు.

లేఖ చదువుతూనే ఔరంగజేబు ముఖం జేవురించింది. పొంగిపొర్లే కోపావేశాన్ని తనలోనే దాచుకుని, పైకి మృదువుగా మాణిక్యలాలును కుశలప్రశ్న ఒడిగాడు తరవాత రాజసింహుడి లేఖకు మరనాడు జవాబు పంపగలనని చెప్పి, మాణిక్యలాలును పంపివేశాడు.

మాణిక్యలాలు దర్బారునుంచి బయటికి వెళ్ళగానే ఔరంగజేబు కొలువు చాలించి, తన సేవకులకు మాణిక్యలాలును వెతికి చంపవలసిందిగా ఆజ్ఞ యిచ్చాడు ఇలా జరగవచ్చని వూహించిన మాణిక్యలాలు, త్వరిత్వరగా తన దుకాణం చేరి, వేషం మార్చుకుని బొమ్మ లమ్ముకునే వ్యాపారిలా నటించసాగాడు.

ఔరంగజేబు సేవకులు నగరం వెలపల వున్న మాణిక్యలాలు శిబిరం సంగతి తెలుసుకుని అక్కడికి వెళ్ళి, నౌకర్లనూ నిర్మలనూ పట్టుకుని కొత్వాలు దగ్గిరకు తీసుకుపోయారు కొత్వాలు వాళ్ళ నెంత బెదరించినా· ఒక్కళ్ళూ మాణిక్యలా లెక్కడ వున్నదీ చెప్పలేదు చివర కతడు నిర్మలను· "రాణారాజసింహుడి దూత నీ కే మవుతాడు?" అని ప్రశ్నించాడు.

"ఆ దూత ఎవరోకూడా నేను చూడలేదు. నేను యోధపురిబేగమువారి హిందూ పరిచారికను." అని జవా బిచ్చింది నిర్మల

"అది అబద్ధం! అక్కడి పరిచారిక లెవరూ రంగమహలు వదిలి బయిటికి రారు." అంటూ కొత్వాలు గుడ్లురిమాడు.

"ఆమాట నిజమే కొత్తగా ఎవరో హిందువులు నగర పరిసరాలలో శిబిరం నిర్మించుకున్నారని విని బేగంసాహెబావారు నన్ను వారి దగ్గిరకు పంపింది:" అన్నది నిర్మల.

"ఏం పనిమీద?"

"శ్రీకృష్ణచరణామృతం తెచ్చేందుకు. రాజపుత్రు లందరకూ అది పరమ పూజ్యమైనది"

"నీవు యోధపురిబేగంవారి పరిచారిక వనేందుకు గుర్తేమిటి?"

నిర్మల తనవద్దవున్న యోధపురిబేగం హస్తముద్రిక కొత్వాలుకు చూపించింది. దానిని చూస్తూనే కొత్వాలు నిర్మలకు వంగి మూడుసార్లు సలాంచేసి, "పొరపాటు జరిగింది. మీరు తిరిగి రంగమహలుకు నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు" అన్నాడు.

"అలాగే వెళతాను. మీరొక సహాయం చేయాలి. నేను ఎన్నడూ రంగమహల్ వదిలి బయిటికి వచ్చినదాన్నికాను. నగరంలో అల్లరిమూక ఎక్కువగా వున్నట్టు కనబడుతున్నది. మీరు నావెంట సహాయంగా ఒక భటుణ్ణి పంపండి:" అని అడిగింది నిర్మల.

కొత్వాలు తన భటుల్లో ఒకణ్ణి నిర్మలకు రక్షణగా పంపాడు. నిర్మల రంగమహలు ద్వారం చేరి. అక్కడి కావిలివారికి యోధపురిబేగం హస్తముద్రిక చూపి నిరాటంకంగా ఆమె మందిరం చేరింది.

యోధపురిబేగం నిర్మల చేతినుంచి తన హస్తముద్రికను తీసుకుని, "ఈ ముద్రిక నీకెలా వచ్చింది?" అని అడిగింది ఆశ్చర్యంగా.

నిర్మల ఆమెకు అన్నివిషయాలూ వివరించి చెప్పింది. యోధపురిబేగం రూప నగరానికి పంపిన దేవి అనే పరిచారిక, చంచలకుమారిని కలుసుకున్న సంగతీ వెళ్ళేటప్పుడు ఆ హస్తముద్రికను అక్కడే మరిచిపోయిన సంగతీ చెప్పి, ఆ తర వాత కలిగిన పరిణామాల మాట చెప్పి, "బేగంవారు నా కిప్పు డొక సహాయం చేయాలి ఉదయపురిబేగంకు చంచలకుమారి ఒక లేఖ రాసింది. అది ఆమెకు చేర్చేందకు తమరు సహాయపడాలి," అని కోరింది.

"అదెంతపని; జేబున్నీసా అనుమతి సంపాయిస్తే, ఆ ఉదయపురిని చూడవచ్చు. కాని, జేబున్నీసాను కలుసుకోవటాని కిది సమయం కాదు. ఆదుర్మార్గురా లీ సమ యంలో తాగిన కైపులో వుంటుంది. నీవు ప్రస్తుతానికి నా హిందూ పరిచారిక లుండే

చోటుకు వెళ్ళి, అక్కడే భుజించి విశ్రాంతి తీసుకో," అన్నది యోధపురిబేగం.

రాత్రి చాలా పొద్దుపోయిన తరవాత యోధపురిబేగంవద్దనుంచి నిర్మలకు పిలుపు వచ్చింది నిర్మల ఆమె మందిరానికి వెళ్ళగానే, చెప్పవలసిన సంగతులన్నీ చెప్పి, ఆమె వెంట ఒక పరిచారికను పంపింది ఇద్దరూ జేబున్నీసా మందిరానికి వెళ్ళారు. అప్పటి కింకా జేబున్నీసా తాగిన మత్తులోనే వున్నది నిర్మల ఆమె ముందుకు పోయి సలాం చేసి నిలబడింది.

"ఎవరు నీవు ?" అని ప్రశ్నించింది జేబున్నీసా సగం మూతలుపడిన కళ్ళతో నిర్మలకేసి రుసరుస లాడుతూ చూసి

"నే నొక ఉత్తరం తెచ్చాను దాన్ని ఉదయపురిబేగంవారికి అందజేయాలి అందుకు తమ అనుమతికోసం వచ్చాను," అన్నది నిర్మల.

"ఉదయపురిబేగం ఒతికున్న సమాచారం తెలియదు, చచ్చేవుంటుంది నువూ అక్కడికే పో," అన్నది జేబున్నీసా.

జేబున్నీసా దాసీ ఒకతె నిర్మలను ఉదయపురిబేగం మందిరానికి తీసుకుపోయింది. ఆ సమయంలో ఉదయపురి మాంచినిషాలో వున్నది, తనలో తనే ఏమేమో గొణుక్కుంటున్నది నిర్మలను చూసి, "ఎందుకొచ్చా విక్కడికి ?" అని ప్రశ్నించింది తడబడుతున్న గొంతుతో

"తమ కొక లేఖ తెచ్చాను," అన్నది నిర్మల.

"లేఖా ! ఓహో, అది పారశీక చక్రవర్తి షహన్‌షా వ్రాసిన ప్రేమలేఖ అయి వుంటుంది. ఆయన నా సౌందర్యం మాట విని ముగ్ధుడైనట్టు తెలిసింది. ఏదీ ఆ లేఖ !" అంటూ ఉదయపురి చేయిచాచింది. నిర్మల చంచలకుమారి రాసినలేఖ నామె చేతి కందించింది. ఉదయపురి ఆ లేఖకేసి ఓమారు చూసి, కిలకిల నవ్వుతూ పాన పాత్రను తీసుకున్నది.

నిర్మల అక్కడినుంచి యోధపురిబేగందగ్గరకు వెళ్ళి జరిగిన సంగతంతా చెప్పింది. చంచలకుమారి ఉదయపురికి రాసిన లేఖలోని విషయమంతా చదివివున్న యోధపురిబేగం కొంచెం ఆదుర్దా కనబరుస్తూ, "నిర్మలా ! నీ విప్పుడే నగరం వదిలి పోవటం క్షేమం. ఆ లేఖ నీకు చాలా చిక్కులు తెచ్చిపెడుతుంది. వీలైతే నీ భర్త ఎక్కడున్నదీ తెలుసుకుని. అతడితో కలిసి ఉదయపురానికి పో. అది సాధ్యం కాక పోతే నీకు ప్రయాణంలో తోడుగా వుండేందుకు నా కొజ్జాలలో ఒకణ్ణి పంపుతాను. అవసరమైతే అతణ్ణి నీవు ఉదయపురంవరకూ తీసుకుపోవచ్చు," అని చెప్పి ఆమె

తన కొజ్జాలలో బాగా నమ్మకస్తుడైన బనాసి అనేవాణ్ణి పిలిచి, నిర్మలకు రక్షణగా ఆమె వెంట వెళ్ళవలసిందిగా చెప్పింది.

నిర్మల యోధపురిబేగంకు ఒకటికి రెండుమార్లు ప్రణామం చేసి బనాసిని వెం బెట్టుకుని బయలుదేరింది. వా రిద్దరూ రంగమహలు ముఖద్వారం దగ్గిరకు వచ్చేసరికి కొజ్జా భయవిహ్వలుడై పోయి, "అయ్యో, కొంప మునిగింది. పారిపో, పారిపో!" అంటూ వెనుదిరిగి పరిగెత్తాడు.

## 14

కొజ్జా పారిపోవటం నిర్మలకు చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆమెకు ద్వారం దగ్గిర ఎవరూ కనిపించలేదు. ద్వారం దాటి రెండడుగులు ముందుకు వేసేసరికి ఎదురుగుండా ఒక పురుషుడు రావటం ఆమె కంటబడింది. అతడు యవ్వనదశ దాటినవాడు, ఆజానుబాహువు. బహుశా, యితణ్ణి చూసి భూత మనుకుని కొజ్జా పారిపోయి వుంటాడని నిర్మల అనుకున్నది.

నిర్మల మరి రెండడుగులు ముందుకు వెళ్ళేసరికి, ఆ వ్యక్తి ఆమెను సమీపించి, "ఆగు, నువ్వెవరు?" అని ప్రశ్నించాడు.

"నే నెవరైతేమాత్రం నీ కెందుకు?" అన్నది నిర్మల

"నీవు హిందూ స్త్రీవా?"

"అవును, రాజపుత్ర యువతిని."

"ఓహో, యోధాబాయి పరిచారికవా!'' అన్నా డా వ్యక్తి.

యోధపురిబేగం పేరు చెప్పటం, ఆమెకు ప్రమాదకారణం అవుతుందేమోనని భావించిన నిర్మల, "నే నిక్కడ ఎవరి పరిచారికనూ కాను. ఈరోజునే ఉదయపురంనుంచి యిక్కడికి వచ్చాను." అన్నది.

''ఏంపనిమీద వచ్చావు?"

"అయ్యో, యీ భోగట్టా అంతా తమ కెందుకు? నాదారిన నన్ను వెళ్ళనివ్వండి." అన్నది నిర్మల విసుగుదల కనబరుస్తూ.

"నువ్వు సంతృప్తికరమైన జవా బిచ్చేవరకూ. ని న్నిక్కడినుండి వెళ్ళనివ్వను." అన్నా డావ్యక్తి.

నిర్మల అతడిముఖంలోకి పరీక్షగా చూసింది. ఆ రూపురేఖ లెక్కడో తా నిదివరకు చూసినట్టు అనుమానం కలిగింది నిర్మలకు

"అయ్యో, తమ రెవరు?"



"నా పేరు ఔరంగజేబు పాదుషా......"

నిర్మల కొంచెంగా చలించిపోయి, ముసల్మాను సాంప్రదాయం ప్రకారం అతడికి వంగి సలాము చేసి, "వెళ్ళేందుకు సెలవీయ ప్రార్థిస్తున్నాను." అన్నది.

"రంగమహాలులో ఎవరిని చూచేందుకు వచ్చావు?" అన్నాడు ఔరంగజేబు.

"ఉదయపురిబేగంవారిని."

"ఏం పనిమీద?"

"మహారాణా రాజసింహుని దేవివద్దనుంచి ఒక లేఖ తెచ్చి బేగంవారికి యిచ్చాను."

ఔరంగజేబు యీ జవాబుకు చాలా ఆశ్చర్యపడ్డాడు. అతడు రంగమహాలులో కావలా వుండే తార్తార ప్రతీహారిణులను పిలిచి, వాళ్ళకు నిర్మలను ఒప్పచెప్పి, ఉదయపురిబేగం గదికి వెళ్ళాడు. ఉదయపురి గాఢనిద్రలో వున్నది. నిర్మల యిచ్చిన లేఖ తల్పంమీద ఒక పక్కగా పడివున్నది. ఆ లేఖ అందుకుని చదివి ఔరంగజేబు రౌద్రమూర్తి అయిపోయి బయటికి వచ్చి నిర్మలను, "ఎవరి సహాయం వల్ల నీవీ రంగమహాలు ప్రవేశించావు?" అని ప్రశ్నించాడు.

"క్షమించండి. ఆ ప్రశ్నకుమాత్రం నేను ప్రత్యుత్తరం యివ్వలేను." అన్నది నిర్మల.

ఔరంగజేబామెను అనేక విధాల భయపెట్టాడు. నాలుక కోయిస్తా నన్నాడు. శరీరానికి మానెవస్త్రాలు చుట్టించి. నిప్పు అంటింపచేస్తా నన్నాడు. తిండీ నీరూ

యివ్వకుండా చచ్చేవరకూ ఖైదులో వుంచుతా నన్నాడు. ఆఖరకు తన ముసల్మాను వంటవాళ్ళచేత బలవంతంగా గోమాంసం పెట్టిస్తా నన్నాడు.

"మీరు పెట్టబోయే హింస లంటే నా కేమాత్రం భయంలేదు. రాజపుత్రకాంతలు విషం వెంట వుంచుకోకుండా ఇంటినుంచి బయలుదేర రని మీకు తెలియదేమో! మీ వంటవా ళ్ళక్కడికి గోమాంసం తెచ్చేలోపల నేను విషం మింగి మరణించ గలను." అన్నది నిర్మల నిర్భయంగా

ఔరంగజేబు యిక భయపెట్టి లాభంలేదని నిశ్చయించుకుని, చిరునవ్వునవ్వుతూ, "సుందరీ: నీ పే రేమిటి?" అని అడిగాడు.

"మహాప్రభూ! నా పేరుతో ఏం పని? మరికొందరు రాజపుత్ర రమణులను వివాహమాడ చూస్తున్నారా? నేను వివాహితను. నా భర్త యింకా జీవించే వున్నాడు." అన్నది నిర్మల.

"మీ రాజపుత్రు లంతా నన్ను పరమ క్రూరుడుగా ఎందు కనుకుంటున్నారో నాకు తెలియటంలేదు. నేను మీ రనుకునేంత దుష్టస్వభావం కలవాణ్ణి కాదని నీకు రుజువు చేయదలిచాను. కొంతకాలం నా రంగమహలులో వుండగలవా?" అన్నాడు ఔరంగజేబు.

"ఉండక నేను చేయగలిం దేమీలేదు. మీ ఆజ్ఞ లేక నేను బయటికి పోలేనుగదా? కాని. రంగమహలులో నన్ను ముసల్మానులవద్ద కాక, మీ హిందూ దేవేరుల దగ్గర వుంచండి,'' అన్నది నిర్మల.

"అలాగే వుండు, నా అభ్యంతరంలేదు. నిన్ను యోధపురిబేగం దగ్గరకు పంపుతాను." అన్నాడు ఔరంగజేబు.

నిర్మల యోధపురిబేగంవద్దకు పంపబడింది. జరిగిన సంగతంతా నిర్మల ఆమెకు చెప్పింది. ఒకటి రెండురోజులతరవాత యోధపురిబేగం సేవకుడిద్వారా నిర్మల నగరంలో వున్న తనభర్త మాణిక్యలాలుకు వుత్తరం రాసి, అన్ని విషయాలూ తెలియ చేసింది. మాణిక్యలాలు దుకాణం ఎత్తివేసి ఉదయపురం పోయేందుకు రహస్యంగా సన్నాహాలు చేయసాగాడు.

రంగమహలులోని ఔరంగజేబు భృత్యులేకాక, ఆయన కుమార్తె జేబున్నీసా కూడా నిర్మలను ఎంతో గౌరవంగా చూడసాగారు ఔరంగజేబామెకు విలువైన దుస్తులూ, రత్నాభరణాలూ బహూకరించాడు. అప్పుడప్పుడూ రంగమహలుకు వచ్చి, ఆమెతో ఉదయపురిరాణా రాజసింహుణ్ణి గురించి సంభాషించాడు. అతడి సైనిక బలం, యుద్ధతంత్రానికి సంబంధించిన వివరాలు సేకరించాలని పాదుషా ప్రయత్నం

అది గ్రహించిన నిర్మల అతడికి సత్యం చెప్పకున్నానిలా అన్నీ అసత్యాలు చెప్పింది.

రాజస్థానంమీద దాడిచేసి, రాజసింహుణ్ణి హతమార్చి, చంచలకుమారిని ఢిల్లీకి తెచ్చేందుకు ఔరంగజేబు తగుసన్నాహాలు చేయసాగాడు. ఈ సన్నాహాలిలా జరుగుతుండగా జేబున్నీసా తన ప్రియుడైన ముబారక్‌కోసం ఒక దూతికను పంపింది. ముబారక్ ఆ దూతికతో, "జేబున్నీసాకు నూరుసలాము లని చెప్పు! నేను వివాహితుణ్ణి. నా ధర్మపత్ని దరియాతో హాయిగా కాలం గడుపుతున్నాను," అన్నాడు.

దూతిక తిరిగివచ్చి చెప్పిన యీ మాటలు విని, జేబున్నీసా తోక తొక్కిన పాములా లేచింది. ఆ క్షణంనుంచీ ఆమె ముబారక్ నెలా నాశనం చేయటమా అని ఆలోచించసాగింది. రాజపుత్రులకు ఓడి పారిపోయి వచ్చిన దళాధిపతుల్లో శిక్ష పొందకుండా వున్నవా దొక్కడే.

జేబున్నీసా తనసేవకులను నియోగించి ఆరాలుతీయగా, కొండకనుమదగ్గిర జరిగిన యుద్ధంలో ముబారక్ ముఖ్యపాత్ర వహించటమేకాక, చంచలకుమారి రాజసింహుడి వెంట వెళ్ళిపోయేందుక్కూడా అంగీకరించా డని ఆమెకు తెలియవచ్చింది.

పగ సాధించాలని చూస్తున్న జేబున్నీసా, యీ సంగతి తగు సాక్ష్యాధారాలతో పాదుషా ముందుంచింది. పాదుషా ఉగ్రుడై ముబారక్‌ను పాములచే కరిపించి చంపవలసిందిగా శిక్ష విధించాడు. బక్షీ తన భటులను పంపి ముబారక్‌ను రప్పించాడు. ముబారక్ వస్తూనే పంజరాల్లోవున్న విషసర్పాలను చూసి, "బక్షీసాహెబ్! చావుకు నేనేం భయపడటం లేదు; కాని ఎవరైనా ముబారక్ ఎందుకు శిక్షించబడ్డాడని అడిగితే, షహజాది జేబున్నీసా అభీష్టప్రకారం అలా జరిగిందని చెప్పకోర్తాను,'' అన్నాడు.

బక్షీ వణికిపోతూ, ''ప్రమాదం తెచ్చిపెట్టే అలాంటి మాట అనకు." అని మందలించాడు.

ముబారక్ తన కాలిజోళ్ళు వదిలి, విషసర్పం వున్న ఒక పంజరంమీద కాలు పెట్టాడు. సర్పం కాటువేసింది. ఆ వెంటనే రెండవసర్పం వున్న పంజరంమీద కాలుపెట్టాడు. ఆ సర్పంకూడా కాటువేసింది. క్రమంగా అతడి రక్తనాళా లన్నీ విషపూరితాలై, మైకం కమ్మసాగింది.

ఆ స్థితిలో ముబారక్ మోకాళ్ళమీద వంగి కూర్చుని, చేతులు జోడించి, "అల్లాహో అగ్బర్! నేను నీ దయకోసం ఏ ధర్మం అయినా చేసివున్నా, చేయకపోయినా, నా మీద కరుణించి, నా ఆత్మకు పరలోకప్రాప్తి కలిగేలా చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను," అంటూ ముందుకు పడిపోయాడు.

ముబారక్ మరణవార్త తెలియరాగానే, జేబున్నీసా దుఃఖవివశురాలైపోయింది.

ఆ క్షణంలో ఆమెకు ముబారక్‌ను తా నెంతగా ప్రేమించినదీ తెలియవచ్చింది. రత్న ఖచితమైన పాన్పుమీద పడి కళ్ళల్లో నీరు పొంగిపొర్లగా, పొర్లి పొర్లి ఏడ్చింది కొంత సేపు తరవాత కాస్త తెప్పరిల్లి, తన కత్యంత విశ్వాసపాత్రుడైన అజీరుద్దీన్ అనే కొజ్జావాణ్ణి పిలిచి, "విషసర్పం కరిచి మృతుడైనవాడికి ఏదైనా చికిత్స వున్నదా ?" అని ప్రశ్నించింది.

అజీరుద్దీన్ ఆమెకు ఢిల్లీనగరంలో వున్న హకీం మారుపేరు చెప్పి, "ఆయన పాముకరచి మరణించినవారి నెందరినో బతికించాడు. అతణ్ణి నేను బాగా ఎరుగుదును,'' అన్నాడు.

"అయితే నీవు వెంటనే ఆ హకీందగ్గిరకు వెళ్ళి, అతణ్ణి ముబారిక్ శవంకొనం కట్టిన సమాధిదగ్గిరకు తీసుకుపోయి. అతణ్ణి ఎలాగైనా బతికించేలా చూడు ఇదుగో ధనం ! ఈ వెయ్యి మొహరీలలో నివ్వు, నూరు మొహరీలు తీసుకుని, మిగతా ధనం హకీం మాల్‌కు యిచ్చెయ్యి," అన్నది జేబున్నీసా. కొజ్జా అజీరద్దీను ఆధనం తీసుకుని త్వరిత్వరగా ఢిల్లీనగరంలోకి వెళ్ళాడు.

పాదుషాకోటలో జరిగుతున్న యీ గడబిడ లేమీ మాణిక్యలాలుకు తెలియవు. అతడు తనవద్దకు వచ్చిన యోధపురిబేగం సేవకుడిద్వారా తన భార్య అయిన నిర్మలకు తను ఉదయపురంనుంచి తెచ్చిన పావురాళ్ళలో నొకదాన్ని పంపి, ఆ రోజు తెల్లవారుజామునే తాను ఢిల్లీ వదిలి ఉదయపురం పోతున్నట్లు లేఖ రాశాడు.

మాణిక్యలాలు తన దుకాణం మూసివేసి, తన వెంట వున్న కొద్దిమంది అనుచరులతో ప్రయాణమై నగరద్వారం దాటి కొంతదూరం వెళ్ళేసరికి, దారిపక్కన వున్న ఒక ముస్లిం శ్మశానవాటికలో యిద్దరు మనుష్యు లాతడికి కనిపించారు. మాణిక్యలాలు వా రెవరై వుంటారా అనుకునేంతలో వాళ్ళు చేతిలో వున్న చిన్న లాంతరును అక్కడే జారవిడిచి పరిగెత సాగారు. మాణిక్యలా లీచోద్యం ఏమిటా అని గుర్రం దిగి శ్మశానవాటికలోకి వెళ్ళాడు. అక్కడతడికి అప్పుడే గోరీనుంచి బయటికి తీయబడిన శవం ఒకటి కనిపించింది. మాణిక్యలాలు శవాన్ని పరీక్షించి చూసి దాన్ని భుజాన వేసుకుని శ్మశానంనుంచి బయిటికి వచ్చి, ఒక చెట్టుకింద పడుకోబెట్టాడు. తరవాత అతడు తనవెంటవున్న పెట్టెలోనుంచి ఒక సీసా తీసి, అందులో వున్న మాత్ర ఒకటి అరచేతిలో వేసుకుని, ఏదో ఆకు పసరులో దాన్ని రంగరించి వేలితో ఆ ఔషధాన్ని శవం నాలుకమీద రాశాడు. ఒకటి రెండు గడియలైన తరువాత శవంలో కొంచం చలనం కనిపించింది. సూర్యోదయం అవుతున్న సమయంలో కండ్లు తెరవటం జరిగింది



"ఇదిగో యీ పాలు తాగు! ఒంట్లో ఎలా వున్నది?" అని అడిగాడు మాణిక్యలాలు

మాణిక్యలాలు అందించిన పాలు వణుకుతున్న చేతులతో తీసుకుంటూ, "అయ్యా! నేను మిమ్ములను ఎరుగుదును. ఉదయపురం దాపుల నున్న కొండకనుమల్లో మనం యుద్ధం చేశాం. నాపేరు ముబారక్," అన్నాడా చచ్చిబతికిన వ్యక్తి.

"నాపేరు మాణిక్యలాలు. నిన్ను నేను గుర్తించాను. నేను ఉదయపురం వెళుతున్నాను. నువు తిరిగి నగరంలోకి పోగలవా?" అని ప్రశ్నించాడు మాణిక్యలాలు.

"అయ్యా, అది అసంభవం. పాదుషా ఆజ్ఞవల్ల నేను విషసర్పాలచేత కరిపించబడ్డాను. కనుక నేను నగరంలోకి వేళ్ళే అవకాశంలేదు. మీ వెంట ఉదయపురం తీసుకుపొండి," అన్నాడు ముబారక్.

మాణిక్యలాలు ఆ దాపులనున్న ఒక గ్రామానికి వెళ్ళి ఒకగుర్రాన్ని కొనుక్కువచ్చాడు. ముబారకు దాన్ని అధిరోహించి మాణిక్యలాలు వెంట ఉదయపురానికి బయలుదేరి, దారిలో తను ఎవరి విద్వేషకారణంగా సర్పదష్టుడైనదీ అతడికి వివరంగా చెప్పాడు.

ఈ లోపల అజీముద్దీన్, జేబున్నీసా దగ్గరకు పోయి, "బేగంసాహెబా, హాకీం ఎంత ప్రయత్నించినా మొబారకుసాహెబు సజీవుడు కాలేదు," అని విన్నవించుకున్నాడు. ఆవార్త వింటూనే జేబున్నీసా కుమిలికుమిలి ఏడవసాగింది. ఆ సమయంలో గది బయట గడబిడ ప్రారంభమైంది. గదిలో ప్రవేశించ చూస్తున్న ఎవరినో, అక్కడ కావలికత్తె వలదని వారించ ప్రయత్నిస్తున్నది. వారిద్దరికీ వాగ్వాదం ప్రారంభమయింది. కంఠస్వరాన్ని బట్టి ఆ వచ్చినది ముబారకు భార్య దరియాబీబీ అని జేబున్నీసా తెలుసుకున్నది.

ఇప్పు డేమి చేయడమా అని జేబున్నీసా ఆలోచించేంతలో పరియా కేకలు పెడుతూ ఆమెగదిలోకి పరుగున వచ్చి, చేతిలోని కత్తితో జేబున్నీసా తల నరకబోయినదల్లా, ఆమె శోకసముద్రంలో మునిగివుండట చూసి, చప్పున కత్తి కింద పారవేసి, పిచ్చి దానిలా జుట్టు పీక్కుంటూ, "కొవ్విన కండకావరంలో నీతి నియమాలు లేకుండా సంచరించే పాదుషాకూతురు మరణించిన నా భర్తకోసం బిచ్చగత్తెలా కుళ్ళికుళ్ళి ఏడవటం చూశాను, అంతేచాలు!" అంటూ గదినుంచి బయటికి పరిగెత్తింది.

## 15

ఔరంగజేబు మేవారులోని ఉదయపుర పట్టణాన్ని నేలమట్టం చేసి. రాజసింహుణ్ణి తుదముట్టించేందుకు భారీఎత్తున సేనాసమీకరణ చేశాడు. ఇందుకోసం కాశ్మీరం నుంచి కేరళదేశంవరకూ గల తన సేన లన్నిటినీ ఉదయపురంమీదికి దాడి ప్రారంభించవలసిందిగా అతడు ఆజ్ఞలు పంపాడు.

పాదుషా జ్యేష్ఠపుత్రుడైన షాఆలం దక్షిణభారతంనుంచి తన సేనలతో ఉదయపురంకేసి బయలుదేరాడు. బెంగాలుదేశంలో రాజప్రతినిధిగా వున్న పాదుషా రెండవ పుత్రుడు అజంషా సైన్యాలను సమీకరించి ఉదయపురమార్గాన ప్రయాణ మయ్యాడు. పంజాబు, కాబూలు, కాశ్మీరదేశాలలోగల సైనికదళాలను వెంటబెట్టుకుని మూడవ కుమారుడైన అగ్బరు కదిలాడు. ఔరంగజేబు తన మూలసైన్యాన్ని తోడు తీసుకుని రాజస్థానంమీదికి దాడి వెడలాడు.

ఔరంగజేబుసైన్యం నాలుగు పాయలుగా బయలుదేరి తన రాజధానీ నగరంకేసి వస్తున్నవార్త తెలియగానే, రాణారాజసింహుడు తన రాజపుత్ర సైన్యాన్ని మూడు భాగాలు చేసి, ఒక భాగాన్ని తన పెద్దకుమారుడైన జయసింహుడికి ఒప్పచెప్పి. అతడిని నగరానికి సమీపాన గల పర్వతశిఖరాలమీద కాచివుండవలసిందిగా నియమించాడు. రెండవ సైన్యభాగాన్ని ద్వితీయపుత్రుడైన భీమసింహుడికిచ్చి, రాజధాని నగరపు పశ్చిమభాగాన్ని కాపాడవలసిందిగా ఆజ్ఞాపించాడు. మూడవభాగపు సైన్యంతో తానే నగరపు తూర్పుదిక్కునగల నయన మనబడే పర్వతకనుమలను రక్షించేందుకు బయలుదేరాడు.

అక్బరు తన సైన్యంతో అజమీరులో వున్న తండ్రిని కలుసుకున్నాడు ఆ రెండు సేనలూ కలిసి పర్వత పంక్తులలో నిరాటంకంగా ప్రయాణిస్తూ. దోవారి, దయలవారు, నయన అనే కనుమలను సమీపించాయి. సైన్యం దోవారికనుమ చేరగానే, ఔరంగజేబు అగ్బరును అయిదువేల సేనతో ముందుకు వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించి, తాను ఉదయసాగరంవద్ద శిబిరాలు వేయించాడు.

అగ్బరు నిరాటంకంగా ఉదయపురికేసి ప్రయాణించి, ప్రతిఘటన ఏమీ లేకపోవటంతో, నగరాన్ని రాజపుత్రులు వదిలి పారిపోయారనుకున్నాడు. ఒక రాత్రివేళ అతడు శిబిరాలు వేయించి ఆదమరచి వుండగా, రాజపుత్రులు హఠాత్తుగా దాడిచేసి అయిదువేల సైన్యాన్నీ ఛిన్నాభిన్నం చేశారు. అగ్బరు ప్రాణాలతో బయటపడి, గుజరాతుకు పారిపోయాడు.

దక్షిణదేశంనుంచి దాడికి బయలుదేరిన షాఆలం కాంకరలీ అనే పర్వతప్రాంతం చేరేసరికి ముందుమార్గం బందు అయిపోయింది వెనకనుంచి ఆహారపదార్థాలతో వస్తున్న వాహనాలన్నీ రాజపుత్రులు చేజిక్కించుకున్నారు. సైనికులు తిండిలేక మలమల మాడసాగారు

ఔరంగజేబుకు యీ పరాజయవార్తలింకా అందలేదు అతడు ఉదయసాగర తీరంలో నిర్మింపజేసిన శిబిరాలు, అచ్చు, ఢిల్లీనగరాన్ని పోలివున్నవి. అతడివెంట అతడిబేగం లందరూ వచ్చారు యోధపురిబేగంతోపాటు, నిర్మలకూడా వచ్చింది.

ఔరంగజేబు యోధపురిబేగం వున్న శిబిరభాగంలో వుండగా, ఒక ప్రతీహారిణి వచ్చి. "పేష్కారు దర్బారులో తమకోసం ఎదురుచూస్తున్నాడు. హజరత్ అగ్బర్‌షావారిని గురించిన సమాచారం తమకు వెంటనే తెలియపరచవలసి వున్నదట." అని చెప్పింది

ఔరంగజేబు ఏదో ప్రమాదం జరిగిందని శంకించి, త్వరత్వరగా దర్బారుకు వెళ్ళాడు పేష్కారు అగ్బరు వెంట వున్న అయిదువేల సేననూ రాజసింహుడి యోధులు మట్టుపెట్టిన వృత్తాంతం ఆయనకు చెప్పాడు వెంటనే ఔరంగజేబు శిబిరాలను ఎత్తివేసి సైన్యం కదిలేందుకు సిద్ధం కావలసిందిగా ఆజ్ఞలు జారీచేసి, తిరిగి యోధపురిబేగం వున్న శిబిరానికి వచ్చాడు. ఆ సమయంలో అక్కడ నిర్మల వున్నది

నిర్మలను ఔరంగజేబు ఇమ్‌రీబేగమ్ అని పిలిచేవాడు. అతడు నిర్మలతో, "ఇమ్‌రీబేగమ్! నేను శిబిరాలు ఎత్తివేయించి సేనతో ముందుకు కదులుతున్నాను కావాలనుకుంటే నీవు, నీ దారిన ఉదయపురం వెళ్ళవచ్చు." అన్నాడు.

"పాదుషావారు ఆజ్ఞ దయచేయిస్తే.. .. " అంటూ ఆగిపోయింది నిర్మల

"నా ఆజ్ఞ లేకపోతే, నీవు ఎంతకాలమైనా, నా రంగమహలులోనే వుంటావా?" అని ప్రశ్నించాడు ఔరంగజేబు.

"ఎంతకాలమో ఎలా వుండగలను. నాకు భర్త వున్నాడు." అన్నది నిర్మల

ఔరంగజేబు విచారవదనంతో, "అవును. నీకు భర్త వున్నాడు! నేను వృద్ధు

ణ్ణయిపోయాను. నా కింతమంది బేగంలు వున్నా, వారిలో ఎవ్వరినీ నిన్ను ప్రేమించినట్లు ప్రేమించలేదు. నీవు నాకు అందని ఫలానివి ; నిజమైన హిందూ పతివ్రతవు ; అనుమతిస్తున్నాను, ఇక నీవు వెళ్ళవచ్చు. నన్ను మాత్రం మరచిపోకు. నీ కేదయినా సహాయం కావలసివస్తే కబురంపు, చేయగలను." అన్నాడు.

నిర్మల అతడికి సలాం చేసి, "నా దొక చిన్న మనవి. మీ క్షేమం, రాణా రాజసింహుల క్షేమం కోరి, మీ యిద్దరూ సంధి చేసుకోవటం మంచిదని నేను భావిస్తున్నాను," అన్నది

"దానికి యిది సమయంకాదు," అన్నాడు ఔరంగజేబు

నిర్మల తన భర్త పంపిన పావురాన్ని ఔరంగజేబుకు యిస్తూ," పాదుషావారు దీన్ని భద్రంగా కాపాడవలసిందిగా కోరుతున్నాను. ఇది సుశిక్షితమైన పక్షి నేను ఏ సమయంలోనైనా జ్ఞప్తికివస్తే, దీన్ని వదలండి. నా విన్నపం తమకు తెలియపరుచుకుంటాను. ప్రస్తుతానికి నేను తమ సైన్యం వెంటనే వుండదలిచాను. కాని, నేను ఏక్షణాన్నయినా సైన్యం విడిచి నా దారిని నేను పోదలుచుకుంటే, అందుకు అనుమతిపత్రం యోధపురిబేగమువారు యిచ్చేలా అనుగ్రహించండి," అన్నది.

ఔరంగజేబు అంగీకారసూచకంగా తల వూపి, యోధపురిబేగం శిబిరంనుంచి బయటికి వచ్చాడు. ఆసరికి సూర్యోదయకాల మైంది పాదుషా అంతకు ముందే యిచ్చిన ఆజ్ఞల ప్రకారం సైన్యమంతా ముందుకు కదలటానికి సిద్ధంగా వుంది

ఔరంగజేబు తన సేనానాయకులకు అవసరమైన ఆజ్ఞలు జారీచేశాడు తన మూడవ కుమారుడు అగ్బరు ఏ మార్గాన వెళ్ళి ఉదయపురాన్ని సమీపించాడో, అదే మార్గాన తన మూలసైన్యాన్ని నడిపేందు కతడు నిర్ణయించుకున్నాడు మార్గంలో రాజసింహుడిచేత ఓడింపబడిన అగ్బరూ, అతడి సైన్యంలో కొంత భాగమైనా తనను కలుసుకోగలరని అతడి ఆశ.

కాల్బలసైన్యం, అశ్వికసైన్యం, ఫిరంగిదళాలూ ముందు బయలుదేరాయి, వారి వెనుకగా గుర్రంమీద ఎక్కి ఔరంగజేబు కదిలాడు అతడి వెనుకగా ఉదయపురిబేగం, యోధపురిబేగం, ఆమెవెంట నిర్మలా, జేబున్నిసా - ఏనుగుల అంబారీలలో వస్తున్నారు వారికి రక్షణగా వెన్నుకాచి మరికొంద రాశ్వికులూ, ఫిరంగి సైన్యం వస్తున్నది

మహానదీ ప్రవాహంలా రాజస్థానాన్నీ, రాజసింహుడి రాజధానీ నగరం ఉదయపురాన్నీ ముంచివేసేందుకు వస్తున్న పాదుషా సైన్యాన్ని చూసి రాజసింహుడు



మాత్రం కలగుండుపడలేదు ఔరంగజేబు సైన్యం నయనపర్వతపు యిరుకులోయ మార్గాన్ని చేరేసరికే, రాజసింహుడు తన సైన్యంతో పర్వతాలమీద సిద్ధంగా వున్నాడు. ఔరంగజేబు తన సైన్యానికి పార్శ్వభాగంలో వున్న శత్రువుసైన్యాన్ని చూసి కళవళపడ్డాడు. ఇరుకులోయలో వున్న తను, సైన్యాన్నంతా శత్రువులకేసి అవసరంకొందికీ ముందుకుగాని వెనుకకుగాని తిప్పటం సాధ్యంకాదు. అలా చేసే లోపల పార్శ్వమందున్న శత్రువు తన సేనల మధ్యభాగంలో పడి సర్వనాశనం కల్పించగలడు.

ఇప్పుడేమి చేయటమా అని ఔరంగజేబు ఆలోచిస్తున్నంతలో రాజసింహుడి యోధుల్లో కొందరు మొగలాయీ సైన్యం వెనుకభాగంమీద దాడిచేసి, ఆహార పదార్థాలతోనూ, ఆయుధాలతోనూ వస్తున్న బండ్లనూ, ఇతర వాహనాలనూ, కొల్ల గొట్టారు. ఔరంగజేబు సైన్యాన్ని వెనక్కు తిప్పి, శత్రుప్రమాదాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేసేంతలో, రెండవవైపు మార్గాన్ని ఛేదించి రాజసింహుడు మెరుపులా శత్రువులమీద పడి, దొరికినంతమందిని చంపి, తిరిగి కొండలమీదికి వెళ్ళిపోయాడు.

పరిస్థితి యిలా విషమించేసరికి ఔరంగజేబు ఉదయపురానికి మరో మార్గమేదైనా వున్నదేమో చూడవలసిందిగా తన సేనానులకు ఆజ్ఞ యిచ్చాడు. కొద్ది సేపటి తరువాత అశ్వికసైన్యంలో మన్సబుదారుగా వుంటున్న బఖత్ ఖాను అనేవాడు ఆయన దగ్గరకు వచ్చి, "ఉదయపురానికి వెళ్ళేందుకు యీ కొండలలో మరొకమార్గం వున్నది. వర్తకుడు దాన్ని నాకు చూపించాడు. అది కొండకనుమలో

చాలా యిరుకైన మార్గమే. కాని, అక్కడ మన నెదిరించేందుకు రాజపుత్రు లెవరూ లేరు." అని చెప్పాడు

"ఆ వర్తకుడు నమ్మదగినవాడేనా ?" అని ప్రశ్నించాడు ఔరంగజేబు.

"నమ్మదగినవాడే, అతడు ఉదయపురానికి శాలువలు అమ్ముకునేందుకు పోతూ, యిప్పుడు మన సైన్యంవెంటనే వున్నాడు." అన్నాడు బఖత్‌ఖాను.

"అయితే, సైన్యాలను ఆ కొత్తమార్గాన నడపండి." అని ఆజ్ఞాపించాడు పాదుషా.

ఈ కొత్తమార్గం మొగలాయీ సైన్యాలకు మరింత ప్రమాదంగా పరిణమించింది. సైన్యం కనుమలో ప్రవేశించి కొంత దూరం నడవగానే, రాజసింహుడు హఠాత్తుగా వచ్చి, దాని వెనుకభాగంమీద పడ్డాడు. అక్కడ అంతఃపురస్త్రీలు వున్న ఏనుగు అంబారీలూ, వారికి రక్షణగా వస్తున్న కొంత సైన్యం వున్నది.

రాజసింహుడి దాడి చూస్తూనే, మొగలు సైనికులు నిర్విణ్ణు లైపోయారు. రాజపుత్రులను ఎదిరించి పోరాడటం ప్రారంభిస్తే, జనానా స్త్రీలకు ఆ దొమ్మియుద్ధంలో ప్రమాదం జరుగుతుందేమో నని వాళ్లు శంకించారు. ఇది అవకాశంగా తీసుకొని రాజపుత్రులు మొగలుల్లో ఎక్కువభాగాన్ని చంపి, అంబారీఏనుగు లన్నిటినీ పట్టుకున్నారు.

మాణిక్యలాలు, రాజసింహుడివద్దకు వచ్చి, "మహారాజా ! మనకు ఔరంగజేబు బేగములందరూ దొరికిపోయారు. ఏమిచేయమని మీ ఆజ్ఞ ?" అని అడిగాడు.

"ఉదయపురిబేగంతో చంచలకు ఏదో పనివున్నది. కనుక, ఆమె నొక్కదాన్ని ఉదయపురానికి పంపి, తతిమ్మావాళ్ళను వదిలెయ్యి." అన్నాడు రాజసింహుడు.

"ఈ గందరగోళంలో వారిలో ఎవ రెవరో తెలుసుకోవటం కష్టం. అందరినీ ఉదయపురం పంపుతాను. అక్కడ చూసుకోవచ్చు: ఏమంటారు మహారాజా ?" అన్నాడు మాణిక్యలాలు.

అంతలో అక్కడికి నిర్మల వచ్చింది. బేగందుస్తుల్లో వున్నా ఆమెను రాజసింహుడూ, మాణిక్యలాలూ వెంటనే గుర్తించారు. ఆమె రాజసింహుడికి నమస్కరించి, "మహారాజా ! పాదుషా బేగంలలో ఒక్క యోధపురిబేగంను మాత్రం యిక్కడే వదిలి, తతిమ్మావారి నందరినీ — ఆయన కుమార్తె జేబున్నీసాతోసహా ఉదయపురికి పంపటం మంచిదని నా మనవి." అన్నది.

రాజసింహు డిందుకు అంగీకరించాడు. రాజపుత్రయోధులు వారి నందరినీ ఉదయపురానికి తీసుకుపోయేందుకు పల్లకీలలో ఎక్కించబోతున్నంతలో, నిర్మల వారితో,

"ఆ అంబారీలో వున్న హజరత్ యోధపురిబేగంవారిని మాత్రం ఇక్కడే వదలండి," అని చెప్పి ఆమెదగ్గిరకు వెళ్ళింది.

యోధపురిబేగం తననుకూడా ఉదయపురానికి తీసుకుపోవలసిందిగా నిర్మలకు చెప్పింది కాని నిర్మల చేతులు జోడించి ఆమెకు ప్రణామం చేస్తూ, "తల్లీ! మీరు మొగల్ పాదుషా వెంట వుండటమే మంచిది. తమ పుత్రు డేదో ఒకనాడు తప్పక ఢిల్లీపాదుషా కాగలడు. ఆ విధంగా దేశంలో శాంతి నెలకొనే అవకాశం వుంటుంది," అన్నది.

"నాబిడ్డ ఢిల్లీపాదుషా అవుతాడన్న నమ్మకం నా కేమాత్రంలేదు. అయినా, నీవు చెప్పినట్టు చేయటమే గౌరవప్రదంలా వుండేట్టు కనబడుతున్నది." అన్నది యోధపురిబేగం నిస్పృహగా.

నిర్మల ఆమెకు మరోసారి నమస్కరించి, ఉదయపురిబేగం, జేబున్నీసాల పల్లకీలవెనక మరో పల్లకీ ఎక్కి ఉదయపురానికి బయలుదేరింది.

తన అంతఃపురస్త్రీలను రాజసింహుడు ఖైదీలుగా పట్టుకుని ఉదయపురానికి పంపాడన్న వార్త తెలిసి ఔరంగజేబు బోనులో చిక్కిన సింహంలా గర్జించాడు. ఇంతటి అవమానాన్ని అతడేనాడూ పొందివుండలేదు. క్షణాలమీద తను సైన్యంతో ఉదయపురం చేరి, ఆ నగరాన్ని అగ్నికి ఆహుతి చేయాలన్న దృఢనిశ్చయంతో అతడు సైన్యాన్ని కనుమమార్గాన ముందుకు కదలవలసిందిగా ఆజ్ఞాపించాడు. సైన్యం కదిలింది. వారు కొంతదూరం నిరాటంకంగానే వెళ్ళగలిగారు. కాని, సైన్యముఖం మరింత ఇరుకుగా వున్న ఒక సొరంగప్రాంతాన్ని చేరేసరికి, ఎదురుగా భగ్గుమంటూ మంటలు లేచినై. రాజపుత్రులు ఆ ప్రదేశాన్ని ఎండుకట్టెలతో నింపి, వాటిమీద నూనె పోసి వుంచారు. మొగలులు అక్కడికి రాగానే ఆ కట్టెలకు నిప్పు పెట్టారు

మహోధృతంగా లేచిన మంటలకూ, అప్పుడు కమ్మిన పొగకూ, ఏనుగులూ, గుర్రాలూ చెదిరి, కాల్బలసైన్యంమీద పడినై. పెద్ద గందరగోళం ప్రారంభమైంది. అదే సమయంలో రాజసింహుడు కొండలపైనుంచి శత్రువులమీదికి ఫిరంగిగుండ్ల వర్షం కురిపించాడు.

ఔరంగజేబు సైన్యంతో వచ్చినదారినే తిరోగమించాలని చూశాడు. ఇంతలో ఆవైపునుంచికూడా అగ్నిజ్వాలలు లేచినై. కనుమమార్గాలు రెండూ దాట శక్యం కాకుండా తయారైనై. పైనుంచి రాజసింహుడిసైన్యం పెద్దపెద్ద బండరాళ్ళనూ, ఫిరంగిగుండ్లనూ శత్రువులమీద వర్షంలా కురిపిస్తున్నారు.

ఔరంగజేబు తనకు సర్వనాశనం తప్పదన్న భయంతో వణికిపోయాడు. అతడు వజ్రఖచితమైన తన శ్వేతోష్ణీషాన్ని తలనుంచి లాగి దూరంగా పారవేసి, కంకర ధూళి వింత తీసుకుని తలమీద చల్లుకున్నాడు. ఆ సమయంలో అతడికి, "ఒక రాజ పుత్రబాలిక నన్ను రక్షించగలదు," అన్న ఆశ కలిగింది. ఆ వెంటనే అతడు నిర్మల యిచ్చిన పావురాన్ని ఆకాశంలోకి వదిలాడు.

## 16

సార్వభౌముడి పత్నిచేత తమలపాకులవిడెం యిప్పించుకుని, ఆమెచేత సేవ చేయించుకుంటేతప్ప, చంచలకుమారికి వివాహం కాదని, జ్యోతిష్కుడు చెప్పాడు గదా! ఆకారణంగానే, చంచల ఆ పరిచర్యలు చేసేందుకు ఉదయపురిబేగంను ఉదయ పురానికి రావలసిందిగా లేఖ రాసి, దానిని నిర్మలచేత ఢిల్లీకి పంపింది. తను ఖైదీగా దొరకగానే ఉదయపురిబేగంకు యీ విషయం గుర్తుకు వచ్చింది. మహారాజ్ఞియైన తాను ఒకసామాన్య రాజపుత్రకన్యకు సేవ చేయడమా? అన్న కోపంతో, ఆమె ఉదయపుర రాజాంతఃపురం చేరగానే చంచలను తీవ్రంగా దూషించింది. కాని, చంచల ఆమెపై ప్రతీకారం చేయగలనని భయపెట్టేసరికి, వణికిపోయి దాసీలా ఆమెకు తమలపాకులు చుట్టి యిచ్చి, వినసకర్రతో వీస్తూ పక్కన ఒదిగి నిలబడింది.

జేబున్నీసామాత్రం యిటువంటి డాబుదర్పాలేవీ ప్రదర్శించలేదు. ఆమెకు తాను రాజపుత్రుల ఖైదీననీ, తన నెవరూ యింతలో రక్షించలేరనీ నమ్మకం కుదిరి పోయింది. అంతేకాక తన ప్రియుడైన ముబారక్‌ను పాములచేత కరిపించి చంపించా ననే బాధ, హృదయశల్యంలా ఆమెను పట్టి పీడిస్తున్నది.

జేబున్నీసా మానసికస్థితి యిలా వున్న దశలో, ఆమెకు రాత్రివేళ తనగదిలో ఏదో అలికిడి అయినట్టు తోచి, కళ్ళు తెరిచింది. కిటికీ పక్కగా ఆమెకొక మానవా కారం కనిపించింది. చంచలకుమారి తనను హత్య చేసేందుకు ఎవరో రాజపుత్రుణ్ణి పంపివుంటుం దని భయపడిన జేబున్నీసాకు, పరీక్షించిచూడగా ఆ ఆకారం ముబా రక్‌దిలా తోచింది. ముబారక్ భూతమై తనను పట్టవచ్చా డనుకున్నది జేబున్నీసా.

"ఎవ రది?" అంటూ జేబున్నీసా తల్పంమీదినుంచి లేచి కూర్చున్నది.

"నేను ముబారక్‌ను," అన్న దా ఆకారం.

"అవును. నీ కంఠస్వరం ముబారక్‌దే! నువ్వు భూతమై యిక్కడికి వచ్చా వన్నమాట! ఎందుకు? నన్ను చంపటానికా! చంపు. నా ప్రియుడి భూతానివి గనక, నీ చేతుల్లో సుఖంగా ప్రాణం వదులుతాను," అన్నది జేబున్నీసా.



ముబారక్ ఆమెముందుకు వచ్చి నిలబడి, "నేను బతికేవున్నాను; భూతాన్ని కాదు. నిజంగా నీవు చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నావా, షహజాదీ?" అని ప్రశ్నించాడు.

జేబున్నీసా ఆగని దుఃఖంతో అతడి పాదాలు పట్టుకుని, కన్నీళ్ళతో వాటిని తడుపుతూ, "ప్రియా, ముబారక్! నువ్వు బతికేవున్నావా? నిన్ను సమాధి చేసేశారని అజీరుద్దీన్ చెప్పినదంతా అబద్ధమేనా?" అని అడిగింది.

ముబారక్ ఆమెను హృదయానికి హత్తుకుని, తనను మాణిక్యలాలు ఏ విధంగా కాపాడిందీ, తరవాత తాను ఉదయపురం ఎలా చేరిందీ చెప్పి, "పాదుషామీద పగ తీర్చుకున్నాను! వర్తకుడివేషంలో ఆయనసేనానితో నమ్మబలికి, మొత్తం మొగలు సైన్యాన్నంతా రాజసింహుడు పన్నిన వ్యూహంమధ్యకు నడిపించాను. ఇక వాళ్ళెవరూ బతికి బయటపడలేరు, నీ తండ్రికి నేను చేసిన యీ ద్రోహం నీకు కోపం తెప్పిస్తున్నదా?" అన్నాడు.

"నేను కోపతాపాల కిప్పుడు అతీతురాలిని. నేను సార్వభౌమ పుత్రికను కాను; సామాన్య యువతిని. నన్ను వివాహ మాడేందుకు నువ్వంగీకరిస్తే, నా పాపాలన్నిటికీ ప్రాయశ్చిత్తం జరిగిపోయినట్టే," అన్నది జేబున్నీసా.

"అవును, మరణించేముందు నీ కోర్కె తీరుస్తాను. పాదుషాకు నే చేసిన ద్రోహానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ముసల్మానునయివుండి, హిందువులకు సహాయం చేయటంద్వారా నేను పతితు ణ్ణయిపోయాను. అల్లా నన్ను క్షమించడు ఈరాత్రే నిన్ను ధర్మయుక్తంగా వివాహమాడి, పాదుషా సైన్యం ఉన్నచోటుకు పోతాను. యుద్ధంలో బతికి బయటబడితే, ఏదోవిధంగా వచ్చి నిన్ను కలుసుకుంటాను పద, యిప్పుడే మశీదుకు పోదాం," అంటూ ముబారక్ బయలుదేరాడు

ఉదయపురంలో వ్యాపారనిమిత్తం కొందరు ముసల్మానులు వుంటున్నారు. వా శ్శొక మశీదుకూడా నిర్మించుకున్నారు ముబారక్, జేబున్నీసాను అక్కడకు తీసుకుపోయి మౌల్వీ పౌరోహిత్యంకింద వివాహమాడి, ఆమెను తిరిగి రాజ ప్రాసాదంలో వదిలాడు.

మొగలుసైన్యాలను రాజపుత్రులు పెట్టిన బోనులోకి నడిపేందుకు సహాయ పడినందుగ్గాను, రాజసింహుడి అనుమతితో మాణిక్యలాలు ముబారక్‌కు రాజ ప్రాసాదంలో జేబున్నీసాను చూసే అవకాశం కల్పించాడు

* * * *

ఔరంగజేబు వదిలిన పావురం, నిర్మలవద్దకు వచ్చి వాలింది ఆమె దాని కాలికి వున్న కాగితం విప్పి చదివింది అందులో ఔరంగజేబు నిర్మలకు తన పరిస్థితీ, సైన్య పరిస్థితీ చెప్పి — "ఆహారం, నీరూ లేక మేమంతా మలమల మాడిపోతున్నాం. ఢిల్లీ పాదుషా నే డొక్క రొట్టెముక్కకోసం యాచిస్తున్నాడు నీవు తగినసహాయం చేయ గలవని నమ్ముతున్నాను —" అంటూ ముగించాడు

నిర్మల ఆ వుత్తరాన్ని తనభర్త మాణిక్యలాలుకు చూపించి, "యిది సంధికి తగినసమయం। మహారాజుగారితో సంప్రతించండి," అన్నది.

మాణిక్యలాలు ఆలేఖను రాజసింహుడికి చూపించాడు. రాజసింహుడు తన మంత్రులతో చర్చించి, సంధికి తన అంగీకారం తెలియబరిచాడు

పాదుషా తన సైన్యాన్నంతా మేవాడు ప్రాంతాలనుంచి ఉపసంహరించుకోవాలి గోహత్యలూ, దేవాలయాలు పడగొట్టడం, జిజియాపన్ను వసూలూ వెంటనే ఆపాలి. వీటి కిష్టపడితే మొగలుసైన్యం నిరాటంకంగా కనుమనించి వెనుదిరిగిపోవచ్చు — ఇవీ సంధిషరతులు.

మాణిక్యలాలు యీ సంధిషరతులు రాసిన కాయితంతోపాటు, తన భార్య నిర్మల రాసినలేఖ నొకదాన్నికూడా కలిపి, పావురం కాలికి కట్టి వదిలాడు అది ఔరంగజేబు

వద్దకు పోయి వారిచేది పాదుషా సంధిషరతులు చదివి, వాటిని అంగీకరించటం యిష్టంలేకపోయినా, చేసేదిలేక అన్నిటికీ తనసమ్మతి తెలియచేశాడు

రాణా రాజసింహుడు తనకు ఖైదీలైన ఔరంగజేబు జనానాస్త్రీలను అతడి దగ్గిరకు పంపి, తాను కొల్లగొట్టిన వారి ఆహారపదార్థా లన్నిటినీ తిరిగి యిచ్చివేశాడు. ఔరంగజేబు అవమానంతో కుళ్ళిపోతూ, తన సైన్యాన్ని వెంటబెటుకుని ఉదయ సాగరం దిశకు తిరోగమించాడు

పాదుషా రాజసింహుడికి ఓడి తిరోగమించా డని తెలియగానే చంచలకుమారి తండ్రి అయిన రూపనగరప్రభువు విక్రమసింహుడు ఒకదూతచేత రాజసింహుడికి ఒకలేఖ పంపాడు నేను రెండువేల అశ్వికదళంతో ఉదయపురం పస్తున్నాను పర్వతమార్గా లన్నిటినీ తెరిచివుంచవలసిందిగా కోరుతున్నాను." అని అందులో రాసివున్నది

ఈ లేఖ చూసి రాజసింహుడూ, చంచలకుమారీకూడా అందులోవున్న భావ మేమిటో అర్ధంకాక ఆశ్చర్యపడ్డారు. రెండువేల అశ్వికులతో ఆయన చేయగలిగిం దేమిటి ? నా జాగ్రత్తలో నేను వుంటాను," అనుకుని, రాజసింహుడు రూపనగ ప్రభుడి అశ్విక సైన్యాలను నిరాటంకంగా రాజధానికి రానివ్వవలసిందిగా తన సైనికోద్యోగులకు ఆజ్ఞ పంపాడు.

## 17

ఔరంగజేబు ఉదయసాగరతీరంలో శిబిరాలు స్థాపించి, కొత్తసేనికులకోసం తన సామ్రాజ్యంలోని అన్నిమూలలకూ ఆజ్ఞలు పంపాడు అటుదికి రాజసింహుడితో చేసుకున్న సంధికి కట్టుబడివుండాలనీ ఏకోశానాలేదు చంచలకుమారిని తనపరం చేయ నిదే, రాజసింహుణ్ణి క్షమించనని అతడు తనమంత్రి సామంతు లందరికీ చెప్పాడు దిలీర్ ఖాన్ అనే సేనాని నాయకత్వంకింద కొంత మొగలుసైన్యాన్ని దైసురీమార్గం కుండా ఉదయపురంమీదికి దాటిపోవలసిందిగా ఆజ్ఞలు జారీచేశాడు.

ఈ యుద్ధప్రయత్నాల వార్తలు రాగానే, రాజసింహుడు ఈ సంధిఉల్లంఘన ఏమి టని అడిగేందుకు పాదుషావద్దకు దూతలను పంపాడు ఔరంగజేబు, "రూపనగర రాజకుమార్తె చంచలను సగౌరవంగా రాజసింహుడు నా వద్దకు పంపనిదే, అతణ్ణి నేను క్షమించను." అని చెప్పాడు.

తరువాత రూపనగరరాజుకు ఒక లేఖ రాసి అందులో, "నీ కుమార్తె చంచల యింకా నా దగ్గరకు రాలేదు ఆమెను వెంటనే తీసుకురావాలి అలా జరగకపోయిందో, నీ రూపనగరాన్ని నేలమట్టం చేయగలను." అని తెలియపరిచాడు.

రూపనగరరాజు విక్రమసింహుడు ఔరంగజేబు లేఖకు వెంటనే జవాబు పంపాడు "నేను రెండువేల అశ్వికసైన్యంతో మీ దగ్గరకు వస్తున్నాను."

'సేనతో రావటం ఎందుకు ? బహుశా, నాకు సహాయం చేయటంకోసం అయి వుంటుంది.' అనుకున్నాడు ఔరంగజేబు

జేబున్నీసా తిరిగి మొగలు శిబిరాలు చేరింది ముబారక్ కూడా వచ్చాడు ఔరంగజేబు తన కుమార్తెతో, "నీ వివాహంసంగతి విన్నాను అది రాజసింహుడి బలవంతంవల్ల జరిగింది కనుక నిన్ను క్షమిస్తున్నాను." అని చెప్పి, ముబారక్‌ను తన శిబిరానికి పిలిపించి, "నీవు నాకు అల్లుడవైన కారణంగా నీ అపరాధా లన్నీ క్షమిస్తున్నాను సైన్యంలో నిన్ను రెండువేల యోధులకు మన్సబుదారుగా నియమించాను దిలీర్‌ఖాన్ సైన్యంతో అగ్బరుకు సహాయ పడేందుకు వెళ్ళుతున్నాడు. నీ వతినివెంట వెళ్ళు," అని చెప్పాడు. తరవాత అతడు దిలీర్‌ఖాన్‌కు ఒకలేఖ రాసిపంపాడు అందులో యిలావున్నది ముబారక్‌ను మన్సబుదారుగా చేసి నీ దగ్గరకు పంపుతున్నాను. అతడు బతికివుండేందుకు వీలులేదు యుద్ధంలో మరణిస్తే మహాబాగు, అలాజరక్కపోతే నీవే ఆతణ్ణి సంహరించాలి.

దిలీర్‌ఖాన్ ఒకకొత్తమార్గాన ఉదయపురంమీదికి దాడి వెడలిన రోజునే రూపనగరప్రభువు విక్రమసింహుడు, పర్వతప్రదేశంలో వున్న రాజసింహుడి సైనిక స్థావరాలదగ్గిరకు తన రెండువేల అశ్వికసైన్యంతో వచ్చాడు ఒంటరిగా తనను చూడవచ్చిన విక్రమసింహుడికి రాజసింహుడు స్వాగతం చెప్పాడు

విక్రమసింహుడాయనకు కొన్ని విలువైన కానుక లిచ్చి, "నా అపరాధాలను మన్నించండి ఔరంగజేబును మీరు ఓడించినతీరు నా కెంతో సంతోషం కలిగించింది నేనూ, నా రెండువేల అశ్వికసైన్యం మీ సేవ చేయటానికి సిద్ధంగా వున్నాం, ఆజ్ఞాపించండి," అన్నాడు

విక్రమసింహుడి మాటలకు రాజసింహుడు చాలా సంతోషించి, "దిలీర్‌ఖాన్ సైన్యాన్ని ఎదిరించేందుకు, సేనానులు గోపీనాధరాగూరు, మాణిక్యలాలులను పంపాను మీ రెండువేల సైన్యంతో మీరూ వెళ్ళండి. నే నిక్కడినుంచి కదిలేందుకు

వీలులేదు. ఉదయసాగర తీరంలో వున్న ఔరంగజేబు తిరిగి దాడి ప్రారంభిస్తే, నేను ఎదుర్కొనవలసివున్నది." అని చెప్పాడు

విక్రమసింహుడు తన సేనతో బయలుదేరివెళ్ళి ఒక కొండమార్గంలో దిలీర్ ఖాన్‌కోసం కాపు వేశాడు గోపీనాధరాగూరూ, మాణిక్యలాలులు మొగలు సైన్యాల పార్శ్వభాగాలవెంట నడుస్తూ, మీద పడేందుకు అదనుకోసం చూస్తున్నారు ఒకకొండ మలుపు తిరగగానే దిలీర్‌ఖాన్‌కు విక్రమసింహుడి సైన్యం కనిపించింది ముబారక్‌ను ఎలాఅయినా తుదముట్టించదలుచుకున్న అతడు, "ముబారక్! ఒక వంద మంది కాల్బల సైనికుల్ని తీసుకుపోయి, ఆ రాజపుత్రులను ఎదిరించు ఇంతలో నేను ఆశ్వికదళాలతో వచ్చి, వాళ్ళమీద విరుచుకుపడతాను." అన్నాడు

ముబారక్ వందమంది యోధులను తీసుకుని విక్రమసింహుడిమీదకి ురికాడు. విక్రమసింహుడి ఆశ్వికులు మొగలులను ఊచకోత కోయసాగారు. ఇదే మంచి అద నునుకుని, గోపీనాధరాగూరూ, మాణిక్యలాలులు తమ సైన్యంతో వచ్చి దిలీర్‌ఖాన్‌మీద పడ్డారు

పోరు ఘోరంగా సాగింది దిలీర్‌ఖాన్ సైన్యం చిత్తుగా ఓడింపబడింది విక్రమసింహుడి ఆశ్వికుల ధాటికి ముబారక్ సైన్యంలో అయిదుగురుతప్ప అందరూ మరణించారు

మాణిక్యలాలు అక్కడికి వచ్చేసరికి ముబారక్ తనవెంట వున్న కొద్దిమందితో యింకా విక్రమసింహుడి ఆశ్వికులను ఎదిరించి పోరాడుతూనే యున్నాడు. మాణిక్యలాలు ముబారక్‌ను గుర్తించి, "ముబారక్ యుద్ధం మాను. నిన్నెవరూ ఏమీ చెయ్యరు నీ యిష్టంవచ్చినచోటుకు వెళ్ళిపోవచ్చు." అని కేకవేశాడు

"నేనిక్కడే చావదలిచాను మాణిక్యలాల్!" అన్నాడు ముబారక్.

విక్రమసింహుడి ఆశ్వికులు వెనుకకు తగ్గి యీ వింతసంభాషణ వింటున్నారు. అంతలో కొండచరియపైనుంచి ఒకఫిరంగి మ్రోగింది. ఆ ధ్వని వచ్చినవైపుకు మాణిక్యలాలు చూసేంతలో ముబారక్ తల శరీరంనుంచి వేరైపోయింది. ఫిరంగి కాల్చిన ధ్వని వచ్చినచోట ఒక స్త్రీ నిలబడి పిచ్చిగా కేకలు పెడుతున్నది ఆమె దరియాబీబీ!

"ఆ ఫిరంగి కాల్చిన స్త్రీని పట్టుకోండి," అని మాణిక్యలాలు తన అనుచరులకు ఆజ్ఞ యిచ్చాడు. కాని దరియా వాళ్ళకు దొరకకుండా రాళ్ళల్లో ఎక్కడో మాయమైపోయింది ఆ తరవాత ఆమెను చూచినవా రెవరూ లేరు.

దిలీర్ ఖాన్‌ను ఓడించి విక్రమసింహుడు రాజసింహుడి శిబిరానికి వచ్చాడు రాజసింహు డతన్ని ఆదరంగా ఆలింగనం చేసుకున్నాడు అప్పుడు విక్రమసింహుడు, "నాకుమార్తె విషయం యింతవరకూ మనం మాట్లాడుకోలేదు ఆమెను త్రికరణ శుద్ధిగా ఆశీర్వదించి, మీకు కన్యాదానం చేయదలిచాను," అన్నాడు.

రాజసింహుడు పరమానందంతో తన మామగారిని వెంటబెట్టుని ఉదయపురం వెళ్ళాడు. అక్కడ చంచలకుమారీ రాజసింహులకు వైభవంగా వివాహం జరిగి పోయింది

ఔరంగజేబుపాదుషాను గురించి ఒకటి రెండు మాటలు చెప్పకతప్పదు అతడు అజీంషా తెచ్చిన సైన్యంతో కలిసి, రాజసింహుడిపై మరొకదాడి చేశాడు ఆ సమయంలో రాజసింహుడికి, మార్వారు దేశస్థుడైన దుర్గాదాసు సహాయంగా వచ్చాడు అప్పుడు జరిగిన యుద్ధంలో ఔరంగజేబు మరొకసారి పరాజితుడై చిత్తోడ్‌కు పారిపోయాడు

అక్కడకూడా అతడికి పరాజయమే సంప్రాప్తించింది సుబలదా సనే రాజపుత్ర సేనానాయకుడు, ఔరంగజేబునూ అతడికి సహాయంగా వచ్చిన రోహిలాఖానునూ యుద్ధంలో ఓడించాడు. ఔరంగజేబు చావగా మిగిలిన కొద్ది సేనతో అజ్మీరుకు పారిపోయాడు. ఆ నాటితో అతడికి ఉదయపురాన్ని నాశనం చేయగలననే ఆశ అడుగంటింది.

